www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 1-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 347 | హైదరాబాద్ సిటీ

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి రా. 9.11 తదుపరి అష్టమి; నక్షత్రం: మూల రా. 11.13 తదుపరి పూర్వాషాఢ. వర్జ్యం: ఉ.7.03-8.40, రా.9.36-11.13, దుర్ముహూర్తం: మ.12.44-1.33, మ.3.10-3.59, అమృతఘడియలు: సా.4.45-6.22, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.14, సూర్యాస్తమయం: 6.25

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జోరుకు బ్రేక్


మోహిత్ శర్మ (3/25)

- సన్‌రైజర్స్ తడ'బ్యాటు'
- 7 వికెట్లతో గుజరాత్ గెలుపు
- మోహిత్, మిల్లర్ విజృంభణ

అహ్మదాబాద్: గత మ్యాచ్‌లో భారీ హిట్టింగ్‌తో ప్రత్యర్థుల్లో వణుకు పుట్టించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ అదే జోరును కొనసాగించలేకపోయింది. బంతితో మోహిత్ శర్మ (3/25), బ్యాట్‌తో మిల్లర్ (27 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 44నాటౌట్) చెలరేగడంతో..ఆదివారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 7 వికెట్లతో సన్‌రైజర్స్‌పై గెలిచింది. తొలుత హైదరాబాద్ 20 ఓవర్లలో 162/8 స్కోరు చేసింది. అబ్దుల్ సమద్ (29), అభిషేక్ శర్మ (29), క్లాసెన్ (24) ఫర్వాలేదనిపించారు. రషీద్, నూర్, ఒమర్జాయ్‌లకు తలో వికెట్ దక్కింది. లక్ష్యాన్ని గుజరాత్ 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సాయి సుదర్శన్ (45), గిల్ (36) రాణించారు. మోహిత్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

సునాయాసంగా..: ఛేదనలో మిల్లర్ ఫటాఫట్ ఆటతో గుజరాత్ అలవోకగా నెగ్గింది. ఓపెనర్లు సాహా (25), గిల్ తొలి వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యంతో టైటాన్స్‌కు చక్కని ఆరంభాన్నిచ్చారు. అయితే, 2 సిక్స్‌లతో జోరు చూపిన సాహాను షాబాజ్ బౌల్డ్ చేయడంతో.. పవర్‌ప్లే ముగిసేసరికి టైటాన్స్ 52/1తో మెరుగైన స్థితిలో నిలిచింది. ఆ తర్వాత గిల్, సుదర్శన్ స్కోరు బోర్డును నడిపించారు. 10వ ఓవర్‌లో గిల్‌ను మార్కండే అవుట్ చేయడంతో.. క్రీజులోకి వచ్చిన మిల్లర్ పవర్ బ్యాటింగ్‌తో హైదరాబాద్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. 16వ ఓవర్‌లో మార్కండే బౌలింగ్‌లో మిల్లర్ 4,4,6,6తో ఏకంగా 24 పరుగులు రాబట్టడంతో.. గుజరాత్ 138/2తో విజయానికి చేరువైంది. చివరి 24 బంతుల్లో 25 రన్స్ అవసరమవగా, సుదర్శన్‌ను కమిన్స్ క్యాచవుట్ చేశాడు. కానీ, మిల్లర్.. 5 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు.


మిల్లర్ (44నాటౌట్)

కట్టడి చేసిన నూర్, రషీద్: గతమ్యాచ్‌లో ముంబైపై 277 పరుగుల భారీస్కోరు చేసి ఔరా అనిపించిన హైదరాబాద్ బ్యాటర్లు.. ఈసారి గుజరాత్ బౌలర్ల దెబ్బకు తడబడ్డారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు ఎంచుకొన్న సన్‌రైజర్స్.. ఓపెనర్లు హెడ్ (19), మయాంక్ అగర్వాల్ (16)లను స్వల్ప స్కోరుకే కోల్పోయింది. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన అభిషేక్ 2 సిక్స్‌లతో ఎదురుదాడి చేయడంతో.. పవర్‌ప్లేలో హైదరాబాద్ 56/1తో భారీ స్కోరు చేసేలా కనిపించింది. అయితే, మధ్య ఓవర్లలో రషీద్, నూర్ పరుగులను కట్టడి చేస్తూ రైజర్స్‌పై ఒత్తిడిపెంచారు. హెడ్‌ను నూర్ బౌల్డ్ చేయగా.. ధాటిగా ఆడే ప్రయత్నం చేస్తున్న అభిషేక్‌ను మోహిత్ క్యాచవుట్ చేశాడు. దీంతో 10 ఓవర్లకు సన్‌రైజర్స్ 74/3తో నిలిచింది. డేంజర్‌మన్ క్లాసెన్‌ను రషీద్ బోల్తా కొట్టించడంతో సన్‌రైజర్స్ ఇబ్బందుల్లో పడింది. సమద్ ఎదురుదాడి చేసినా.. మార్‌క్రమ్ (17)తోపాటు మిగిలిన వారు ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు.

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (బి) నూర్ 19, మయాంక్ అగర్వాల్ (సి) దర్శన్ (బి) అజ్మతుల్లా 16, అభిషేక్ (సి) గిల్ (బి) మోహిత్ 29, మార్‌క్రమ్ (సి) రషీద్ (బి) ఉమేష్ 17, క్లాసెన్ (బి) రషీద్ 24, షాబాజ్ (సి) తెవాటియా (బి) మోహిత్ 22, సమద్ (రనౌట్) 29, వాషింగ్టన్ (సి) రషీద్ (బి) మోహిత్ 0, కమిన్స్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 162/8; వికెట్ల పతనం:** 1-34, 2-58, 3-74, 4-108, 5-114, 6-159, 7-159, 8-162; **బౌలింగ్:** అజ్మతుల్లా 3-0-24-1, ఉమేశ్ 3-0-28-1, రషీద్ 4-0-33-1, నూర్ అహ్మద్ 4-0-32-1, మోహిత్ 4-0-25-3, దర్శన్ 2-0-18-0.

గుజరాత్: సాహా (సి) కమిన్స్ (బి) షాబాజ్ 25, గిల్ (సి) సమద్ (బి) మార్కండే 36, సుదర్శన్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 45, మిల్లర్ (నాటౌట్) 44, విజయ్ శంకర్ (నాటౌట్) 14; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 19.1 ఓవర్లలో 168/3; వికెట్ల పతనం:** 1-36, 2-74, 3-138; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-27-0, షాబాజ్ 2-0-20-1, ఉనాద్కట్ 3.1-0-33-0, వాషింగ్టన్ 3-0-27-0, మార్కండే 3-0-33-1, కమిన్స్ 4-0-28-1.

నేటి మ్యాచ్

ముంబై x రాజస్థాన్ — రా.7.30 నుంచి

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	ముస్తాఫిజుర్ (చెన్నై)
181 పరుగులు	7 వికెట్లు




పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	2	2	0	0	4	1.047
చెన్నై	3	2	1	0	4	0.976
రాజస్థాన్	2	2	0	0	4	0.800
గుజరాత్	3	2	1	0	4	-0.738
హైదరాబాద్	3	1	2	0	2	0.204
లఖ్‌నవూ	2	1	1	0	2	0.025
ఢిల్లీ	3	1	2	0	2	-0.016
పంజాబ్	3	1	2	0	2	-0.337
బెంగళూరు	3	1	2	0	2	-0.711
ముంబై	2	0	2	0	0	-0.925

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

లంక రికార్డు స్కోరు

- తొలి ఇన్నింగ్స్ 531 ఆలౌట్
- బంగ్లాదేశ్ 55/1 ● రెండో టెస్ట్

చట్టోగ్రామ్: కమిందు మెండిస్ (92 నాటౌట్), ధనంజయ డిసిల్వ (70) అర్ధ శతకాలతో రాణించిన వేళ.. బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌లో శ్రీలంక పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 314/4తో ఆటకు రెండో రోజైన ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన లంక 531 పరుగుల భారీ స్కోరు చేసింది. ఒక్క బ్యాటర్ కూడా సెంచరీ నమోదు చేయకుండా అత్యధిక పరుగులు చేసిన జట్టుగా శ్రీలంక సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ క్రమంలో 1976లో న్యూజిలాండ్‌తో కాన్పూర్ టెస్ట్‌లో ఒక్క శతకం కూడా లేకుండా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ సాధించిన 524/9 స్కోరును లంక అధిగమించింది. షకీబల్ 3, హసన్ మహ్మూద్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన బంగ్లా రెండో రోజు ఆట ఆఖరుకు 55/1 స్కోరు చేసింది. జాకిర్ హసన్ (28 బ్యాటింగ్), తైజుల్ ఇస్లాం (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. లంక స్కోరుకు బంగ్లా 476 పరుగులు వెనుకంజలో ఉంది.

చెన్నైకి ఝలక్

- ఢిల్లీ క్యాపిటల్స్ బోణీ
- వార్నర్, పంత్ అర్ధసెంచరీలు
- ధోనీ మెరుపులు వృథా


పంత్ (51)

విశాఖపట్నం: రెండు వరుస విజయాలతో ఊపు మీదున్న పటిష్ఠ చెన్నై సూపర్ కింగ్స్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ బ్రేక్ వేసింది. తమ హోమ్ గ్రౌండ్‌లో పేసర్లు ముకేశ్ కుమార్ (3/21), ఖలీల్ అహ్మద్ (2/21) విశేషంగా రాణించడంతో 20 పరుగులతో గెలిచిన ఢిల్లీ తాజా సీజన్‌లో ఎట్టకేలకు బోణీ చేసింది. అటు ప్రేక్షకుల కేరింతల మధ్య ఏడాది తర్వాత బరిలోకి దిగిన ఎంఎస్ ధోనీ (16 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 నాటౌట్) తన పవర్‌హిట్టింగ్‌తో ఆకట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. వార్నర్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 52), పంత్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 51), పృథ్వీ షా (27 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 43) సత్తా చాటారు. పథిరనకు 3 వికెట్లు దక్కాయి. ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్లకు 171 రన్స్ చేసి ఓడింది. రహానె (30 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 45), మిచెల్ (26 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 34) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఖలీల్ నిలిచాడు.

పేసర్ల జోరు: భారీ ఛేదనలో చెన్నైని ఢిల్లీ పేసర్లు హడలెత్తించారు. వారి ధాటికి తొలి 23 బంతుల దాకా ఒక్క ఫోర్ కూడా రాలేదు. అటు ఫీల్డింగ్‌లోనూ అదరగొట్టారు. ఇక ఖలీల్ తన వరుస ఓవర్లలో ఓపెనర్లు రుతురాజ్ (1), రచిన్ (12 బంతుల్లో 2)లను పెవిలియన్ చేర్చాడు. అప్పటికి జట్టు స్కోరు 18 బంతుల్లో 7/2. ఈ దశలో రహానె-మిచెల్ జోడీ ఆదుకునే ప్రయత్నం చేసింది. ఇషాంత్ ఓవర్‌లో రహానె రెండు ఫోర్లు, నోకియా ఓవర్‌లో ఓ సిక్సర్‌తో జట్టు పవర్‌ప్లేలో 32 పరుగులు చేసింది. పదో ఓవర్‌లో చెరో సిక్సర్‌తో 17 రన్స్ సమకూరాయి. ఈ దశలో మిచెల్‌ను అక్షర్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 68 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఇక 14వ ఓవర్‌లో పేసర్ ముకేశ్ ఝలక్ ఇస్తూ రహానె, రిజ్వీ (0)ల వికెట్లను తీశాడు. అప్పటికి చెన్నై విజయానికి 38 బంతుల్లో 89 రన్స్ కావాలి. ఇక శివమ్ దూబే (18) నిష్క్రమణ తర్వాత అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్న ధోనీ క్రీజులోకి రావడంతో విశాఖ స్టేడియం హోరెత్తింది. వీరిని సంతృప్తి పరుస్తూ ధోనీ ఆఖరి ఓవర్‌లో 4,6,4,6తో 20 రన్స్ రాబట్టి జట్టు ఓటమి అంతరాన్ని గణనీయంగా తగ్గించాడు. జడేజా (21 నాటౌట్)తో కలిసి ఏడో వికెట్‌కు అజేయంగా 51 పరుగులు అందించాడు.

వార్నర్, పంత్ అర్ధసెంచరీలు: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్లు వార్నర్, పృథ్వీ షా శుభారంభాన్ని అందించారు. అయితే మధ్య ఓవర్లలో కాస్త నెమ్మదించినా.. చివర్లో కెప్టెన్ పంత్ బ్యాట్ ఝుళిపిస్తూ ఫామ్‌ను చాటుకున్నాడు. ఆరంభ ఐదో ఓవర్‌లో వార్నర్ 6,4,4.. తర్వాతి ఓవర్‌లో షా 4,4,4 బాదడంతో ఈ 12 బంతుల్లోనే జట్టు 38 రన్స్ రాబట్టింది. అటు పవర్‌ప్లేను జట్టు 62 పరుగులతో ముగించింది. తర్వాత కూడా వార్నర్ జోరు పెంచుతూ 32 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ పదో ఓవర్ నుంచి ఢిల్లీ ఇన్నింగ్స్ నెమ్మదించింది. ఇక, వార్నర్ రివర్స్ స్వీప్‌నకు ప్రయత్నించగా.. థర్డ్‌మ్యాన్‌లో పథిరన డైవ్ చేస్తూ గాల్లోనే బంతిని అందుకున్న తీరు అబ్బురపరిచింది. వార్నర్ అవుట్‌తో తొలి వికెట్‌కు 93 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. వెంటనే జడేజా ఓవర్‌లో ధోనీ మెరుపు క్యాచ్‌తో షా వెనుదిరిగాడు. 15వ ఓవర్‌లో పేసర్ పథిరన 150 కి.మీ వేగంతో రెండు కళ్లు చెదిరే యార్కర్లతో మార్ష్ (18), స్టబ్స్ (0)ను క్లీన్ బౌల్డ్ చేయడం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. ఈ దశలో పరుగులు తగ్గిపోయాయి. అయితే, 18వ ఓవర్‌లో 4,6.. 19వ ఓవర్‌లో 6,4,4 బాదిన పంత్ 31 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ ఆ వెంటనే పథిరనకు పంత్ చిక్కాడు. అయితే చివరి 3 ఓవర్లలో ఢిల్లీ 43 రన్స్ సాధించడంతో స్కోరు 190 దాటింది.

1 టీ20 క్రికెట్‌లో ఎక్కువ (110) సార్లు 50+ స్కోర్లు సాధించిన బ్యాటర్‌గా గేల్‌ను సమం చేసిన వార్నర్.

2 పొట్టి ఫార్మాట్‌లో వికెట్ల వెనకాల 300 మంది బ్యాటర్లను అవుట్ చేసిన తొలి కీపర్‌గా ధోనీ.


ధోనీ (16 బంతుల్లో 37 నాటౌట్)

స్కోరుబోర్డు

ఢిల్లీ: పృథ్వీ షా (సి) ధోనీ (బి) జడేజా 43, వార్నర్ (సి) పథిరన (బి) ముస్తాఫిజుర్ 52, పంత్ (సి) రుతురాజ్ (బి) పథిరన 51, మార్ష్ (బి) పథిరన 18, స్టబ్స్ (బి) పథిరన 0, అక్షర్ (నాటౌట్) 7, అభిషేక్ పొరెల్ (నాటౌట్) 9, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 191/5; వికెట్ల పతనం:** 1-93, 2-103, 3-134, 4-134, 5-178; **బౌలింగ్:** దీపక్ చాహర్ 4-0-42-0, తుషార్ దేశ్‌పాండే 4-0-24-0, ముస్తాఫిజుర్ 4-0-47-1, జడేజా 4-0-43-1, పథిరన 4-0-31-3.

చెన్నై: రుతురాజ్ (సి) పంత్ (బి) ఖలీల్ 1, రచిన్ రవీంద్ర (సి) స్టబ్స్ (బి) ఖలీల్ 2, రహానె (సి) వార్నర్ (బి) ముకేశ్ 45, మిచెల్ (సి అండ్ బి) అక్షర్ 34, శివమ్ దూబే (సి) స్టబ్స్ (బి) ముకేశ్ 18, సమీర్ రిజ్వీ (సి) ఖలీల్ (బి) ముకేశ్ 0, జడేజా (నాటౌట్) 21, ధోనీ (నాటౌట్) 37, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 171/6; వికెట్ల పతనం:** 1-3, 2-7, 3-75, 4-102, 5-102, 6-120; **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-1-21-2, ఇషాంత్ 3-0-23-0, నోకియా 4-0-43-0, అక్షర్ 3-0-20-1, రసిఖ్ 2-0-25-0, మార్ష్ 1-0-14-0, ముకేశ్ కుమార్ 3-0-21-3.

బింద్య, వైష్ణవిలకు పతకాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా సౌత్ జోన్ మహిళల సైక్లింగ్ లీగ్‌లో తెలంగాణ రైడర్లు శివ బింద్య రజతం, వైష్ణవి కాంస్య పతకాలు కొల్లగొట్టారు. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో సబ్ జూనియర్ 15 కి.మి విభాగంలో శివ బింద్య ద్వితీయ, వైష్ణవి తృతీయ స్థానంలో నిలిచారు. కేరళకు చెందిన ప్రియమణి చాంపియన్‌గా నిలిచి స్వర్ణ పతకం అందుకుంది.

పాక్ వన్డే, టీ20 కెప్టెన్‌గా బాబర్

కరాచీ: పాకిస్థాన్ జట్టు పరిమిత ఓవర్ల కెప్టెన్‌గా తిరిగి బాబర్ ఆజమ్ ఎంపికయ్యాడు. గతేడాది వరకు అతను అన్ని ఫార్మాట్ల కెప్టెన్‌గా ఉన్నప్పటికీ, వన్డే వరల్డ్‌కప్‌లో జట్టు వైఫల్యంతో కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. దీంతో టెస్టులకు షాన్ మసూద్, టీ20లకు షహీన్ షా అఫ్రీదిని కెప్టెన్లుగా నియమించారు. వన్డేలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే షహీన్ కెప్టెన్సీలో న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో పాక్ ఓడడంతో పీసీబీ మళ్లీ నాయకత్వ మార్పు చేసింది.

వరల్డ్ జూనియర్ టెన్నిస్ రన్నరప్ భారత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): మలేసియాలో జరిగిన వరల్డ్ జూనియర్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. ఈ జట్టులో హైదరాబాద్ కుర్రాడు హృతిక్ కటకం ఉండడం విశేషం. ఫైనల్లో భారత జట్టు 0-2తో జపాన్ చేతిలో పరాజయం పాలైంది.

బిజినెస్

నేటి నుంచి కొత్త ఈవీ విధానం షురూ

న్యూఢిల్లీ: దేశంలో విద్యుత్ వాహనాల ప్రోత్సాహానికి ప్రభుత్వం రూ.500 కోట్లతో నాలుగు నెలల కాలానికి ప్రకటించిన విధానం అమలు సోమవారం నుంచి ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు ఈ విధానం అమలులో ఉంటుంది. ప్రస్తుతం అమలులో ఉన్న ఫేమ్-2 విధానం గడువు ఆదివారంతో ముగిసింది. ఫేమ్ 2 కింద అర్హులైన వారు మార్చి 31 వరకు లేదా ఈ పథకం కింద నిధులు అందుబాటులో ఉన్నంతవరకు మాత్రమే సబ్సిడీలు అందుకోగలుగుతారు. దేశంలో విద్యుత్ వాహనాలను మరింతగా ప్రోత్సహించేందుకు విద్యుత్ మొబిలిటీ ప్రోత్సాహక పథకం 2024 (ఈఎంపీఎస్ 2024) ప్రకటించారు. దీని కింద టూ వీలర్‌కు రూ.10,000, చిన్న త్రీ వీలర్‌కు రూ.25,000, పెద్ద త్రీ వీలర్‌కు రూ.50,000 సబ్సిడీ ఇస్తారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	380	విజయవాడ	403
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	403	వరంగల్	382
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	127	గోదావరి	126
వరంగల్	127	విజయవాడ	126
కరీంనగర్	127	గుంటూరు	127
మహబూబ్‌నగర్	127	ఒంగోలు	127
కర్నూలు	127	చిత్తూరు	122
విశాఖపట్నం	117		

ముగిసిన 66 కంపెనీల ఐపీఓ షేర్ల లాకిన్ పీరియడ్

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మరింత దిద్దుబాటుకు లోనయ్యే ప్రమాదం కనిపిస్తోంది. దాదాపు 66 కంపెనీలకు చెందిన పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల్లో ఇన్వెస్ట్ చేసిన యాంకర్ ఇన్వెస్టర్ల పెట్టుబడుల లాకిన్ పీరియడ్ వచ్చే నాలుగు నెలల్లో ముగుస్తోంది. దీంతో పెద్దగా లాభసాటి గాని కంపెనీల షేర్లను యాంకర్ ఇన్వెస్టర్లు వదిలించుకునే అవకాశం కనిపిస్తోంది. అదే జరిగితే మార్కెట్లో ఈ కంపెనీల షేర్ల అమ్మకాలు పెరిగి, వాటి ధరలు పెద్దఎత్తున దిద్దుబాటుకు లోనయ్యే అవకాశం ఉందని అంచనా. దాదాపు రూ.1.5 లక్షల కోట్ల విలువైన షేర్లు ఈ నాలుగు నెలల కాలంలో మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది.

పనితీరే గీటు రాయి: ఇందులో గ్లోబల్ సర్ఫేసెస్, సాయి సిల్క్స్, జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా, ప్లాటినమ్ ఇండస్ట్రీస్, ఎగ్జికామ్ టెక్నాలజీస్ షేర్ల లాకిన్ పీరియడ్ సోమవారం ముగుస్తోంది. ఐపీఓల తర్వాత మంచి పనితీరు కనబరిచిన కంపెనీల షేర్లకు పెద్దగా ఢోకా ఉండకపోవచ్చు. అయితే లిస్టింగ్ తర్వాత బోల్తా పడిన కంపెనీల షేర్లలో మాత్రం పెద్ద కుదుపు తప్పదని మార్కెట్ వర్గాల అంచనా.

ఇన్ఫోసిస్‌కు 6,329 కోట్ల ఐటీ రిఫండ్

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ) శాఖ నుంచి ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు పెద్ద బొనాంజా లభించనుంది. వివిధ ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి రూ.6,329 కోట్ల రిఫండ్ అందనుంది. ఇన్ఫోసిస్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఈ విషయం తెలిపింది. ఈ రిఫండ్‌తో పాటు వివిధ ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి రూ.2,763 కోట్లు పన్నుగా చెల్లించాలని కూడా ఐటీ శాఖ నుంచి డిమాండ్ నోటీసులు అందినట్టు కంపెనీ తెలిపింది.

వచ్చే మూడేళ్లలో రిటైల్, ఎనర్జీలపై రిలయన్స్ ఫోకస్



హైడ్రోకార్బన్, టెలికాంపై కూడా.. గడచిన పదేళ్లలో 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు

గోల్డ్‌మన్ శాక్స్ వెల్లడి

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) వ్యాపార విస్తరణ కొనసాగుతోంది. ఇందు కోసం గత పదేళ్లలో 12,500 కోట్ల డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టిందని ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ వెల్లడించింది. ప్రస్తుత డాలర్-రూపాయి మారకం రేటు ప్రకారం ఇది దాదాపు రూ.10.40 లక్షల కోట్లకు సమానం. ఇందులో 3,000 కోట్ల డాలర్లు హైడ్రోకార్బన్స్ (ఆయిల్ టు కెమికల్స్) రంగం ఉత్పత్తి సామర్థ్య విస్తరణకు, మరో 6,000 కోట్ల డాలర్లకుపైగా పెట్టుబడులను 4జీ/5జీ సేవల విస్తరణ కోసం వినియోగించింది. ఇందులో 4జీ సేవల విస్తరణ పెట్టుబడులు 2019లోనే పూర్తికాగా, 5జీ సేవల విస్తరణ పెట్టుబడులు 2023-24 ఆర్థిక సంవత్సరంలో పూర్తయ్యాయి.

ఇక రిటైల్, ఇంధన రంగాలపై దృష్టి: ఇప్పటి వరకు హైడ్రోకార్బన్, టెలికాం రంగాలపై దృష్టి పెట్టిన ఆర్‌ఐఎల్ వచ్చే మూడేళ్లలో రిటైల్, నూతన ఇంధన వనరులపై దృష్టి పెట్టనుంది. ఇందులో భాగంగా తన రిటైల్ స్టోర్లను పెద్దఎత్తున విస్తరిస్తోంది. సాంప్రదాయేతర ఇంధన రంగంలోకీ పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. సోలార్ మాడ్యూల్స్, ఇతర ప్రత్యామ్నాయ ఇంధన ప్రాజెక్టులపై వచ్చే మూడేళ్లలో 1,000 కోట్ల డాలర్లు (దాదాపు రూ.83,000 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది. ఇందులో సంప్రదాయేతర ఇంధన ప్రాజెక్టులు రెండేళ్లలో, రిటైల్ స్టోర్లు ఆరు నుంచి ఏడాది కాలంలో లాభాల బాట పట్టే అవకాశం ఉందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా. హైడ్రోకార్బన్స్, టెలికాంతో పోలిస్తే వీటిలో పెట్టుబడులూ పెద్దగా అవసరం ఉండదు.

టెలికాంలో ఇక లాభాలు: ప్రస్తుతం ఆర్‌ఐఎల్ లాభాల్లో అత్యధిక భాగం చమురు, గ్యాస్ ఉత్పత్తి, రిఫైనింగ్, పెట్రో కెమికల్స్ ద్వారా సమకూరుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి టెలికాం రంగం కూడా పెద్ద ఎత్తున లాభాలు సమకూరుస్తుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేస్తోంది.

ఐఓసీతో పానాసోనిక్ జాయింట్ వెంచర్

న్యూఢిల్లీ: సిలిండ్రికల్ లిథియం అయాన్ బ్యాటరీల తయారీ కోసం దేశంలోని అతిపెద్ద ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)తో జపాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్ దిగ్గజం పానాసోనిక్ గ్రూప్ జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఉభయ సంస్థల మధ్య ఒప్పందంపై సంతకాలు జరిగాయి. జాయింట్ వెంచర్ స్వరూప స్వభావాలు ఖరారు చేసేందుకు చర్చలు కూడా ప్రారంభించింది.

బీఓఐ వడ్డీ రేట్ల పెంపు

న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) వివిధ రకాల రుణాలపై వడ్డీ రేటును 0.10 శాతం మేరకు పెంచింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త వడ్డీ రేట్లు అమల్లోకి వస్తాయి. ఈ నిర్ణయంతో రెపో అనుసంధానిత వడ్డీ రేటు 9.35 శాతానికి పెరుగుతుంది.ఇండియన్ బ్యాంక్ కూడా వడ్డీ రేటును ఈ నెల 3 నుంచి 0.05 శాతం మేరకు పెంచుతున్నట్టు ప్రకటించింది.

ఎంఎస్‌ఎంఈలకు ఇక సమయానికి చెల్లింపులు

న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీల (ఎంఎస్‌ఎంఈ) ఆర్థిక పరిస్థితి కొంత మేరకు మెరుగుపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సంస్థల నుంచి సరుకులు, సేవలు పొందిన పెద్ద కంపెనీలు అందుకు సంబంధించిన చెల్లింపులు ఒప్పందం ప్రకారం 45 రోజుల్లో పూర్తి చేయాలి. ఈ నిబంధన సోమవారం (2024 ఏప్రిల్ 1) నుంచే అమల్లోకి రానుంది. ఒకవేళ ఏ పెద్ద కంపెనీ అయినా ఈ బకాయిలను 45 రోజుల కంటే ఆలస్యంగా చెల్లిస్తే, ఆ మొత్తానికి ఆదాయ పన్ను మినహాయింపు లభించదు. ఎగుమతి ఆధారిత సంస్థలతో పాటు అనేక కంపెనీలు ఈ నిబంధన అమలు ఏడాది పాటు వాయిదా వేయమని కోరినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు.

ఈ పాలసీలోనూ అదే ధోరణి

వడ్డీ రేట్లు తగ్గవ్... 5న తొలి ద్వైమాసిక సమీక్ష

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ నాయకత్వంలోని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) నూతన ఆర్థిక సంవత్సరపు (2024-25) తొలి ద్వైమాసిక పరపతి విధానంపై చర్చించేందుకు బుధవారం నుంచి మూడు రోజుల పాటు సమావేశం కాబోతోంది. ద్రవ్యోల్బణాన్ని ప్రభుత్వం నిర్దేశించిన 4 శాతం పరిధిలో కట్టడి చేయడం లక్ష్యంగా ఈ సారి కూడా కీలక రెపో రేటు విషయంలో యథాతథ స్థితిని కొనసాగించవచ్చంటున్నారు. ఒకపక్క ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, బ్రిటన్ దేశాల కేంద్ర బ్యాంకులు అందించే సంకేతాలు పరిగణనలోకి తీసుకుంటూనే వేచి ఉండే ధోరణి అనుసరించే ఆస్కారం ఉంది. గత ఏడాది ఫిబ్రవరిలో ఆర్‌బీఐ రెపో రేటును 0.25 శాతం పెంచి 6.5 శాతానికి చేర్చిన అనంతరం ఆరు వరుస సమీక్షల్లో యథాతథ స్థితిని కొనసాగిస్తూ వస్తోంది.

22,500 వద్ద గట్టి నిరోధం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 22,000 స్థాయి నుంచి రికవరీ సాధించి 22,500 వరకు వెళ్లినా చివరి ట్రేడింగ్ రోజున ఆకస్మికంగా 200 పాయింట్ల మేరకు ఇంట్రాడే కరెక్షన్ సాధించింది. 22,500 వద్ద గట్టి నిరోధం ఎదురవుతోందనేందుకు ఇది సంకేతం. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. అలాగే గత వారంలో పటిష్ఠంగానే క్లోజయినా మార్చి 7, 11 తేదీల్లో 22,500 వద్ద మేజర్ టాప్ ఏర్పడింది. ఇక్కడి నుంచే 800 పాయింట్ల మేరకు బలమైన కరెక్షన్ కూడా సాధించింది. గత వారం రెండో ప్రయత్నంలో కూడా ఇదే తరహా ఆకస్మిక రియాక్షన్ ఏర్పడడం కూడా గట్టి నిరోధాన్ని సూచిస్తోంది. మార్కెట్ గరిష్ఠ స్థాయిల్లో మరింత కన్సాలిడేట్ కావలసి ఉంది. గత రెండు నెలలుగా నిఫ్టీ సైడ్‌వేస్ ధోరణిలో ఉంది. గత వారం మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ 100 సూచీలు కూడా స్వల్ప లాభాలతో ముగిశాయి. వచ్చే శుక్రవారం ఆర్‌బీఐ ద్రవ్య విధానం ప్రభావం మార్కెట్‌పై ఉండవచ్చు.

బుల్లిష్ స్థాయిలు : నిఫ్టీ రికవరీ బాట పడితే మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 22,440 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన స్వల్పకాలిక నిరోధం 22,550. ఇదే కొద్ది కాలం క్రితం ఏర్పడిన చారిత్రక గరిష్ఠ స్థాయి.

బేరిష్ స్థాయిలు: మద్దతు స్థాయి 22,150 కన్నా దిగజారితే మరింత బలహీనతను ఎదుర్కొంటుంది. దిగువన మద్దతు స్థాయి 21,950. మూడు వారాల క్రితం ఏర్పడిన ప్రధాన కనిష్ఠ స్థాయి ఇది. ఇక్కడి నుంచే రికవరీ ఏర్పడింది. తక్షణ అప్‌ట్రెండ్ ఆశలు నిలబెట్టుకోవాలంటే ఇక్కడ తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 260 పాయింట్ల లాభంతో 47,120 వద్ద క్లోజైంది. పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే ప్రధాన నిరోధం 47,400 వద్ద నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయిలు 46,800, 46,500. రెండో మద్దతు స్థాయిలో కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ముప్పును ఎదుర్కొంటుంది.

పాటర్న్: ఎగువన 22,550 వద్ద "డబుల్ టాప్ పాటర్న్" ఏర్పడింది. సానుకూలత కోసం ఈ స్థాయిని బ్రేక్ చేయాలి. నెలవారీ చార్టుల ప్రకారం నిఫ్టీ ఓవర్ బాట్ స్థితిలో ఉంది. మధ్యకాలిక ధోరణి ప్రకారం కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఉండవచ్చు. అయితే 50 డీఎంఏ వద్ద నిఫ్టీ రికవరీ సాధించింది.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం స్వల్పకాలిక రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,430, 22,500
మద్దతు	22,300, 22,240

www.sundartrends.in

బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో బుల్లిష్‌నెస్!

కొత్త ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి వారంలో దేశీయ స్టాక్ మార్కెట్లు మెరుగ్గా ట్రేడయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వస్తే పాజిటివ్ సెంటిమెంట్ మరింత పెరుగుతుంది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షలో వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగే అవకాశం ఉండటంతో మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది. గత వారం చివరి సెషన్‌లో నిఫ్టీ భారీగా పెరిగినప్పటికీ చివరలో లాభాల స్వీకరణకు దిగటమే ఇందుకు నిదర్శనం. అయితే నిఫ్టీ 22,500 స్థాయిని అధిగమిస్తే మార్కెట్లో బుల్లిష్‌నెస్ వస్తుంది. ఈ వారం బ్యాంకింగ్, ఫైనాన్స్, ఫార్మా రంగ షేర్లు జోరును ప్రదర్శించే వీలుంది. అలాగే ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగ షేర్లలోనూ కొనుగోళ్లు ఉండే అవకాశాలున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

అపోలో హాస్పిటల్స్ : సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో సాగుతున్న ఈ కౌంటర్‌లో స్వల్ప దిద్దుబాటు జరిగింది. జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో గట్టి నిరోధం ఎదురైంది. అయితే రూ.6,000 స్థాయిల్లో ఈ షేరుకు మద్దతు లభించింది. గత గురువారం ఈ షేరు రూ.6,356 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.6,400 స్థాయిల్లో ప్రవేశించి రూ.6,650/6,700 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6,370 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హీరో మోటోకార్ప్: ఈ షేరు సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌ను కనబరుస్తూ వస్తోంది. ప్రస్తుతం ఈ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయిలో ఉంది. ఏడాది కాలంలో 100 శాతం పెరిగిన ఈ షేరు రానున్న రోజుల్లో మరింత పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత గురువారం ఈ షేరు రూ.4,722 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.4,700 స్థాయిల్లో ఎంటరై రూ.4,880/4,940 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గ్రాసిమ్: ప్రస్తుతం ఈ షేరు అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. రిస్క్, రివార్డ్‌పరంగా ఈ షేరు బాగుంది. అప్పర్ బొలింజర్ బ్యాండ్ బ్రేక్ చేసింది. గత గురువారం ఈ షేరు రూ.2,287 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,280/2,250 స్థాయిల్లో ప్రవేశించి రూ.2,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,220 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బజాజ్ ఫిన్‌సర్వ్: ఈ గ్రూప్ నుంచి బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూకి వస్తుందన్న వార్తలతో ఈ షేరుకు డిమాండ్ పెరిగింది. రెండు వారాల నుంచి ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది గత గురువారం ఈ షేరు 3.87 శాతం లాభంతో రూ.1,643 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,600/1,620 స్థాయిల్లో ఎంటరై రూ.1,750/1,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.1,575 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

భారతి ఎయిర్‌టెల్: ఈ టెలికాం దిగ్గజం ఎలాంటి ఒడుదొడుకులకు లోనవకుండా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. చిన్న దిద్దుబాటు తర్వాత సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయిల వద్ద ట్రేడవుతోంది. టెలికాం రంగంలో సానుకూలతలు, భారతి హెక్సాకామ్ పబ్లిక్ ఇష్యూకి వస్తుండటం సానుకూల పరిణామాలు. గత గురువారం ఈ షేరు రూ.1,236 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.1,200/1,220 స్థాయిల్లో ఎంటరై రూ.1,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,170 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 1-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 347 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ

కాంగ్రెస్‌లో చేరిన కడియం



కూతురు కావ్యతో కలిసి హస్తం గూటికి శ్రీహరి
కండువాలు కప్పి ఆహ్వానించిన రేవంత్, దీపాదాస్
కడియం చేరికపై కాంగ్రెస్‌లో భగ్గుమన్న అసంతృప్తి
ఎమ్మెల్యేలకు ఫోన్‌చేసి బుజ్జగించిన సీఎం
పార్టీ కోసం కొన్ని భరించాలని సూచన
హనుమకొండలో దండోరా డప్పుతో మాదిగల నిరసన

12



200 సీట్లైనా గెలవండి.. చూద్దాం

బీజేపీకి మమతాబెనర్జీ సవాల్
కాంగ్రెస్‌కు ఓటేస్తే కమలానికి వేసినట్టే
బెంగాల్ సీఎం విమర్శలు

మ్యాచ్ ఫిక్సింగ్ మోదీ ని
గద్దె దింపుదాం!

ఈసీలు అనే అంపైర్లను మోదీనే ఎంపిక చేశారు
ముగ్గురు-నలుగురు బిలియనీర్లను అడ్డం పెట్టుకొని 'మ్యాచ్ ఫిక్సింగ్' ద్వారా గెలవాలని అనుకుంటున్నారు
సీబీఐ, ఈడీ బెదిరింపుల ద్వారా దేశాన్ని నడిపిస్తారా?
బీజేపీ మళ్లీ వస్తే ప్రస్తుత రాజ్యాంగాన్ని ఖతం చేస్తారు
రాజకీయ నేతలను బెదిరిస్తారా? అరెస్టులు చేస్తారా?
మీడియాను కొనకుండా, ఈవీఎంలను వాడకుండా బీజేపీకి 180 సీట్లు కూడా రావు: రాహుల్ గాంధీ
కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌ను విడుదల చేయాలి
ఢిల్లీలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ సభ'లో విపక్ష నేతలు

న్యూఢిల్లీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కెప్టెన్లపై ఒత్తిడి పెంచి.. క్రీడాకారులను కొనుగోలు చేస్తే క్రికెట్ పరిభాషలో మ్యాచ్ ఫిక్సింగ్ అంటారని, ఇలానే మ్యాచ్ ఫిక్సింగ్ చేసి లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలని మోదీ కుట్ర పన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మ్యాచ్ అనే ఈ ఎన్నికల వేళ ఎన్నికల కమిషనర్లు అనే అంపైర్లను మోదీయే ఎంపిక చేశారని.. రాజకీయ నాయకులనే ఇద్దరు క్రీడాకారులను (కేజ్రీవాల్, హేమంత్ సోరెన్)ను జైలుకు పంపారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఇదే చివరి అవకాశం అని, మోదీ ప్రభుత్వాన్ని కలిసికట్టుగా గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ గనక మళ్లీ గెలిస్తే రాజ్యాంగాన్నే మార్చేసి, ప్రజల హక్కులను కాలరాస్తుందని హెచ్చరించారు. రాజ్యాంగం లేకపోతే రిజర్వేషన్లూ పోతాయని... పేదలు, రైతులు, శ్రామికుల సంపద అంతా దేశంలోని ఓ

10
మిగతా 10వ పేజీలో...

ఎన్నికల కమిషన్‌కు ప్రియాంక ఐదు డిమాండ్లు

నేడు కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణ

12

జైల్లో వసతుల్లేవని కవిత అసంతృప్తి

కస్టడీకా? తిహాడ్ జైలుకా..?

నేడు రౌస్ అవెన్యూ కోర్టు ముందుకు కేజ్రీ
న్యాయస్థానం నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ

10

కీలక నిర్ణయాలన్నీ
తొలి 100 రోజుల్లోనే

దేశ ప్రగతి కోసం వచ్చే ఐదేళ్లకు రోడ్‌మ్యాప్ సిద్ధం



ఆడ్వాణీకి భారతరత్న ప్రదానం

10

స్వయంగా ఇంటికి వెళ్లి అవార్డు అందజేసిన రాష్ట్రపతి ముర్ము
హాజరైన మోదీ, రాజ్‌నాథ్, షా
ఆడ్వాణీజీతో కలిసి పనిచేసే చాన్స్ రావడం అదృష్టం: మోదీ

రాష్ట్రపతి నిలబడితే.. మోదీ కూర్చుంటారా? ప్రధాని తీరుపై కాంగ్రెస్ విమర్శలు

ప్రజలు ఇప్పటి వరకు ట్రైలరే చూశారు
దేశంలో అసలు అభివృద్ధి ముందుంది
మాది అవినీతిపై పోరాటం.. విపక్షాలది అవినీతిపరులను కాపాడే యత్నం
చౌధరి చరణ్‌సింగ్‌కు ఇండియా కూటమి సరైన గౌరవం ఇవ్వలేదు
కాంగ్రెస్, ఎస్పీ నేతలు ఇంటింటికీ వెళ్లి క్షమాపణ చెప్పాలి: ప్రధాని మోదీ

మేరఠ్, మార్చి 31: రాబోయే లోక్‌సభ ఎన్నికలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికే కాదని, 'వికసిత్ భారత్' నిర్మాణం కోసం జరుగుతున్నవని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివారం ఆయన ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారం చేపట్టడానికి తమ ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించిందని, దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి గాను వచ్చే ఐదేళ్లకు సంబంధించిన

మిగతా 10వ పేజీలో...

ఎన్నికల బాండ్ల రద్దుపై విపక్షాలు పశ్చాత్తాప పడతాయ్
ప్రధాని మోదీ

హైదరాబాద్ టు అయోధ్య

10

రేపటి నుంచి నేరుగా విమానాలు
కిషన్‌రెడ్డి వెల్లడి

ప్రభాకర్‌రావు
లొంగు'బాట'?

అమెరికా నుంచి తిరుగు ప్రయాణం!.. ఆయన అప్రూవర్‌గా మారుతారా?
కొనసాగుతున్న భుజంగరావు, తిరుపతన్న విచారణ
భుజంగరావు నా ఫోన్ ట్యాప్ చేశారు.. ఆఫీస్‌కు పిలిపించి బెదిరించారు
సంధ్య కన్వెన్షన్ ఎండీ ఆరోపణలు.. బంజారాహిల్స్ ఠాణాలో ఫిర్యాదు!
పోలీసులకు కీలక ఆధారాల సమర్పణ



హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పాత్రధారిగా భావిస్తున్న టి.ప్రభాకర్‌రావు పోలీసుల ఎదుట లొంగిపోనున్నారా? ఇప్పటి వరకు అరెస్టయిన పోలీసు అధికారులు.. దర్యాప్తులో "ప్రభాకర్‌రావు చెప్పినట్లు చేశాం" అంటూ వాంగ్మూలం ఇవ్వడంతో అన్ని వేళ్లు ఎస్ఐబీ మాజీ చీఫ్ వైపే చూపుతున్నాయా? దాంతో ప్రభాకర్‌రావు అమెరికా నుంచి తిరుగు ప్రయాణమయ్యారా? ఈ ప్రశ్నలకు ప్రస్తుత పరిణామాలు అవుననే సమాధానం చెబుతున్నాయి. ప్రభాకర్‌రావు ఇటీవల ఓ దర్యాప్తు అధికారికి అమెరికా నుంచి

మిగతా 9వ పేజీలో...

కాంగ్రెస్ అసమర్థతతోనే
కరువు

వంద రోజుల్లో 200 మంది రైతుల ఆత్మహత్యలు
రైతుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి
ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలి
లేదంటే ప్రభుత్వాన్ని వెంటాడుతాం.. వేటాడుతాం
సొల్లు పురాణాలు చెప్పి అధికారంలోకి వచ్చారు
ఒకరిద్దరిని పార్టీలో చేర్చుకొని చిల్లర రాజకీయాలు
గత ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనులు చేస్తున్నారు
ఎందరితోనో పోరాడాం.. ఎందరినో పాతరేశాం
పోలీసులు పరిమితుల్లో ఉండడం మంచిది: కేసీఆర్
జనగామ, సూర్యాపేట జిల్లాల్లో మాజీ సీఎం పర్యటన
ఎండిన పంట పొలాల పరిశీలన.. రైతులకు ఓదార్పు
కేసీఆర్ బస్సును తనిఖీ చేసిన పోలీసులు



జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని ధరావత్‌తండాలో కేసీఆర్‌కు బాధను చెప్పుకొంటూ రోదిస్తున్న రైతు సత్తెమ్మ

నల్లగొండ/జనగామ/మోత్కూరు/తుంగతుర్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత కరువు.. దానికదే వచ్చింది కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, తెలివితక్కువతనం వల్ల వచ్చిందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. రైతులు కష్టాల్లో ఉంటే కనీసం పరామర్శించి ఆదుకునే ఆలోచన ముఖ్యమంత్రికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు లేకుండా పోయిందని, సీఎంకు ఢిల్లీకి తిరగడానికే సరిపోతోందని

మిగతా 11వ పేజీలో...



నష్టపోయిన రైతులను మీరెప్పుడైనా ఆదుకున్నారా?

ప్రకృతి వైపరీత్యాలతో పంటలు పోతే పరిహారం ప్రకటించి.. పైసా ఇవ్వలేదు
కేసీఆర్.. మీ వ్యక్తిత్వాన్ని చంపుకోవద్దు
ఎంత నికృష్టుడైనా కరువును రాజకీయం కోసం వాడుకుంటారా?
మీరు చేసే విష ప్రయోగాలను తెలంగాణ ప్రజానీకం హర్షించదు
ఏ మొహం పెట్టుకొని రైతుల వద్దకు పరామర్శకు వెళ్తున్నావు?

11

మాజీ సీఎం కేసీఆర్‌పై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై
'టోలు' వాయింపు



9

పెరిగిన వాహన టోల్ రుసుము
కొత్త ధరలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి..

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

'ఆంధ్రజ్యోతి' కథనానికి దేవాదాయ శాఖ స్పందన
సరుకులు, రికార్డుల పరిశీలన.. ఆలయ సిబ్బంది తీరుపై అసహనం

బాసర, మార్చి 31: నిర్మల్ జిల్లా బాసరలోని సరస్వతీ అమ్మవారి దేవస్థానంలో దేవాదాయ శాఖ విజిలెన్స్ విభాగం ఆదివారం తనిఖీలు చేపట్టింది. 'బాసరలో భోంచేస్తున్నారు' శీర్షికతో ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి దేవాదాయ శాఖ అధికారులు స్పందించారు. దేవాదాయ శాఖ రాష్ట్ర విజిలెన్స్ అధికారి, ఆ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి స్వయంగా బాసర వచ్చి తనిఖీలు నిర్వహించారు. సరుకులు భద్రపరిచే

మిగతా 5వ పేజీలో...

సైబర్ బానిసలు!

కంబోడియాలో దుర్భర స్థితిలో 5000 మంది భారతీయులు

ఉద్యోగాల ఆశతో అక్కడికి చేరుకుని నిర్బంధంలోకి
ఫ్రాడ్ కాల్స్ చేసి జనాన్ని మోసగించడమే డ్యూటీ
రోజుకు 12 గంటల పని.. రోజుకు ఇంతని టార్గెట్లు
చేయనని మొండికేస్తే.. కరెంటు షాకులతో హింస
ఆర్నెల్లలో 500 కోట్లు దోచుకున్న సైబర్ మాఫియా
కంబోడియాలోని భారత ఎంబసీకి పలు ఫిర్యాదులు
ఇప్పటిదాకా 250 మందిని రక్షించి భారతదేశానికి తీసుకువచ్చినట్టు వెల్లడించిన మన విదేశాంగ శాఖ
8 మంది అరెస్టు.. 16 మందిపై లుకౌట్ నోటీసులు
లుకౌట్ నోటీసుల ఆధారంగా ఇద్దరు తెలుగువారిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న అధికారులు



న్యూఢిల్లీ, మార్చి 31: "మీ పేరు మీద విదేశాల నుంచి ఒక పార్సిల్ వచ్చింది. దానికి ఆ పన్నులు కట్టాలి.. ఈ పన్నులు కట్టాలి" అంటూ రూ.లక్షల్లో, రూ.కోట్లల్లో దోచుకునే సైబర్ స్కామ్‌ల గురించి వినే ఉంటారు! ఈ తరహా సైబర్ కుంభకోణాల బాధితులైతే.. తమకు కాల్ చేసి బెదిరించినవారిని దారుణంగా తిట్టుకుంటారు. కానీ.. ఈ దందాలో భాగస్వాములై అమాయకులకు కాల్ చేస్తున్నవారిలోనూ కొందరు బాధితులు ఉంటారని తెలుసా? కంబోడియా కేంద్రంగా సాగుతున్న ఈ తరహా సైబర్ ఫ్రాడ్ ఇందుకు నిదర్శనం. కేవలం ఈ ఫ్రాడ్ చేయడం కోసమే.. ఉద్యోగావకాశాల పేరుతో భారతీయులకు ఎరవేసి, వారిని అక్కడికి తరలించి.. వారితో సైబర్ ఫ్రాడ్‌లు

మిగతా 12వ పేజీలో...

ఆర్ఆర్ఆర్ మార్గంలో మార్పులు!



ఉత్తర భాగంలో మారనున్న అలైన్‌మెంట్
రైతులు నష్టపోకుండా చూడాలనే యోచన
రాయగిరి రైతుల ఆందోళనతో నిర్ణయం
దక్షిణ భాగంలోనూ ఇదేవిధంగా భూసేకరణ
అలైన్‌మెంట్ మేరకు డీపీఆర్‌లోనూ మార్పులు
ఉత్తర భాగానికి త్వరలో ఎన్‌హెచ్ నంబరు!

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌లో మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రోడ్డు నిర్మాణంలో సాగు భూములు కోల్పోకుండా, రైతులకు నష్టం వాటిల్లకుండా రూట్‌మ్యాప్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలోని యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో అలైన్‌మెంట్‌లో ఈ మార్పులు జరగనున్నట్టు సమాచారం. అధికారులు కూడా ఇదే అంశంపై చర్చించుకుంటున్నారు. అయితే.. అలైన్‌మెంట్ మార్పుతో

మిగతా 12వ పేజీలో...

వివిధ

బొమ్మలు: అక్బర్

అంతా మన మంచికే



1
కాలం ఓ రెక్కను విరిచేస్తే ఎగరలేని,
ఒంటి రెక్క తూనీగల సమూహం మధ్యలో నిలబడి,
జంట రెక్కల రంగు వెలసిందని విలపిస్తుంటావు...

2
ఏడుస్తుంటావు నిర్విరామంగా,
ఈరోజు నీది కాదనో,
నీదైన రోజు రాదనో..

లోతైన పాత గాయాల్ని,
గోడ కొత్త క్యాలెండర్లో దాచేసినట్టు,
యుగాల నాటి విషాదాలపై బొట్లుగా రాలిపడుతూ,
పైకి నవ్వినట్టు నటిస్తుంటావు...

మనది కాని కాలానికి, కాసిన కలతల చెట్టుకు,
కన్నీటి పుష్పాలు విరబూయడం సహజమే....
బహుశా ఈ రహస్యాన్ని నీకింకా ఎవరూ
చెప్పకపోవచ్చు...

3
నడిస్తే పడిపోతావనే భయం,
పడిపోతే లేవలేననే అపనమ్మకాల వంతెనపై,
జీవితాన్ని అంబాడిస్తుంటావు.

పరధ్యానంగా అడుగులు వేయడాన్నే
నడకనుకుంటావు తప్ప,
అసలేనాడైనా,
నేలకూ, కాళ్లకూ మధ్య జరిగే సంభాషణను
ఆస్వాదించావా....?
మడమకూ, మట్టి రేణువుకూ నడుమ ప్రేమను
పుట్టించగలిగావా....??

4
పులి భయంతో అరణ్యాన్ని వీడిన జింక పిల్ల,
చివరాఖరికి వీధి కుక్కల పాలైనట్టు,
రాయి విసిరితే పగిలిపోయే అద్దాన్ని
మనసులా మోసినంత కాలం,
పులిపంజానో, శునకపు పంటి గాటునో
తప్పించుకు తిరగడం అసాధ్యం.

5
మర్చిపోవాలి,
కీడును తలపెట్టిన ఉదయాల్ని,
ఆ ఉదయాల్ని ఉసిగొల్పిన హృదయాల్ని,
అన్నిటినీ మర్చిపోవాలి...

నింగి గిన్నెలోని వెలుగునంతా ఆరగించి,
ఎక్కిళ్ళతో నీ ముందుకొచ్చిన ఈ రాత్రికి,
కాసిన్ని కన్నీళ్లు తాగించైనా సరే,
తెలవారే లోపే అంతా మర్చిపోవాలి....

కాలానికి దాహమేసినప్పుడల్లా,
గుండె తడిని కంటి బొక్కెనతో తోడుకోనివ్వాలి,
ఆ తర్వాతే,
నీరింకిన బావిలాంటి దేహం,
ఉబికే ఆశయాల చెలిమెను కలగంటుంది...

6
ఒకానొక అనూహ్యమైన ఘడియలో,
వేల కోరల వికృత రూపంతో,
నీ ముందు ప్రత్యక్షమైన ప్రశ్నను చూసి
జడుసుకుంటావు కానీ,
ప్రశ్న బహురూపులది...

పడగొట్టి వెర్రిగా నవ్వినంతలోనే,
నిలబెట్టి గుండెకు హత్తుకోగలదు....

నిజానికి,
కలలోనూ వెంటాడే ప్రశ్నలుంటేనే కదా,
మెలకువలో విజయాల్ని వేటాడగలవు.

7
"అంతా మన మంచికే"

నువ్వు రాయాల్సిన కొత్త కావ్యానికి
అందమైన శీర్షికా ఇదే....
సశేషంగా సాగుతున్న నీ కన్నీటి కథకు
ముగింపు వాక్యమైనా ఇదే....

జాబేర్ పాషా
00968 78531638 (మస్కట్)

"శిల్పం వల్లే మన రాతలు సజీవం"



రఘు శేషభట్టర్ | పలకరింపు

కవిత్వంలో వస్తు శిల్పాలు సమతూకంలో ఉండాలా? వస్తువొక నెపం మాత్రమే అన్న మీ స్టేట్‌మెంట్‌ను ఎట్లా సమర్థించుకుంటారు?

ఆ రెండూ సమతూకంలో ఉండకపోవటం వల్ల కవిత్వానికి వచ్చిన ఇబ్బందేమీ లేదు. కవి ప్రతిభ అతడి వస్తువులో కన్నా శిల్పంలోనే బయట పడుతుంది. వస్తువెంత పేలవంగా ఉన్నా శిల్పంలో దమ్ముంటే ఆ కవిత నిలబడుతుంది. బండ్ల కొద్దీ కవిత్వం రాసినా diction అబ్బని వాళ్ళతో భాష బాగుపడదు కదా. మన ఉద్దేశ్యాలన్నీ భాషను ఉద్ధరించేందుకే ఉపయోగపడాలి. శిల్పంవల్లే మన రాతలు సజీవంగా ఉండగలుగుతాయి.

జీవితంలో ఉండే రాజకీయాలు కవిత్వంలోకి చొరబడి దాన్ని కలుషితం చేయటం ఒక సారస్వత విషాదం. కవిత్వం రాస్తున్న తొలిరోజుల నుండి దీన్ని నిశితంగా చూసినవాడ్ని కనుక వాటికి దూరంగా ఉంటూ వచ్చాను.

జీవితానుభవాలు కవిత్వంగా మలిచినపుడు దృష్టి శిల్పం మీద నిలబడగలదా?


ఖచ్చితంగా నిలబడుతుంది. ఐతే దీని కోసం కొంచెం ప్రయత్నం చేయాలి ఏదీ దానంతటదే వళ్ళోకి వచ్చి వాలదు కనుక. శిల్పాన్ని తక్కువ చేసేవాళ్ళకు వార్తలు రాసినట్టు కవిత్వం రాసేవాళ్ళకు అది సాధ్యం కాదు. వాక్యాల్ని quotable గా ఉండేలా చూసుకుంటే ఎలాంటి అనుభవమైనా కవిత్వంలోకి ఒదుగుతుంది.

కవిత్వానికి ఒక సిలబస్ లాంటిదేమీ లేనపుడు కవిత్వాన్ని, అకవిత్వానికి మధ్య విభజన రేఖ గీయటం సాధ్యమేనా? దానికి మీరెంచుకున్న పద్ధతేమిటి?

చదివించే గుణమే నేనెంచుకున్న పద్ధతి. ఒక వాక్యం రాసినప్పుడు ఆ శైలిని బట్టి రాసిన వాడిని పట్టి ఇస్తే కవిగా వాడు సఫలం ఐనట్టు లెక్క. నిష్కర్షగా ఎవరి కవిత్వాన్నైనా విమర్శనాత్మకంగా చదివినప్పుడే ఇది అర్థమౌతుంది. విషాదం ఏమిటంటే మనలో కొమ్ములు తిరిగిన కవులు కూడా అకవిత్వం రాస్తారు. చుట్టూ ఉన్న వందిమాగధ బృందాలు దాన్ని మోస్తారు. ముందుగా ఏర్పరుచుకున్న అభిప్రాయాలతో ఒక కవిని చదవటం లేదా దూరంగా జరగటం రెండూ ఆగిపోవాలి.

పద్యంలో ఉన్నట్టు వచన కవిత్వానికి ధార ఉండాలా?

ఉండాలనే అంటాను. ధార అంటే వాక్యాలు బిరడా మూత విప్పి ఒంపినట్టు జారటం. దానికోసం ఎంతో మానసిక ప్రయాస కావాలి. రాసేవాడు ఏ స్థితిలో ఉన్నా మెట్టు వెనక మెట్టు చెక్కినట్టు వాక్యాన్ని చెక్కాలి. కవిత్వం పట్ల అపారమైన ప్రేమ ఉన్నప్పుడే అది సాధ్యమౌతుంది.



సాహిత్యేతర కారణాలతో ఒక కవిని లెక్కగట్టడాన్ని మీరు ఎట్లా పరిగణిస్తారు? ఈ విషయంలో మీ ముప్పైయేళ్ళ మీ కవిత్వానుభవం నేర్పిన పాఠం ఏమిటి?

జీవితంలో ఉండే రాజకీయాలు కవిత్వంలోకి చొరబడి దాన్ని కలుషితం చేయటం ఒక సారస్వత విషాదం. కవిత్వం రాస్తున్న తొలిరోజుల నుండి దీన్ని నిశితంగా చూసినవాడ్ని కనుక వాటికి దూరంగా ఉంటూ వచ్చాను. ప్రతిభావంతుడైన కవిని అతడి భావజాలంతో సంబంధం లేకుండా లెక్కగట్టటం నా అలవాటు. నా సారస్వత వ్యాస సంపుటి 'సౌరభం' దీనికొక గట్టి సాక్ష్యం. సాహిత్యేతర కారణాలతో కవుల్ని అంచనా కట్టేవాళ్ళు సహకవులకు పురాకవులకు చేసిన తాత్కాలిక ద్రోహాన్ని సరిచేయటంలో నా వంతు బాధ్యత నేను తీసుకున్నాను. మనం పట్టించుకోని కవుల్ని వాళ్ళ కాలాలతో నిమిత్తం లేకుండా తూచే ప్రయత్నం చేశాను.

మీ కవిత్వ జీవితం మీకు ఇచ్చిన గొప్ప కానుక ఏదైనా ఉందా?

జీవితంతో ఒడంబడిక చేసుకున్నట్టు కవిత్వం రాయటం వినా నాకు ఏ లాలసా లేదు. అదే గొప్ప కానుక. తెలుగు కవిత్వం ఖండాలు దాటి వెళ్ళాలి. అది మన ఉమ్మడి బాధ్యత.

వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ

పాలపిట్ట - వాసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వాసా ప్రభావతి సంస్మరణార్థం నిర్వహించే కవితల పోటీకి రచనల్ని పంపవలసిందిగా అన్ని ప్రాంతాల కవులను కోరుతున్నాం. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా: రూ.3వేలు, రూ.2వేలు, రూ.1000. ఎనిమిది కవితలకు రూ.500 చొప్పున ప్రత్యేక బహుమతులు. కవితలను ఏప్రిల్ 30 లోగా చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, బ్లాక్-6, ఎం.ఐ.జి-2, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 044కు పంపాలి. వివరాలకు: 94900 99327.

గుడిపాటి

కందికొండ పురస్కారం - 2023

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక నిర్వహించిన కందికొండ రామస్వామి స్మారక పురస్కారానికి స్ఫూర్తి కందివనం రచించిన 'డిమ్కి' కథల సంపుటి ఎంపికైంది. ఏప్రిల్ 21న నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే సభలో పురస్కార ప్రదానంతో పాటు పదివేల నగదు, శాలువా మెమెంటోతో సత్కారం జరుగుతుంది. వివరాలకు: 94927 65358.

వనపట్ల సుబ్బయ్య

అభినందన సత్కారాలు

జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షులు ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి 80వ జన్మదిన సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్‌కు పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించిన సందర్భంగా అనువాదకులు, కవి ఎలనాగకి జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడి అభినందన సత్కారం ఏప్రిల్ 7 మధ్యాహ్నం 2గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతాయి. సభలో అమ్మంగి వేణుగోపాల్, వాణీదేవి సురభి, డి.కె. సమరసింహారెడ్డి, పి.వి. ప్రభాకరరావు, వెలుదండ నిత్యానందరావు, వై. రామకృష్ణారావు, పి. లక్ష్మీనారాయణ, ఎం.కె. రాము, ఎస్.టి. సురేందర్ రావు, ఎం. శంకర్ రెడ్డి, నాళేశ్వరం శంకరం, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, గంటా జలంధర రెడ్డి తదితరులు పాల్గొంటారు.

సూర్యప్రకాశరావు రాయారావు

వి. చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారం

ఏప్రిల్ 13న వి. చంద్రశేఖరరావు జయంతి సందర్భంగా యువ కథారచయిత చరణ్ పరిమి 2024 సంవత్సరానికి గాను వి. చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారాన్ని అందుకుంటారు. గతంలో ఈ పురస్కారాన్ని ఎండపల్లి భారతి, సుంకోజి దేవేంద్రాచారి, ఇండ్ల చంద్రశేఖర్, దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి, వి. మల్లికార్జున్ స్వీకరించారు.

వి. ప్రసూన

శ్రీశ్రీ కి సినిమా అభ్యుదయ సాధనం

అప్పుడప్పుడే సినిమాలు మూకీల నుంచి టాకీల వైపు ప్రయాణం చేస్తున్నాయి. సినిమాల పట్ల సదభిప్రాయంలేని ఓ సంస్కృత పండితుడిని ఓ పాతికేళ్ళ కుర్రాడు "మాతో సినిమాకి మీరు కూడా రావాల్సిందే"నని బలవంతపెట్టి మరీ తీసుకెళ్లాడు. తెర వెలిగింది. "మందలు మందలుగా వెళ్తున్న గొర్రెలు" - ఫ్రేమ్ కాస్త డిజాల్వ్ - "గుంపులు గుంపులుగా తోసుకుంటూ వెళ్తున్న కార్మికులు". ఇది ఆ సినిమాలోని ఫస్ట్ షాట్. "వీడెవడో ఘటికుడులా వున్నాడు! నాందీశ్లోకంలోనే కథాంశం యావత్తూ సూచించడం సంస్కృత నాటక మర్యాద! ఎంత చక్కగా ఆ మర్యాద పాటించాడు!" అని మెచ్చుకుని చిత్రమంతా తదేక దీక్షతో చూసి ఒక కొత్త అనుభవం కలిగించావంటూ ఆ కుర్రాడ్ని అభినందించారు. అలా ఆ పండితుడికి సినిమాలపట్ల ఉన్న అభిప్రాయం పూర్తిగా మారిపోయింది. ఆ చిత్రం చార్లీచాప్లిన్ నటించి, దర్శకత్వం వహించిన 'మోడ్రన్ టైమ్స్' (1936). ఆ సంస్కృత పండితుడు భారతి సాహిత్య మాసపత్రికకు తొలి సంపాదకుడైన గన్నవరపు సుబ్బరామయ్య. ఆ పాతికేళ్ళ కుర్రాడు శ్రీశ్రీ.

శ్రీశ్రీది 73ఏళ్ళ సుదీర్ఘ జీవితం. "ఎనిమిదో ఏట నుంచే రచనలు చేసేవాడిని" అన్న మాట పరిగణన లోకి తీసుకొంటే 65ఏళ్ళ సాహితీ వ్యాసంగం. అందులో సినీరచయితగా 35ఏళ్ళ అనుభవం. కమ్యూనిజం తెలియకమునుపే ఆ ధోరణి, భావజాలాన్ని అలవరుచుకొన్న అభ్యుదయవాది. అప్పుడప్పుడే సమాజంపై ప్రభావం పెరుగుతున్న సినిమాలపట్ల కూడా శ్రీశ్రీ లోతైన అభ్యుదయభావాలను కలిగి ఉన్నాడు.

శ్రీశ్రీ విద్యాభ్యాస దశలోనే ఒకవైపు షేక్‌స్పియర్, బైరన్, కీట్స్, షెల్లీల వంటి సాహిత్యకారుల సాహిత్యారాధనలోనూ మరోవైపు చార్లీచాప్లిన్, పుడోవ్కిన్, డెసీకా వంటి దర్శక దిగ్గజాల సినిమా మోజులోనూ ఒకేసారి పడ్డాడు. శ్రీశ్రీ పుట్టింది 1910లో. భారతదేశ సినిమా పుంజుకున్నది



1935 తర్వాత. అంటే శ్రీశ్రీ వయసు పాతికేళ్ళు. అప్పటికి మద్రాసులోనే ఉన్నాడు. దక్షిణ భారత దేశం లోకి సినిమా బీజం ఎక్కడి నుంచి వచ్చింది? ఎలా మొలకెత్తి, మారాకులేసింది? - ఇదంతా శ్రీశ్రీ కళ్ళముందు జరిగిందనడంలో సందేహం లేదు.

1952లో ముంబాయిలో జరిగిన 'మొదటి అఖిల భారత చలనచిత్రోత్సవం'కి శ్రీశ్రీ ఆత్రేయతో కలిసి న్యాయనిర్ణేతగా వెళ్ళాడు. మద్రాసులో దక్షిణ భారత సినీ రచయితల సంఘానికి ఉపాధ్యక్షుడిగా (1976) కూడా పనిచేశాడు. రాజకీయ, సాహిత్య రంగాలను చూసినట్టే సినిమాని కూడా సామ్యవాద దృష్టితోనే చూస్తూ ఎదిగాడు. ఈ క్రమంలో 50ఏళ్ళ క్రింద వెల్లడించిన అభిప్రాయాలు, సూచనలు, సలహాలు ఈనాటికీ ఎంతో విలువైనవిగా తోస్తున్నాయి. చిత్రసీమపై, అందులోని వివిధ విభాగాలపై తన ఆలోచనలను అక్కడక్కడ వ్యాసాల్లోను, ముఖాముఖి చర్చల్లోను, 'సినీతంత్ర కాలమ్'ల ద్వారాను వెల్లడించాడు..

చిత్రసీమకి శ్రీశ్రీ కంటే ముందే శ్రీశ్రీ పాట వచ్చింది. ఆయన 1950లో 'ఆహుతి' సినిమా కోసం 'ప్రేమయే జనన మరణలీల' పాట రాయకముందే 1947లోనే 'కాలచక్రం' సినిమాలో శ్రీశ్రీ మహాప్రస్థాన గీతం 'నేను సైతం...'ను వాడారు. శ్రీశ్రీది వెయ్యికిపైగా గీతాలు రాసిన అనుభవం ఉంది. 'తెలుగు వీరలేవరా!' పాటతో తొలి జాతీయ అవార్డును 1974లో తెలుగువారికి తెచ్చిపెట్టాడు. కొన్ని పాటలు దృశ్యాలను మోస్తాయి, మరికొన్ని పాటలు సినిమాలనే మోస్తాయని నమ్మే శ్రీశ్రీని అసలు సినిమాకి పాటలు అవసరమా అని ప్రశ్నిస్తే, "పాటల్లేని చిత్రమే నిజమైనటువంటి చిత్రం" అంటూనే "మన ప్రత్యేక పరిస్థితుల్లో పాటలకి కథను మించిన ప్రాముఖ్యం కూడా ఉన్నదని చెప్పాలి" అంటాడు. మనకి ఇతర దేశాల్లో మాదిరి సెపరేట్ మ్యూజిక్ ట్రాక్స్ లేవు కాబట్టి పాటలు అవసరం అన్నది ఆయన ఉద్దేశం. పాటలు రాయటం గురించి మాట్లాడుతూ, "ఆది-అంత్యప్రాసలు వస్తే చాలు సినిమా పాట రాసెయ్యొచ్చని చాలామంది పొరబడుతూ ఉంటారు. పాటలు రాయడం చాలామంది అజ్ఞానులు అనుకున్నంత సులభం కాదు. పండితుల అనుకునేంత తేలిక కాదు. సినిమాపాట కొన్ని లక్షలమందిని మెప్పించాల్సి ఉంటుంది" అన్నాడు. సినిమా పాటలను కూడా సాహిత్య ప్రక్రియగా గుర్తించాలని భావించాడు శ్రీశ్రీ.

కథా రచయిత చిత్రసీమని శాసించే స్థాయికి చేరుకున్నప్పుడే విజయవంతమైన చిత్రాలొస్తాయని శ్రీశ్రీ భావించాడు. తమిళనాడులో రచయితల చేతిలోకి స్టీరింగ్ వీల్ వచ్చిందనీ, అందుకే అక్కడ కె.ఎస్. గోపాలకృష్ణ, వేలన్, ఎ.పి. నాగరాజన్‌లు రచయితలుగా మొదలై స్టూడియో అధినేతలయ్యారని; అన్నాదురై, కరుణానిధి లాంటివాళ్ళు గవర్నమెంటుని కూడా చేతుల్లోకి తీసుకున్నారని అంటాడు శ్రీశ్రీ. తమిళ నాడులో సాధ్యమైంది మన తెలుగులో కూడా సాధ్యమవుతుందన్నది ఆయన ఆకాంక్ష. తెలుగు రచయితల్లో అలసభావం ("డెవిల్ మే కేర్") మెంటాలిటీ ఉన్నదనీ, దీనితోపాటు ఇతర సాంకేతిక శాఖలలో పరిచయం లేదనీ చెబుతూ, ఈ కారణం వల్లనే మాటల ద్వారా చిత్రాల్ని విజయవంతం చేసిన సముద్రాల రాఘవాచార్య, త్రిపురనేని గోపీచంద్, అనిశెట్టి సుబ్బారావు, ఆత్రేయ లాంటి రచయితలు డైరెక్షన్‌లో మాత్రం ఫెయిల్ అయ్యారంటాడు. శ్రీశ్రీ అన్నట్టు నాటక రంగం నుంచి నిరూపించుకువచ్చిన ఆ తరం రచయితలు దర్శకులుగా విజయవంతమయ్యుంటే సినిమా కళకు సామాజికపరంగా, రాజకీయపరంగా మరిన్ని మెరుగులు దిద్దే ప్రయత్నం జరిగేది. గిరీష్ కర్నాడ్ (కన్నడ), జయకాంతన్ (తమిళం) మాదిరి మన చిత్రసీమలో కూడా కొన్ని 'జ్ఞానపీఠాల'ను సైతం చూసేవాళ్ళం. ఇప్పుడిప్పుడు పరిస్థితి మెరుగుపడి సినీరచయితలకు కూడా పద్మశ్రీలు పెరుగుతున్నాయి. ఇక, స్టూడియోలు, రాజ్యాధికారం ఏమోగాని రైటర్ - డైరెక్టర్ - ప్రొడ్యూసర్ క్రోనాలజీలో శ్రీశ్రీ ఆశించినట్టు ఇప్పుడిప్పుడే తెలుగులోనూ స్పీడు పెరిగిందనిపిస్తుంది.

"అసలు ప్రక్రియాభేదంతో రచయితలంతా రాసేది నాటకమే. నాటకం ఉత్తమోత్తమ కళ. దీనికి మూలధాతువు నటుడు. ఏ కవిత్వమైన అభినయంతోనే పరాకాష్ఠకు చేరుకుంటుంది. అది ప్రజల్లో చేర్చే నటుడికి క్రమశిక్షణతోపాటు నాటకరంగ అనుభవం కూడా ఉండాలి" అంటారు శ్రీశ్రీ. తారాగణ 'ప్రాధాన్యత'ను మాత్రం ఆయన నిరసించాడు. హీరో అనీ విలన్ అనీ ఒక్క మనదేశంలో మాత్రమే ఉంటుందని చెప్తూ, "ఇతర దేశాల చిత్రాలలోని ప్రముఖ నటీనటులను లీడ్ రోల్స్ అంటారు. ఒక పదేళ్ళ కుర్రాడి చుట్టూ కథ అల్లి చిత్రం తీస్తే అతడే ప్రముఖ నటుడవుతాడు," అంటారు. "ఒక్క నటుడికే ప్రాధాన్యం పెరిగితే సినిమా కళ కాకుండా వ్యాపార రంగంగా మారిపోతుంది" అంటారు. "నేటి సినిమా ఒక ఐస్‌బెర్గ్! నీటిమట్టం మీద నాలుగోవంతు ఈదేవాళ్లతో కలకలలాడుతుంటే నాలుగింట మూడువంతుల అభాగ్యులు నీటిలో మునిగి కనపడకుండా కలవరపడుతున్నారు" అని ఆయన అన్న మాట నేటికీ నిజమే. అందుకు చిత్తూరు నాగయ్య, పేకేటి శివరాం, కస్తూరి శివరావు వంటి నటుల అవసానదశలని గమనించవచ్చు. ఇది పేద సినీకళాకారుల దీనస్థితిపై శ్రీశ్రీ ఎప్పుడో చెప్పిన జోస్యం.

"ప్రొడ్యూసర్లందరూ డబ్బు చేసుకుందామనే దృష్టితో వచ్చేవాళ్ళే"నంటూ, "తెలుగు సినీమా రంగం తిమింగలాలతో కూడిన సముద్రం. ఈ తిమింగలాలు మొత్తం కళా సాగరాన్ని కల్లోలపరుస్తున్నాయి. ఈ సముద్రంలో కనీసం అభ్యుదయ భావాలతో కూడిన చిన్న దీవినైనా ఏర్పాటు చేయాలి," అని ఆశపడ్డాడు. ఇదంతా సమిష్టి భావనతో సాధ్యమయ్యే మార్పు. పెట్టిన రూపాయి వెనక్కి రావడం సినిమాకు ప్రధాన అంశం. అది లేకపోతే ఒక ప్రొడ్యూసర్ ఒక సినిమా మాత్రమే తీయగలడు. ఈ మధ్యకాలంలో క్రౌడ్ ఫండింగ్ సినిమాలు ఒకటీ అరా మొదలై ఆగిపోయాయి. ఈ తోవలో శ్రీశ్రీ అప్పట్లోనే దృష్టి సారించడమన్నది విశేషం. దీనివెనుక 'చెవిలో రహస్యం' సినిమాకు నిర్మాతగా చేతులు కాల్చుకున్న అనుభవం లేకపోలేదు. దర్శకుడిగా మెగాఫోన్ పట్టుకునే అవకాశాలు, సందర్భాలు శ్రీశ్రీకి అప్పట్లో చాలానే ఉన్నాయి. కానీ కమ్యూనిస్ట్ కార్యకలాపాల్లో సమయం లేకనో, ఇష్టం లేకనో దర్శకత్వం చేయలేదు. "సమాజాన్ని ప్రభావితం చేయగలిగిన సినిమా నాకో సరదాగానే మిగిలింది... నాకున్న ఇన్ని సంవత్సరాల సినిమా అనుభవంతోనూ లవలేశమైనా సామాజిక ప్రయోజనం సాధించలేకపోయాను" అని బాధపడ్డాడు.

సాహిత్యంలో అందరూ మెచ్చే ఠాగూర్‌ని తాను మెచ్చనట్టుగానే, సినిమాల్లో సత్యజిత్ రేని శ్రీశ్రీ హర్షించలేదు. ఇటాలియన్ సినిమాల ప్రభావంతో పైకొచ్చాడు తప్పా అతడిలో సొంత నిబద్ధత, వ్యక్తిత్వమంటూ ఏదీ లేదని ఆరోపించాడు. ఈ రెండు గుణాలు కలిగిన మృణాల్ సేన్, శ్యామ్ బెనగల్ గొప్ప దర్శకులన్నాడు. తెలుగులో ఆదుర్తి సుబ్బారావు, కె.బి. తిలక్, మాదాల రంగారావులని శ్రీశ్రీ అభిమానించి ప్రోత్సహించేవాడు. నిర్మాతకూ నటుడికీ మధ్య దర్శకుడు నలిగిపోతున్నాడని, ఈ ఇద్దరినీ శాసించే స్థాయికి చేరుకున్నప్పుడే విజయవంతమయ్యే చిత్రాల శాతం పెరుగుతుందనీ శ్రీశ్రీ సూచించాడు. శ్రీశ్రీ పేర్కొన్న ఈ లోపం కొన్ని తరాలపాటు అలాగే కొనసాగింది. ఇప్పుడిప్పుడే చిత్రసీమలో హీరోలతో సమానంగా దర్శకుణ్ణి గుర్తించి ఆదరిస్తున్నారు.

ఆధునిక కాలంలో సంస్కృతీ సంప్రదాయాలపై, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలపై మాధ్యమాలు ఎంతో ప్రభావాన్ని చూపుతున్నాయి. అందులో సినీమాధ్యమం తీవ్రత ఎక్కువ. ఈ ప్రభావాన్ని తమిళ సినీ రచయితలు గుర్తించారు. జాతీయ కవిగా సుబ్రహ్మణ్య భారతి, అంబేద్కర్ సరసన పెరియార్‌ని నిలిపే ప్రయత్నాల్లో సినిమాను కూడా భాగం చేసుకున్నారు. తెలుగులో ఈ విధమైన చేవ ఉన్నా చొరవ తక్కువ. తెలుగువాళ్ళు తీసే సినిమాల్లో సమకాలిక సమాజం కనపడదన్న విమర్శ ఎప్పటి నుంచో ఉంది. శ్రీశ్రీ కూడా తెలుగు సినిమాల్లో "కథానాయకుడి ఊరేదో, పేరేదో, ఇంటిపేరేదో తెలియదు" అంటాడు. వాస్తవానికి సమాజ ధోరణిని తెలిపే వాస్తవిక ఘటనలెన్నో సినిమాగా మలచగలిగే నాటకీయతను కలిగి ఉన్నవి మనకు చాలానే ఉన్నాయి. పునర్వివాహానికి సుముఖంగా వుండి సనాతనుల మధ్య ఇరుక్కుపోయిన ఓ వితంతువును ఆ గ్రామం నుంచి రాత్రిపూట ఎలా లేవదీసుకు రావాలని కందుకూరి, బ్రహ్మ సమాజం బృందం వేసిన ప్రణాళికలు; వితంతు వివాహం అనంతరం అటు పుట్టింటివారు - ఇటు మెట్టినింటి వారుగాని కలగజేసుకొకపోతే పెళ్లి చేసిన తామే తిరిగి బాధ్యత వహించవలసి వచ్చినప్పుడు ఉన్నవ లక్ష్మీనారాయణ దంపతులు పడ్డ మానసిక, ఆర్థిక సంఘర్షణలు; ఒకప్పుడు చల్లా యానాదుల జీవన కేంద్రమైన నేటి రాకెట్ కేంద్రం శ్రీహరికోట నుంచి వారిని ఖాళీ చేయిస్తున్నప్పుడు వారి వేదనలు; వాకపల్లి గిరిజన మహిళల తరపున కె. బాలగోపాల్ పోరాటం ఇలా ఎంతో నాటకీయత ఉన్న వాస్తవ సామాజిక సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కానీ వాటిని సినిమాలుగా మలచటంపై ఎందుకో నాటి 'మధ్యతరం' దర్శకులు దృష్టి సారించలేకపోయారు. "వాళ్ళు అవే చూస్తున్నారు కాబట్టి మేము ఇవే తీస్తున్నాం" అన్న వాదనను మొన్న 'జైభీం' సినిమాకు ఇక్కడ తెలుగులో లభించిన ఆదరణ కూలదోసింది. రచయిత ముదిరి దర్శకుడు అయితేనే తెరపై తెలుగు జీవితాల సాంద్రత పెరుగుతుందని శ్రీశ్రీ అన్న మాట వాస్తవ రూపం దాల్చగలిగే పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయి. శ్రీశ్రీ అన్నట్టు సినిమా బాగుకీ, భ్రష్టుకీ కూడా ఉపయోగపడుతుంది. అది చాలావరకు తీసేవారిని బట్టి, కొంతవరకు చూసేవారిని బట్టి ఉంటుంది. శ్రీశ్రీ దృష్టితో సాహిత్య కోణంలో సినిమా కళని చూస్తే, ఆయన ఆలోచనలు ఇప్పటికైనా సాకారమైతే- సినిమా ఒక వినోదంగా మాత్రమేగాక, అభ్యుదయ సాధనంగా కూడా మారగలదు.

> **"ప్రొడ్యూసర్లందరూ డబ్బు చేసుకుందామనే దృష్టితో వచ్చేవాళ్ళే. తెలుగు సినీమా రంగం తిమింగలాలతో కూడిన సముద్రం. ఈ తిమింగలాలు మొత్తం కళా సాగరాన్ని కల్లోలపరుస్తున్నాయి. ఈ సముద్రంలో కనీసం అభ్యుదయ భావాలతో కూడిన చిన్న దీవినైనా ఏర్పాటు చేయాలి." - శ్రీశ్రీ**

బుగడూరు మదనమోహన్ రెడ్డి
99898 94308

ఊరు లేని పేరు

దిక్కూలేని దివాణమూ లేని
దీనికీ నలుదిక్కులున్నాయి.

తూర్పునుంటుంది
తత్తర పడని తొత్తరమూడి.
పశ్చిమాన
అల్లుకునుంటుంది అయినవిల్లి
దక్షిణానేమో నేమినాథునూరు.
ఏనాటిదో ఉత్తరాన వృద్ధగౌతమి.

చొరబడలేక
సంచరించే సందేలేక
ఉభయ సంధ్యల నడుమ
ఊగిసలాడుతుంది
ఊరేలేని ఆ పేరు.

వీనులు వింటూ
నాల్కలపై నానే
నదీ తీరప్రాంతంపై
చూపెంత సారించినా
చూడలేవు కదా కనులు.

మేఘాలు మారుతంతో
మసకలాడుతాయి.
రుతువులు ఇరుకు
ఇరుసుగుండా దొర్లాడుతాయి.

కాలమనే భ్రమల ముళ్ళు
మూడు తిరుగాడుతాయి.
సాధువుల గుండెలు పీల్చే
గంజాయి పొగలా
కనీకనిపించక వాసనేస్తుంది.
దీన నేత్రాల భిక్షకుల గుంపులాగా
కళకళలాడుతుంది కాంతులీనుతుంది.

తాను నడుమ నుండి
పైనొకటీ క్రిందొకటీ
కార్తీక దీపాలను
మోసుకుపోతుంది కాల్వ

ప్రభల తీర్థపు తీరంలో
మందగించిన చూపులను
స్పృశిస్తుంది
యవ్వన కాలంనాటి
ప్రౌఢ ప్రియురాలు.

ఆకాశ దుఃఖాన్ని
కురిసే ఆరుద్ర కార్తె,
రోహిణీ కార్తె
తీక్షణ గ్రీష్మమూ
స్నిగ్ధ హిమవన్నగం
అనూరాధ కార్తె
ఈ పురాప్రాంతంపై పరిఢవిల్లుతాయి.

వరదలు ముంచుకు వస్తాయి.
కావలి కాసే ఏటిగట్ల నడుమ
ఆత్మీయుల ఆత్మలన్నిటికీ
పుణ్యస్నానాలు చేయిస్తాయి.

పురిటినొప్పులనూ
పేద రైతు లేగలనూ
నిర్భాగ్యపు దొంగల



లేత రెక్కలనూ
తమతో తోడ్కొని వెళతాయి.

పన్నెండేళ్ళకోమారు
ప్రాయం మారి వస్తాయి
నవీన జలాలు,
పాపాలను ప్రక్షాళించి
సముద్రాన నిమజ్జనమవుతాయి.

అనాది నాదాన్ని
గానం చేసే రావిచెట్టు
చితి మొదలు మొలిచిన
తులసి మొక్క
ఒంటరి రాత్రుళ్ళతో
సహవాసం చేస్తాయి.

ఆకాశానికీ నేలకూ నడుమ
భస్మమయ్యే దేహాలు.
పాతాళానికీ భువికీ మధ్యన
ఖననమయ్యే కాయాలు.
సమాధులపై శయనించే పౌర్ణమి.
చితిమంటల్లో కాలిపోయే
అమావాస్య.

కాయలు కాసి చూసే
పూర్వీకుల కనులు
బాల్యపు వేదనను
మరల అలమే అశ్రుపార.

మృదువైన ఎముకల వంటి
పొడవాటి రెల్లు పూలూ
బంగారు రంగు ఇసుకా సాక్షి.

విలస తామ్రపత్రంలోలేని
కడకు కడ తేరిపోవటమేనని
గడచిన ఘడియలనీ
నిర్నిమిత్త నిమిషాలనీ
క్షణికమైన క్షణాలనీ క్షమించే
ఊరు మాత్రం లేని ఆపేరొకటీ

క్షణముక్తేస్వరం.

బడుగు భాస్కర్ జోగేష్
98666 02325



కవిత నా కవిత!

ఉప్పొంగే భావాల్ని అదిమిపడతాను
కూరలో ఉప్పూకారం
సరిపడ్డాయా అని కంగారుపడతాను
ఓపక్క రసతృష్ణ కృష్ణమేఘమై
లోలో జలజలమంటుంది
పొయ్యిమీద మిరియాలరసం ఎక్కడికి పోతావని
సలసలమంటుంది

ఇంటిల్లిపాదినీ వదుల్చుకుని
వంటిల్లిపాదినీ
తెముల్చుకుని
జోలుమాటల్నీ బోలుమర్యాదల్నీ విదుల్చుకుని
నాకోసం నే జీవించాలని
గుప్పెడు నిముషాల్ని గుండెమూలన అస్తారపదంగా
అట్టిపెట్టుకుంటానా -
విచ్చుకోబోయిన భావకల్హారం
అప్పటికే ముడుచుకున్న అత్తిపత్తి అవుతుంది!
కొద్దిపాటి ఆశాతైలంతో మినుకుమనే కవనదీపం
కునకనా వద్దా అని రెపరెపమంటుంది!!

మసకేసిన భావంలో
రసపుష్టి
ఇసుకను ఇంకిన నీటిఛాయ!
క్షీణజ్యోత్స్నలో కనుజారిన
జిలుగుచేలాంచలసుందరి మహామాయ!!

ఘంటశాల నిర్మల

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.4 కనిష్ఠం 25.3

ఈస్టర్ ప్రార్థనలు



ఈస్టర్ పర్వదినం సందర్భంగా కూకట్‌పల్లిలోని కల్వరి టెంపుల్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు భారీగా హాజరైన క్రిస్టియన్లు. (ఇన్‌సెట్లో : ఆబిడ్స్ సెయింట్ జోసెఫ్ కేథడ్రల్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు)



ఉత్సాహంగా అహింసా రన్

ఖైరతాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతిని కోరుతూ జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అహింసా రన్ ఉత్సాహంగా సాగింది. పీవీ నర్సింహారావు మార్గంలోని జలవిహార్ నుంచి 3కె, 5కె, 10కె విభాగాలలో నిర్వహించిన ఈ రన్‌ను తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య పండుగలో అందరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. మహిళలు, పురుషులకు వయస్సుల ప్రకారం వేరువేరుగా జరిగిన ఈ రన్‌లో దాదాపు 2వేల మంది పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జీతో)హైదరాబాద్ చైర్మన్ సుశీల్ సంచేటి, ప్రధాన కార్యదర్శి పరేష్ షా, మహిళా విభాగం చైర్ పర్సన్ వీణా జైన్, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

గ్రేటర్‌గా మారని
సిటీ రేషన్
ప్రతిపాదనలకే పరిమితమైన శివార్ల విలీనం

- సిటీలో తొమ్మిది, శివారులో మూడు సర్కిళ్లు
- మూడు జిల్లాల పర్యవేక్షణలో పౌరసరఫరా

నగర పౌర సరఫరాల విభాగాన్ని విస్తరించాలన్న ప్రతిపాదన ఫైళ్లకే పరిమితమవుతున్నది. హైదరాబాద్ గ్రేటర్ హైదరాబాద్‌గా మారినట్టే.. సిటీరేషన్ వ్యవస్థనూ విస్తరించి సీఆర్‌వోను కాస్తా జీసీఆర్‌వోగా మార్చాలన్న ఆలోచన కేవలం ఆలోచనగానే మిగిలిపోయింది. నిజానికి గ్రేటర్ పరిధిలో ఉన్న రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల రేషనింగ్ వ్యవస్థను విలీనం చేయడం ద్వారా పర్యవేక్షణ సులువవుతుంది. కానీ డీలర్లు మాత్రం.. నగర అధికారుల తనిఖీలు పెరుగుతాయని, దాని వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని భావించి వ్యతిరేకిస్తున్నట్టు తెలిసింది.



(ఫైల్)

హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పన్నెండు రేషన్ సర్కిళ్లు ఉన్నాయి. అయితే, ఇందులో తొమ్మిది సర్కిళ్లు హైదరాబాద్ జిల్లా పరిధిలో ఉండగా, మిగతా మూడు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధుల్లో ఉన్నాయి. దీంతో రేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నది. జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ సంస్థలు గ్రేటర్‌గా మారి తమ సేవలను హైదరాబాద్‌లోని శివారు ప్రాంతాలకు విస్తరించాయి. కానీ.. నగర పౌరసరఫరాల వ్యవస్థ మాత్రం ఇంకా అలాగే ఉంది.

గ్రేటర్‌లోని పన్నెండు సర్కిళ్లలో హైదరాబాద్‌ను సీఆర్ఓ, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని శివారు సర్కిళ్లను జిల్లా పౌర సరఫరాల అధికారులు (డీఎస్ఓ) పర్యవేక్షిస్తున్నారు. ఒకే అధికారి పర్యవేక్షణలో ఉంటే వ్యవస్థ ఒక గాడిలో ఉండి సరఫరా మెరుగ్గా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే.. ఆ దిశగా ఎవరూ దృష్టి సారించడం లేదు.

విలీనం చేయాలని..

గ్రేటర్ పరిధిలోని అన్ని రేషన్ దుకాణాలు, సర్కిళ్ల కార్యాలయాలను సీఆర్ఓ పరిధిలోకి విస్తరించాలని అప్పట్లో అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు అవసరమైన పేపర్‌వర్క్ పూర్తి చేసి నివేదిక సిద్ధం చేసి పౌరసరఫరాల సంస్థ కమిషనర్ కార్యాలయానికి పంపించారు. ఆ తర్వాత ప్రభుత్వానికి విన్నవించారు. అయితే, ఆ ప్రతిపాదనలు ఒక అడుగు

మిగతా 5వ పేజీలో..


హాస్టల్ ఫీజు డబుల్



పోటీ పరీక్షల నేపథ్యంలో భారీగా పెంచేసిన నిర్వాహకులు

- గతంలో రూ.4వేలు.. ఇప్పుడు రూ.6 నుంచి రూ.8 వేలు
- నాణ్యత లేని భోజనం, వసతులు లేని హాస్టల్
- అటు కోచింగ్, ఇటు హాస్టల్ ఫీజుల పెంపుతో అభ్యర్థులు సతమతం
- ఫుడ్‌సేఫ్టీ అధికారులు హాస్టళ్లను తనిఖీ చేయాలని డిమాండ్

నగరంలోని పలు ప్రైవేట్ హాస్టళ్లకు డిమాండ్ పెరిగింది. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లు విడుదల కావడంతో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన వారు కోచింగ్ సెంటర్ సమీపంలోనే ఉండేందుకు మొగ్గు చూపుతున్నారు. గది అద్దెకు తీసుకుని, రోజూ వంట చేసుకుని తంటాలు పడడం ఎందుకని హాస్టళ్లలో చేరిపోతున్నారు. డిమాండ్‌ను సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్న హాస్టళ్ల నిర్వాహకులు ఇదే అదునుగా నెలవారీ చార్జీలను రెట్టింపు చేశారు.



హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టింది. ఈ మేరకు 563 ఖాళీలతో కూడిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను గత ఫిబ్రవరి 19న విడుదల చేసింది. ప్రిలిమినరీ పరీక్షను జూన్ 9న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అలాగే 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇదే సమయంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేసింది. దీంతో ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో ఉన్న వివిధ జిల్లాల నిరుద్యోగులు గ్రూప్-1 ప్రిలిమినరీ, టీఆర్‌టీ, టెట్ కోచింగ్ తీసుకునేందుకు హైదరాబాద్ బాట పట్టారు. దీంతో కోచింగ్‌సెంటర్ల సమీపంలో ఉన్న హాస్టళ్లకు డిమాండ్ పెరిగింది.

భారీగా పెరిగిన ఫీజులు

నగరంలోని అశోక్‌నగర్, చిక్కడపల్లి, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, కూకట్‌పల్లిలలో కోచింగ్‌సెంటర్లు ఎక్కువగా ఉన్నాయి. వీటిల్లో కోచింగ్ ఫీజులూ గతంతో పోలిస్తే భారీగానే పెరిగాయి. ఉదాహరణకు దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు గతంలో రూ.1.25 లక్షల నుంచి రూ.1.40 లక్షల వరకు ఉండేది. ఇప్పుడది

మిగతా 5వ పేజీలో..

పారిశుధ్య కార్మికుల
సింథట్రిక్స్‌కు చెక్..!

- నేటినుంచి ముఖ గుర్తింపు హాజరు
- ఆదివారం ప్రయోగాత్మకంగా అమలు



హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల బోగస్ హాజరుతో చేస్తున్న అక్రమాల నియంత్రణలో కీలక అడుగు పడింది. ముఖ గుర్తింపు ఆధారిత (ఫేస్ రికగ్నిజేషన్) యాప్ ద్వారా హాజరుకు జీహెచ్ఎంసీలో శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు హాజరుకు వినియోగిస్తోన్న బయోమెట్రిక్ యంత్రాలను మెజార్టీ సర్కిళ్ల నుంచి శనివారమే ఐటీ విభాగానికి అందజేశారు. ఆదివారం కొత్త హాజరు విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేశారు. సోమవారం నుంచి పూర్తిస్థాయిలో ముఖ గుర్తింపు ఆధారిత యాప్ ద్వారా కార్మికుల హాజరు తీసుకోనున్నట్టు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఎంటమాలజీ విభాగంలోనూ నయా హాజరు విధానాన్ని వినియోగించనున్నారు. బల్దియాలోని 30 సర్కిళ్లలో 18 వేలకుపైగా అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులున్నారు. వీరి హాజరు, రోడ్లపై స్వీపింగ్‌ను 952 మంది శానిటరీ ఫీల్డ్‌అసిస్టెంట్లు (ఎస్ఎఫ్ఏ) పరిశీలిస్తారు. విధులకు రాని, కాగితాల్లో మాత్రమే ఉండే కార్మికులకు సింథటిక్ వేలిముద్రల ద్వారా హాజరు వేస్తూ.. వారి వేతనాలను కాజేసి కొందరు ఎస్ఎఫ్ఏలు, శానిటరీ జవాన్లు, ఏఎంఓహెచ్‌లు, డీసీలు పంచుకుంటున్నారు. పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్టు చేసినా అవకతవకలు ఆగడం లేదు. ఈ నేపథ్యంలో అక్రమాలకు అవకాశం లేని నూతన హాజరు విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

యాంటీలార్వల్ ఆపరేషన్, చెరువుల్లో గుర్రపుడెక్క తొలగించే ఎంటమాలజీ విభాగంలో 2,500 మంది కార్మికులకు కూడా కొత్త పద్ధతిలో హాజరు తీసుకుంటారని అధికారులు చెబుతున్నారు. దీంతో పారిశుధ్య, ఎంటమాలజీకి సంబంధించి అసలు కార్మికులు ఎందరు..? బోగస్ ఎంతమంది..? అన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశముంది.



సన్ డే..

భానుడి భగభగలతో నగరవాసులు అల్లాడిపోతున్నారు. రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. ఎప్పుడూ సందడిగా కనిపించే సచివాలయం-ఎన్‌టీఆర్ గార్డెన్ రోడ్డు ఆదివారం ఎండ తీవ్రతతో బోసిపోయి కనిపించింది.

నేడు, రేపు పీఓ, ఏపీఓలకు శిక్షణ

హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సమర్థ నిర్వహణ కోసం ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ (ఏపీఓ)లకు సోమ, మంగళవారాల్లో శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. నగరంలోని 15 కళాశాలల్లో ఒక్కో కాలేజీలో నాలుగు హాళ్ల చొప్పున 60హాళ్లలో 11,442 మందికి శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఒక్కో విడతలో 50మంది చొప్పున అధికారులకు శిక్షణ ఉంటుంది. శిక్షణకు వచ్చే పీఓ, ఏపీఓలు పోస్టల్ బ్యాలెట్ కోసం ఓటర్ గుర్తింపు కార్డు నంబర్, ఓటర్ జాబితాలో పార్ట్/సీరియల్ నంబర్ వివరాలు తీసుకొని రావాలని సూచించారు. శిక్షణ తరగతుల వద్ద ఫారం-12లో వివరాలు నమోదు చేసి ఇస్తే.. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశముంటుందని చెప్పారు.



జీహెచ్ఎంసీలో ఆస్తిపన్ను వసూలు
1914.87 కోట్లు

- గతేడాదితో పోల్చితే రూ.254.49 కోట్లు అదనం
- చివరిరోజు రూ.123.05 కోట్ల ఆస్తిపన్ను జమ



హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను జీహెచ్ఎంసీలో రూ.1914.87 కోట్ల వరకు ఆస్తిపన్ను వసూలైనట్టు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ చెల్లింపులు, నగదు వసూలు, చెక్కులకు సంబంధించి సోమవారం స్పష్టత వస్తుందని పేర్కొన్నా రు. అధికారులు గ్రేటర్‌లో రూ.2100 కోట్ల పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ మేరకు పన్ను వసూలు కాలేదు. గత ఏడాది రూ.1660.38 కోట్ల ఆస్తిపన్ను వసూలు కాగా.. ఈ ఏడాది రూ.254.49 కోట్లు పెరిగి రూ. 1914 కోట్లకు చేరింది. ఒక్క మార్చి నెలలోనే రూ.500.04 కోట్ల ఆస్తిపన్ను వసూలు కాగా, చివరి రోజు ఆదివారం రాత్రి 10 గంటల వరకు రూ.123.05 కోట్లు వసూలైంది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆదాయం పెంచుకునేందుకు ఆస్తిపన్ను వసూలుపై గ్రేటర్ ప్రత్యేక దృష్టిని సారించింది. ఈ నేపథ్యంలో బల్దియా విజ్ఞప్తి మేరకు సర్కారు వన్ టైం స్కీమ్(ఓటీఎస్) ప్రకటించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలపై వడ్డీని 90 శాతం మాఫీ చేస్తూ పన్ను చెల్లించే అవకాశం కల్పించింది. ఈ పథకంతో రూ.400-450కోట్ల పన్ను వసూలవుతుందని భావించగా.. రూ.319.59 కోట్ల వరకు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

ఎదురుపడ్డా..
పలకరింపులు లేవు

- ఒకే వేదికపై కేటీఆర్, రంజిత్‌రెడ్డి





నార్సింగ్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల వేళ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అత్యంత సన్నిహితంగా మెలిగేవారు కూడా విరోధులుగా మారుతారు. ఇటీవల చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. ఈ విషయంలో మాజీ మంత్రి కేటీఆర్.. ఎంపీ రంజిత్‌రెడ్డి వైఖరిపై ఫైర్ అయిన సంగతి తెలిసిందే. అయితే, వీరిద్దరూ శంషాబాద్‌లో ఆదివారం రాత్రి జరిగిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మనవరాలి పెళ్లి వేడుకలో ప్రత్యక్షమయ్యారు. ఎంపీ రంజిత్‌రెడ్డి స్టేజీపై ఉండగానే మాజీ మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి వధూవరులను ఆశీర్వదించేందుకు స్టేజీ ఎక్కారు. రాజకీయాలు పక్కనపెట్టి వీళ్లు పలకరించుకుంటారేమోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారు. కానీ.. అదేమీ జరగలేదు. కేటీఆర్, సబితారెడ్డి పక్కనుంచే రంజిత్‌రెడ్డి స్టేజీ దిగి వెళ్లిపోయారు. ఎదురుపడినా ఒకరిని ఒకరు పలకరించుకోలేదు. ఈ వివాహ వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాసయాదవ్, వివేకానంద, మాగంటి గోపీనాథ్, ఆరెకపూడి గాంధీ, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, దయానంద్, సీఎం సోదరుడు కొండల్ రెడ్డి, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

కడియం శ్రీహరి కులంపై న్యాయవిచారణ జరిపించాలి

● టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మాదిగకులానికి చెందిన వ్యక్తిగా చెప్పుకుంటూ రాజకీయ లబ్ధిపొందిన కడియం శ్రీహరి కులమేదో తేల్చేందుకు సమగ్ర న్యాయవిచారణ జరిపించాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగను కాదని స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్‌ను బీఆర్ఎస్ పార్టీ కడియం శ్రీహరికి ఇస్తే గెలిచిన తర్వాత నేడు కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటని అన్నారు. మాదిగజాతికి ఎలాంటి ఉపకారమూ చేయని కడియం కుమార్తెకు కాంగ్రెస్ పార్టీ నుంచి వరంగల్ ఎంపీ సీటును ఇవ్వడం సరైంది కాదన్నారు. ఎంపీ టికెట్‌కు అర్హులైన మోత్కుపల్లి నర్సింహులు, ఆరూరి రమేష్, పసునూరి దయాకర్ వంటి వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. మాదిగ నేతలను కాదని కడియం శ్రీహరి కుమార్తె కావ్యకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ ఇస్తే అడుగడుగునా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.



పీవోడబ్ల్యూ సంధ్యకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న రచన

తెలంగాణ ట్రాన్స్ స్వాభిమాన పురస్కారాల ప్రదానం

హైదరాబాద్ సిటీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య, ఉద్యోగ, వ్యాపార తదితర రంగాలలో రాణిస్తోన్న పలువురు ట్రాన్స్ వ్యక్తులకు ఆదివారం అన్నపూర్ణ స్టూడియోలో ట్రాన్స్ మార్చ్ కలెక్టివ్ ప్రతినిధులు 'తెలంగాణ ట్రాన్స్ స్వాభిమాన పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం దశాబ్దకాలంగా పనిచేస్తోన్న తెలంగాణ మహిళా ట్రాన్స్‌జెండర్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు సజయ, పీవోడబ్ల్యూ సంధ్య, మహిళా హక్కుల కోసం ఉద్యమిస్తోన్న భూమిక ఉమెన్స్ కలెక్టివ్ కొండవీటి సత్యవతి, నిర్మాణ్ సంస్థ నిర్వాహకురాలు దీప్తి తదితరులు తెలంగాణ ట్రాన్స్ స్వాభిమాన అవార్డులు అందుకున్నవారిలో ఉన్నారు. ట్రాన్స్ వ్యక్తుల సాధికారత కోసం తోడ్పడుతున్న పరివార్, గౌరవ్ ఫౌండేషన్, మిత్ర క్లినిక్ తదితర స్వచ్ఛంద సంస్థల సేవలను నిర్వాహకురాలు రచన ముద్రబోయిన గుర్తుచేశారు. అంతర్జాతీయ ట్రాన్స్ విజిబిలిటీ డే సందర్భంగా వివిధ రంగాలలో రాణిస్తోన్న ట్రాన్స్ వ్యక్తులను గుర్తించి మొట్టమొదటిసారిగా అవార్డులను అందిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. తాను ప్రార్థనా మందిరాలలో ట్రాన్స్‌వ్యక్తుల హక్కులపై అవగాహన కల్పిస్తున్నట్లు ఎవాంజెలిస్టు అంజలి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ట్రాన్స్ వ్యక్తులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వక్తలు డిమాండ్ చేశారు.

'ఆంధ్రజ్యోతి'కి అవార్డు



సామాజిక, పౌర సంఘాలతో పాటు 'ఆంధ్రజ్యోతి'కి తెలంగాణ ట్రాన్స్ స్వాభిమాన అవార్డును ప్రదానం చేశారు. ట్రాన్స్ మహిళల గాథలను పలు సందర్భాలలో ప్రచురించడంతోపాటు వారి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నందుకుగాను అంతర్జాతీయ ట్రాన్స్ విజిబిలిటీ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి తెలంగాణ ట్రాన్స్ స్వాభిమాన పురస్కారాన్ని అందిస్తున్నట్లు నిర్వాహకురాలు రచన ముద్రబోయిన పేర్కొన్నారు.



తెలంగాణ విద్యుత్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ జేఏసీ చైర్మన్ కె.రఘు

విద్యుత్‌కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదడంరాం అన్నారు. తెలంగాణ విద్యుత్ వర్కర్స్ యూనియన్ (బి-2871) రాష్ట్ర కార్యాలయాన్ని ఖైరతాబాద్ మింట్‌కాంపౌండ్‌లో తెలంగాణ జేఏసీ చైర్మన్ కె.రఘుతో కలిసి కోదండరాం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొ.కోదండరాం మాట్లాడుతూ ఎలాంటి సవాళ్లు ఎదురైన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాడిన వ్యక్తి గాంబో నాగరాజు అని, భయపడకుండా కార్మికుల పక్షాన పోరాడినందకే ఈరోజు కార్యాలయం తిరిగి తెరుచుకుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ వర్కర్స్ యూనియన్ (బి-2871) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గాంబో నాగరాజు, ప్రధాన కార్యదర్శి నాగం సంతోష్‌రెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు మురళీ, రాష్ట్రకార్యవర్గ సభ్యులు రమేష్, వెంకటేష్, సత్యం, బాలసిద్ధులు, దుర్గా ప్రసాద్, లక్ష్మణ్, బాలకృష్ణ, పాల్గొన్నారు.



పట్టుబడిన హాష్ ఆయిల్ మూడు సెల్‌ఫోన్‌లు

2.2 కేజీల హాష్ ఆయిల్ పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్ట్.. ఒకరు పరార్
- మూడు సెల్‌ఫోన్‌లు, పల్సర్‌బైక్ స్వాధీనం

పేట్‌బషీరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గండిమైసమ్మ వద్ద రూ.11 లక్షల విలువ చేసే 2.2 కేజీల హాష్ ఆయిల్‌ను బాలానగర్ ఎస్‌ఓటీ, మేడ్చల్ పోలీసులు కలిసి ఆదివారం పట్టుకున్నారని బాలానగర్ జోన్ డీసీపీ, మేడ్చల్ జోన్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు తెలిపారు. ముగ్గురిని అరెస్టు చేశామని, ఒకరు పరారీలో ఉన్నారని తెలిపారు. వారి వద్ద నుంచి పల్సర్‌బైక్, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆదివారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ ఎస్‌ఓటీ, మేడ్చల్ పోలీసులతో కలిసి డీసీపీ శ్రీనివాసరావు కేసు వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా, గోలుగుంట గ్రామానికి చెందిన గొల్లు కుమారస్వామి(21) నగరానికి వలసొచ్చి శివారులోని గండిమైసమ్మ ప్రాంతంలోగల ఓ కంపెనీలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో హాష్ ఆయిల్ వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్న కుమారస్వామి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తునికి చెందిన గంజాయి, హాష్ ఆయిల్ సరఫరాదారుడు నాగేశ్వరరావును సంప్రదించాడు. కుమారస్వామి తన స్వగ్రామానికి చెందిన, స్నేహితుడైన అజయ్‌కుమార్(24) హాష్ ఆయిల్‌ను హైదరాబాద్‌కు డెలివరీ చేసేలా ఒప్పందంకుదుర్చుకున్నాడు. అజయ్‌కుమార్ తన స్నేహితుడైన లోకవరపు స్వామిగణేష్(26)తో కలిసి పల్సర్ బైక్‌పై తుని ప్రాంతానికి వెళ్లి నాగేశ్వర్‌రావు వద్ద హాష్ ఆయిల్ తీసుకుని శనివారం రాత్రి హైదరాబాద్‌కు బయల్దేరాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్‌ఓటీ, మేడ్చల్ పోలీసులు కలిసి గండిమైసమ్మ ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో వీరి వాహనంలో 2.2 కేజీల హాష్ ఆయిల్ పట్టుబడింది. పోలీసుల విచారణలో కుమారస్వామి చెప్పడంతోనే తాము ఈ ఆయిల్ తీసుకొస్తున్నామని చెప్పారు. దీంతో పోలీసులు స్వామికుమార్, అజయ్‌కుమార్, స్వామిగణేష్‌లను అరెస్ట్ చేశారు. తునికి చెందిన నాగేశ్వరరావు పరారీలో ఉన్నాడని డీసీపీ తెలిపారు. అజయ్‌కుమార్ గతంలో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితుడని తెలిపారు. ఈ కేసును ఛేదించిన బాలానగర్ ఎస్‌ఓటీ, మేడ్చల్ పోలీసులను మేడ్చల్ ఇన్‌చార్జి డీసీపీ శ్రీనివాస్‌రావు అభినందించారు.



చార్మినార్‌లో మాతం నిర్వహిస్తున్న షియా ముస్లింలు

చార్మినార్ వద్ద షియా ముస్లింల మాతం

చార్మినార్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హజ్రత్ అలీ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం షియా ముస్లింలు చార్మినార్ వద్ద మాతం నిర్వహించారు. ఇందులో వందలాదిమంది పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా షియా ఉలెమాలు మాట్లాడుతూ ఇస్లాం రక్షణ కోసం సాగిన పోరాటంలో హజ్రత్ అలీ సైన్యాధిపతిగా విజయం సాధించారని, ఆయనను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం చార్మినార్ నుంచి కాలికబర్ వరకు హజ్రత్ అలీ పంజా ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు. ఊరేగింపు గుల్జార్ హౌజ్, పత్తర్‌గట్టి, మదీనా, దారుషిఫా గుండా సాగి కాలికబర్‌లోని ఇమామియా మసీదు వద్ద ముగుస్తుందని, అక్కడ సందేశం వినిపిస్తామని చెప్పారు. ఊరేగింపులో షియా ఉలెమాలు అలీ హైదర్ పరిష ఖిబ్లా, సయ్యద్ హైదర్ జైదీ, సయ్యద్ నజబ్ అలీ షఫత్, అబ్బాస్ నవాబ్, ఇనాయత్ అలీ బాకీ, మీర్ హైదర్ అలీ, హసన్ జైది, నిసార్ హుసేన్ హైదర్ అలీ,మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి

అఫ్జల్‌గంజ్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఉన్న పేద మత్స్యకారుల సమస్యల పరిష్కారంతో పాటు మహిళా మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి తాను అండగా నిలుస్తానని రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల చైర్మన్ మెట్టు సాయి కుమార్ అన్నారు. ఆదివారం గోషామహల్‌లోని మహిళా మత్స్యకారుల సంక్షేమ సంఘం కార్యాలయంలో మెట్టు సాయి కుమార్‌కు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మత్స్యకారులకు పెద్దపీట వేసే దిశగా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో కొప్పు పద్మ, పూస వరలక్ష్మీ, స్వరూప రాణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌గా మారని సిటీ రేషన్

(3వ పేజీ తరువాయి)

కూడా ముందుకు జరగలేదు. నిజానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందే శివారు రేషన్ వ్యవస్థ గ్రేటర్‌లో కలవాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లిప్త ధోరణి, శివారు డీలర్ల అడ్డంకులతో గ్రేటర్ సీఆర్‌ఓ ప్రతిపాదనలు ఫైళ్లకే పరిమితమయ్యాయి.

ఇబ్బందులను తప్పించుకోవడానికి

సీఆర్‌ఓ పరిధిని గ్రేటర్ వరకు విస్తరింపజేస్తే శివార్లలోని మూడు సర్కిళ్లు కలుస్తాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలోని సగం దుకాణాలు, ఆహార భద్రత కార్డులు సీఆర్‌ఓ పరిధిలోకి వచ్చి చేరుతాయి. దీంతో ఆయా జిల్లాల పౌరసరఫరాల వ్యవస్థకు కొంత మేరకు నష్టం వాటిల్లే ప్రమాదముంది. అందుకే ఈ విలీనానికి కొంతమంది అధికారులే ఆసక్తి చూపడం లేదని సమాచారం.

డీలర్లలో ఆందోళన

జిల్లాల పౌరసరఫరాల వ్యవస్థ జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో పనిచేస్తుంది. జిల్లా పరిధి అధికారుల పనితీరుకు అలవాటు పడిన కొందరు రేషన్‌డీలర్లు, విఎల్లర్లు 'గ్రేటర్ సీఆర్‌ఓ' ప్రతిపాదనలపై ఆసక్తి చూపడం లేదు. వారు ప్రస్తుతమున్న జిల్లాల అధికారుల పరిధిలోనే పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నారు. గ్రేటర్ సీఆర్‌ఓలో శివారు సర్కిళ్లు కలిస్తే సీఆర్‌ఓ, డీఎస్‌ఓల పర్యవేక్షణ నిత్యం ఉంటుందని డీలర్లు భావిస్తున్నారు. కొత్తగా సీఆర్‌ఓ వ్యవస్థలో చేరితే నిరంతరం ఏదో ఒక ఇబ్బంది వస్తుందని, తనిఖీలు ఉంటాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. దీంతో వారు పెద్దగా ఈ అంశంపై శ్రద్ధ చూపడం లేదు.

చేవెళ్లలో బీజేపీ జెండాను ఎగురవేస్తా

- చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో బీజేపీ జెండా ఎగురవేస్తానని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పర్‌పల్లి పీఆర్ ప్యాలెస్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ పి.మల్లేశ్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్నికల నేపథ్యంలో తాను చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. యాత్ర ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నానన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో గతంలోని బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చేవెళ్ల ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీని గెలిపించి నరేంద్ర మోదీని మరో సారి ప్రధానిగా చేయడానికి ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని



బీజేపీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

సమావేశంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేంరాజ్ యాదవ్, టి.అంజన్‌కుమార్ గౌడ్, బుక్క వేణుగోపాల్, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, యువ మోర్చా రాష్ట్ర నాయకుడు బొక్క బాల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాడెం సుధాకర్, చేవెళ్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ కన్వీనర్ జోగి రవి, అత్తాపూర్ కార్పొరేటర్ మోంగ్ర సంగీత, నియోజకవర్గం నాయకులు నరేందర్, మహలింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కార్డన్ సెర్చ్‌లో పోలీసులకు సూచనలు చేస్తున్న అధికారులు

మేకలమండిలో కార్డన్ సెర్చ్

చాంద్రాయణగుట్ట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌలిపుర మేకలమండిలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి 100 మంది పోలీసులతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 150 వాహనాలను తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో మూడు బీర్ కార్టన్‌లు, 10 లీటర్ల మద్య స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు రౌడీ షీటర్లకు దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, ఛత్రినాక ఏసీపీ సీహెచ్ చంద్రశేకర్ కౌన్సిలింగ్ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైన క్షమించేది లేదని హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

బీసీ బిల్లుపై బీజేపీ, కాంగ్రెస్ స్పష్టమైన ప్రకటన చేయాలి: ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లుపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు స్పష్టమైన ప్రకటన చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం ఎంపీ టికెట్లు ఇవ్వకపోతే ఆ పార్టీలను ఓడిస్తామని ఆయన హెచ్చరించారు. ఆదివారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ జాతీయ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ సంయుక్తాధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. 16 డిమాండ్లను ప్రధాన రాజకీయ పార్టీల ముందుంచుతున్నామన్నారు.ఏ పార్టీ స్పందిస్తే ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీకే మద్దతు తెలుపుతామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 56 శాతానికి పెంచాలని, రాజ్యాంగ భద్రత కల్పించాలని, జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలని, క్రీమీలేయర్‌ను రద్దు చేయాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, సామాజిక భద్రత రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి 2 లక్షల కోట్లను కేటాయించాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, నందగోపాల్, సుధాకర్, వేముల రామకృష్ణ, జి.అనంతయ్య, పృథ్విగౌడ్, రాందేవ్ మోదీ, నిఖిల్, వాణిరెడ్డి, ఉదయ్‌నేత, సతీష్, చంద్రశేఖర్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీస్తు పునరుత్థాన పండుగ

రాజేంద్రనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): యేసు ప్రభువు మరణించి తిరిగి మూడో దినమున లేచిన విధానాన్ని గుర్తు చేసుకుని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు ఆదివారం యేసు పునరుత్థాన పండుగను చేసుకుంటున్నారని రాజేంద్రనగర్ మన్నాఫుల్ గాస్పెల్ చర్చి పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్‌మోజెస్ తెలిపారు. యేసు పునరుత్థాన పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ మన్నా ఫుల్ గాస్పెల్ చర్చిలో జరిగిన ఆరాధనలో ఆయన పాల్గొని బైబిల్ సందేశాలను అందజేశారు. యేసయ్య ప్రజలందరికి విమోచకుడు అని గుర్తు చేశారు.

బుద్వేల్‌లో...

బుద్వేల్‌లోని క్రీస్తు కొండపై ఆదివారం యేసు పునరుత్థాన పండుగ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో మెథడిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ అశోక్ బైబిల్ సందేశాలను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న



బుద్వేల్‌లో జరిగిన యేసు పునరుత్థాన ఆరాధనలో చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి

చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ యేసు క్రీస్తు ప్రపంచ మానవాళికి ప్రేమను చూపాడని గుర్తు చేశారు.

వివిధ చర్చీలలో....

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వివిధ చర్చీలలో ఆదివారం క్రీస్తు పునరుత్థాన పండుగ ఆరాధనలు ఘనంగా జరిగాయి. బుద్వేల్ సాయి కృష్ణకాలనీ,



జీసస్ క్రైస్ట్ ప్రేయర్ మినిస్ట్రీస్‌లో పాటలు పాడుతున్న రెవరెండ్ జాన్‌వెస్లీ, సంఘ సభ్యులు

చింతల్‌మెట్‌లోని బెథెస్తా మిషన్ గాస్పెల్ చర్చ్‌లో రెవరెండ్ డాక్టర్ నతానియేల్, కోనేటి ప్రార్థన మందిరంలో రెవరెండ్ యేసుమణి, అత్తాపూర్ రాక్ చర్చిలో రెవరెండ్ సుందర్‌పాల్, ఉప్పర్‌పల్లి హోరేబు గాస్పెల్ చర్చిలో రెవరెండ్ స్వర్ణకుమార్‌తో పాటు అత్తాపూర్, హైదర్‌గూడ చర్చీలలో బ్రదర్ రాజ్‌కుమార్, పాస్టర్ పాల్మాకుల మధు, రెవరెండ్ జేపీ పాల్ ఆధ్వర్యంలో క్రీస్తు పునరుత్థాన ఆరాధనలు ఘనంగా జరిగాయి.

అంతరిక్ష పరిశోధనలో అద్భుత ప్రగతి

- చంద్రయాన్-3 కీలక శాస్త్రవేత్త జ్యోశ్యుల అచ్యుత కమలాకర్

హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ అద్భుత ప్రగతి సాధించిందని చంద్రయాన్-3 కీలక శాస్త్రవేత్త, భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ పూర్వ సంచాలకులు జ్యోశ్యుల అచ్యుత కమలాకర్ పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో స్వదేశీ పరిజ్ఞానం వినియోగించుకొని విజయవంతమైన ప్రయోగాలెన్నో ఉన్నాయన్నారు. ముఖ్యంగా 1962 నుంచి రాకెట్ ప్రయోగాల్లోనూ, 1980 నుంచి శాటిలైట్ లాంచింగ్‌తో దేశం ఆధునిక విశ్వ విజ్ఞాన శాస్త్ర రంగంలోనూ దూసుకుపోతున్నట్లు వివరించారు. తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆన్‌లైన్ వేదికగా 'మన ప్రాచీన భారతీయ సాహిత్యం-ఆధునిక విశ్వ విజ్ఞాన శాస్త్ర వికాసానికి మూలం' అంశంపై సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి జ్యోశ్యుల అచ్యుత కమలాకర్ భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ.. నేవిగేషన్, ఎర్త్ అబ్జర్వేషన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, టెలీ కమ్యూనికేషన్, స్పేస్ సైన్సెస్, ప్లానెటరీ ఎక్స్‌ప్లోరేషన్, హ్యూమన్ స్పేస్ ఫ్లైట్, స్పేస్ సైన్సెస్ తదితర విభాగాల్లోనూ విప్లవాత్మక మార్పులకు, అద్వితీయమైన ప్రయోగాలకు నాంది పలికామని వివరించారు. స్పేస్‌లో వ్యర్థాలు పెరిగాయని, 30 మీటర్ల గ్రహ శకలం ఒకటి పడినా ఒక నగరం ధ్వంసమయ్యే ప్రమాదం ఉందని చెప్పారు.

అలాంటి ప్రమాదాలకు తావు లేకుండా మన అంతరిక్ష పరిశోధనా సంస్థ ముందస్తు నివారణా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నిర్వాహకుడు తోటకూర ప్రసాద్, రచయితలు నాగసూరి వేణుగోపాల్, ప్రతాప్ కౌటిల్య, తదితరులు పాల్గొన్నారు.



జల్‌పల్లి సబ్‌స్టేషన్‌లో ఎక్కువ కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన విద్యుత్ అధికారులు

జల్‌పల్లి సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పహాడిషరీఫ్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలంలో ఉష్ణోగ్రతలను అధిగమించటానికి విద్యుత్ వినియోగదారులకు మెరుగైన నాణ్యమైన విద్యుత్ అందజేయడానికి జల్‌పల్లి సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ 12.5 (ఎంవీఏ) మార్చడం జరిగిందని రాజేంద్రనగర్ ఎస్‌ఈ గోపయ్య అన్నారు, జల్‌పల్లి సబ్ స్టేషన్‌లో 8000 (ఎంవీఏ) రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉండగా వేసవిలో అధిక లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని, 22500 (ఎంవీఏ) ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చమన్నారు, వేసవిలో అధిక విద్యుత్ వినియోగించిన ఎలాంటి సమస్యలు రావన్నారు. కార్యక్రమంలో డీఈ రాజా రామ్ రెడ్డి, ఏడీఈ, కేవీఎస్ రెడ్డి, పహాడిషరీఫ్ ఏఈ సత్యనారాయణ, మొహమ్మద్ ఆసిఫ్, ఆరిఫ్, చంద్రశేఖర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కాషాయ జెండా ఎగురవేస్తాం: మాధవీలత

అఫ్జల్‌గంజ్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో లోక్‌సభ స్థానంలో బీజేపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికునివలే పని చేసి హైదరాబాద్‌పైన బీజేపీ జెండా ఎగరవేయాలని హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత అన్నారు. ఆదివారం గోషామహల్ డివిజన్‌లో కార్పొరేటర్ లాల్ సింగ్ నివాసానికి మాధవీలత వెళ్లి గోషామహల్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి ప్రణాళికలు రూపొందించారు. ఈ సారి హైదరాబాద్‌ను పరిపాలిస్తున్న ఎంఐఎంను భూస్థాపితం చేసేందుకు హిందువులు ఏకతాటిపై వస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హాస్టల్ ఫీజు డబుల్

(3వ పేజీ తరువాయి)

రూ. 1.60 లక్షలకు పెరిగింది. మెయిన్స్‌కు గతంలో రూ.35 వేల నుంచి రూ.40 వేలు తీసుకోగా ప్రస్తుతం రూ.50 వేల నుంచి రూ.60 వేలు వరకు వసూలు చేస్తున్నారు. అలాగే గ్రూప్-2 రెండు నెలల శిక్షణకు గతంలో రూ.30 వేలు ఉండగా ఇప్పుడు రూ.35వేలు తీసుకుంటున్నారు. గతంలో టెట్ శిక్షణకు రూ.8 వేలు తీసుకోగా ప్రస్తుతం రూ.10 వేలు తీసుకుంటున్నారు. టీఆర్‌టీ కోచింగ్ ఫీజు గతంలో రూ.12 వేల నుంచి రూ.16వేల వరకు ఉండగా ప్రస్తుతం రూ.15 వేల నుంచి 20 వేల వరకు వసూలు చేస్తున్నారు. గత ఫీజులన్నీ మెటీరియల్‌తో కలిపి నిర్ణయించినవి కాగా, ప్రస్తుతం కొందరు స్టడీ మెటీరియల్‌తో కలిపి వసూలు చేస్తుండగా, మరికొన్ని సెంటర్ల నిర్వాహకులు మెటీరియల్‌కు వేరుగా వసూలు చేస్తున్నారు.

ఏసీ గదికి రూ.15 వేలు

అదే సమయంలో హాస్టళ్లలో నెలవారీ చార్జీలను అమాంతం రెట్టింపు చేశారు. దిల్‌సుఖ్‌నగర్, చిక్కడపల్లిలోని సాధారణ హాస్టళ్లలో గతంలో వసతితో పాటు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రివేళ భోజనానికి రూ.3,500 నుంచి రూ. 4,000 తీసుకున్నారు. ప్రస్తుతం ఆ ధర రూ.6 వేల నుంచి రూ.8వేలకు చేరింది. పైగా ఒక్కో గదిని నలుగురి నుంచి ఐదుగురికి కేటాయిస్తున్నారు.

అటాచ్డ్ బాత్‌రూమ్‌లుండీ ఇద్దరు లేదా ముగ్గురు ఉండే గదులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు లేదా ఆపైన.. ఏసీ ఉన్న గదులకైతే రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారు.

నాసిరకం భోజనంతో ఇబ్బందులు

అశోక్‌నగర్, చిక్కడపల్లి, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట్‌లోని హాస్టళ్లలో కొంతమంది నిర్వాహకులు దొడ్డు బియ్యం, నాసిరకం కూరగాయలతో భోజనం అందిస్తున్నారని అభ్యర్థులు వాపోతున్నారు. రోజువారీగా గదులను శుభ్రం చేయించడం లేదని, నిర్వహణ అస్సలు బాగాలేదని మండిపడుతున్నారు.

దీని వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని వాపోతున్నారు. ఇదేమిటని అడిగితే.. ఉంటే ఉండండి, లేకుంటే వెళ్లిపోండని కటువుగా చెబుతున్నారని అంటున్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు హాస్టళ్లను తనిఖీ చేయాలని, అప్పుడే హాస్టళ్ల పరిస్థితి మెరుగవుతుందని అంటున్నారు.

సౌకర్యాలు సరిగా లేవు

నేను దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో టీఆర్‌టీ కోచింగ్ తీసుకుంటున్నాను. రెండు వారాల క్రితం ఇక్కడికి వచ్చి హాస్టల్‌లో ఉంటున్నాను. నెలవారీ హాస్టల్ ఫీజు రూ.6 వేలు. ఫీజుకు తగినట్లుగా హాస్టల్‌లో సౌకర్యాలు సరిగా లేవు. గతేడాది జూన్‌లో గ్రూప్-2 కోసం వచ్చి ఇక్కడే హాస్టల్‌లో ఉన్నాను. అప్పుడు హాస్టల్ ఫీజు రూ.4వేలు ఉండేది. ఆరునెలల్లో రూ.2వేలు అదనంగా పెంచారు. కోచింగ్ తప్పనిసరి కావడంతో వసతులు సరిగా లేకున్నా నిర్వాహకులు అడిగినంత చెల్లించాల్సి వస్తున్నది.

- అనిల్, జగిత్యాల

ఫీజులను నియంత్రించాలి

నగరంలోని ప్రైవేట్ హాస్టళ్ల నిర్వాహకులు దోచుకుంటున్నారు. పోటీ పరీక్షలను అడ్డు పెట్టుకుని అభ్యర్థుల నుంచి కొంతమంది ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. డబ్బులు ఎక్కువ తీసుకుంటున్నా వసతులపై, భోజనం నాణ్యతపై దృష్టి పెట్టడం లేదు. జీహెచ్‌ఎంసీ అధికారులు హాస్టళ్లను తనిఖీ చేయాలి. ఫీజులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి.

- శ్యామ్, పీడీఎస్‌యూ గ్రేటర్ అధ్యక్షుడు

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/niOLugr లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయగలరు.

వాటర్‌వర్క్స్ లైన్‌మన్ పై దాడి

రాజేంద్రనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ సులేమాన్‌నగర్ డివిజన్ నౌ నంబర్ ప్రాంతంలో వాటర్‌వర్క్స్ విభాగంలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న జగదీశ్‌పై కొందరు ఆదివారం ఉదయం దాడి చేశారని, ఆ దాడికి కారకులైన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. దాడికి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు మీద మంచి నీటితో కడుగుతుంటే అలా నీటిని వృథా చేయవద్దన్నందుకు లైన్‌మన్‌పై దాడి చేశారని గుర్తు చేశారు. నీటిని వృథా చేస్తుంటే ఫొటో తీయడానికి వెళ్లగా ఫోన్ లాక్కొని దాడి చేశారని తెలిపారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయం జరగకపోతే రాజేంద్రనగర్ సర్కిల్, వాటర్ వర్క్స్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులందరితో కలిసి ఆందోళన చేస్తామని తెలిపారు.

మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో రోహన్‌ను గుర్తించిన పోలీసులు



రాజేంద్రనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవుపల్లి డివిజన్ బృందావన్ కాలనీకి చెందిన నీలం ప్రజాపత్, మోనో ప్రజాపత్‌ల కుమారుడు శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండ పోయిన ఆర్యన్ అలియాస్ రోహన్(10) మల్కాజిగిరి పోలీసులకు శనివారం రాత్రి కని పించాడు. మల్కాజిగిరి రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో రైల్వే పోలీసులు ఆ బాలున్ని చేరదీసి వివరాలు అడుగగా తాను మైలార్‌దేవుపల్లి బృందావన్‌కాలనీకి చెందిన నీలం ప్రజాపథ్, మోనో ప్రజాపత్‌ల కుమారుడినని తెలిపాడు. అతను ఇచ్చిన ఆధారాల ప్రకారం రైల్వే పోలీసులు ఆదివారం తెల్లవారు జామున మైలార్‌దేవుపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం కావడంతో సోమవారం ఉదయం బాలుణ్ని విచారణ అనంతరం తల్లిదండ్రులకు అప్పగించే అవకాశం ఉంది.

తాగిన మైకంలో గొడవ.. ఒకరికి గాయాలు



సయ్యద్ ముస్తాఫా అలీ

రాజేంద్రనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో స్నేహితుల మధ్య జరిగిన గొడవలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టోలిచౌకి ప్రాంతానికి చెందిన సయ్యద్ ముస్తాఫా అలీ(25), చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన అమాన్, అఫాన్‌లు స్నేహితులు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో వీరు ముగ్గురు చింతల్‌మెట్‌లో మద్యం తాగారు. ఆ సమయంలో వీరి మధ్య మాటా మాటా పెరిగింది. ఈ గొడవలో సయ్యద్ ముస్తాఫా అలీపై అమాన్, అఫాన్‌లు కత్తులతో దాడి చేశారు. దాడిలో సయ్యద్ ముస్తాఫా అలీ గాయపడ్డాడు. కేసు నమోదు చేసి అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదని యువకుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వడంలేదని ఓ యువకుడు శనివారం రాత్రి తన ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జహనుమా తీగెలకుంట ప్రాంతానికి చెందిన మగ్దూమ్ అహ్మద్ కొంతకాలం నుంచి ఉప్పర్‌పల్లి హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్నారు. అతని కుమారుడు ఇస్మాయిల్ అహ్మద్(24) తాగుడుకు బానిసయ్యాడు. రెండు రోజుల నుంచి తల్లిదండ్రులను తాగడానికి డబ్బులు అడుగుతున్నాడు. వారు లేవని చెప్పడంతో మనస్తాపం చెందిన ఇస్మాయిల్ అహ్మద్ శనివారం రాత్రి తాను పడుకునే గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు లేచి చూడగా కొడుకు ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇస్మాయిల్ అహ్మద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గొడవ పెట్టుకొని మెడలో గొలుసు లాక్కెళ్లారు

రాజేంద్రనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై ఉన్న ఓ మహిళ, కారు నడిపిస్తున్న వ్యక్తికి మధ్య జరిగిన గొడవలో ఐదు తులాల బంగారు గొలుసు పోయింది. రాజేంద్రనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్షాకోట్ నివాసి కన్నయ్యకు బండ్లగూడలో స్వీట్స్ దుకాణం ఉంది. ఆదివారం ఆయన తన కారులో ఉప్పర్‌పల్లి పిల్లర్ నెంబర్ 182 వద్ద కారు మలుపుతుండగా వెనుకాల నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ జంట అంత స్పీడ్‌గా కారు ఎందుకు నడిపిస్తున్నావ్ అని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో ద్విచక్ర వాహనంపై ఉన్న వారు కన్నయ్య కాలర్ పట్టుకున్నారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత తేరుకున్న కన్నయ్య తన మెడలో ఉండాల్సిన రెండు బంగారు గొలుసులలో ఒకటి తెగిపోయి లోపల బనియన్‌లో పడి ఉందని, మరో ఐదు తులాల బంగారు గొలుసు కనిపించలేదని రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంఘటన జరిగిన ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక హత్య కేసులో ఒకరు అరెస్ట్

రాజేంద్రనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బాలికను హత్య చేసిన కేసులో అత్తాపూర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ మోయిన్(31)ను మైలార్‌దేవుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సులేమాన్‌నగర్ ప్రాంతంలో తమ ఇంటి పక్కన ఉండే 13 సంవత్సరాల బాలికతో మోయిన్‌కు పరిచయం ఏర్పడింది. అనంతరం ఆ బాలికతో మోయిన్ అక్రమ సంబంధం ఏర్పరుచుకున్నాడు. ఇది తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు అతన్ని నుంచి దూరంగా వెళ్లిపోదామని తమ మకాంను జల్‌పల్లికి మార్చారు. అయినా మోయిన్ ఆ బాలికతో మాట్లాడుతు ఉండేవాడు. ఈ నెల 28న మోయిన్‌తో ఆ బాలిక కలిసి ఉంది. తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తీసుకువచ్చింది. అప్పటికే వివాహం అయి నలుగురు పిల్లలు ఉన్న మోయిన్ ఎలాగైన ఆ బాలికను అడ్డు తొలగించుకోవాలని గురువారం మైలార్‌దేవుపల్లి కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద ఆ బాలిక తలపై రాయితో మోది హత్య చేశాడు. కేసు నమోదు చేసిన మైలార్‌దేవుపల్లి పోలీసులు మోయిన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎన్టీపీసీ 'రెండో దశ'తో ఒప్పందానికి నో!

2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.. కరెంటు కొనుగోలుకు సర్కారు విముఖత

- విద్యుత్తు వచ్చేది 5-8 ఏళ్ల తర్వాతే!
- అప్పటికి రూ.8-9 మధ్య యూనిట్ ధర
- ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి గుదిబండే!



హైదరాబాద్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రెండో విడత తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు కొనుగోలు చేస్తే రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 2400 మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన ఈ విద్యుత్కేంద్రం నిర్మాణానికి ఐదు నుంచి ఎనిమిదేళ్లు పడుతుందని.. అప్పటికి ఇక్కడి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.8-9కి ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనాకు వచ్చింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తుండగా, భారీ ధరతో 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. త్వరగా ఒప్పందం చేసుకోకపోతే ఇతర రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుని విద్యుత్కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల అల్టిమేటం జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమీక్షించి, కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్తు కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పునర్విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో విడత కింద 2400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి విడత విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.5.90 ఉండగా, ఒప్పందం కారణంగా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే..!

పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుదిబండగా మారాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా 10 ఏళ్లపాటు జాప్యం చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి, తక్కువ ధరకు రాష్ట్రానికి కరెంటు వచ్చేదని చెబుతున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..


దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా పనులు సాగుతున్నాయి. జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్తు ధరలూ పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రూ.2-4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్తుపై దృష్టిపెట్టాలని నిర్ణయించింది.

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ స్టోర్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, బ్రాండ్‌లు రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉన్నాయో లేదో సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు, రికార్డుల్లో ఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల లెక్కలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో దాదాపు 5 గంటల పాటు రికార్డులను పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీ బిల్లును తనిఖీ చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎంఆర్‌పీ కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసర వచ్చారు. కాగా, విజిలెన్స్ అధికారుల ఇచ్చే నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.





పంట నష్టం పరిహారమేదీ?

ఏడాదిగా ఎదురుచూస్తున్న రైతన్నలు.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో 1,51,545 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్న గత ప్రభుత్వం
- నేటికీ అందని రెండో విడత పంట నష్టపరిహారం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతుల వేడుకోలు


జగిత్యాల జిల్లా మోరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

జనగామ/జగిత్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాలవర్షానికి నేలపాలయ్యాయి. వడగళ్ల వానలు, ఈదురుగాలులు పంటలను అతలాకుతలం చేశాయి. రైతన్న వేదనను చూసిన ప్రభుత్వం.. వారికి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ, ఏడాది కాలం గడిచిపోతున్నా.. ఇప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. ఇంకా వారికి ఎదురుచూపు తప్పలేదు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో వడగళ్ల దెబ్బకు గింజలన్నీ నేలరాలి రైతులకు కడగళ్లను మిగిల్చాయి. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను తెప్పించుకున్న నాటి ప్రభుత్వం.. నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పినా.. కేవలం మార్చి నెలకు సంబంధించిన పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే మార్చి నెలలో జరిగిన నష్టం కన్నా ఏప్రిల్‌లో రెట్టింపు నష్టం సంభవించింది. కానీ, ఏప్రిల్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని మాత్రం రైతులకు నేటికీ ఇవ్వలేదు. ఇందుకోసం రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆనాడు ప్రకటించినా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.28 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్న విషయాన్ని నాడు ఖమ్మం జిల్లాలో పంటల పరిశీలన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి 23న ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పంటనష్టం జరిగిన 26 జిల్లాల్లో వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి 1,51,545 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు. దీనికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో కేసీఆర్ సర్కారు ప్రకటించింది. మొత్తం 1,30,988 మంది రైతులు పరిహారానికి అర్హులుగా పేర్కొంది. అయితే మార్చి నెల పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా, జగిత్యాల జిల్లాలో గతేడాది మార్చి, ఏప్రిల్‌తోపాటు జూలైనూ కలిపి 73,686 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మార్చిలోనే 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కేవలం 532 ఎకరాలకే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో, జూలైలో భారీ వర్షాలకు 15,487 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా.. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. మొత్తంగా రెండో విడతకు సంబంధించి 20,160 మంది రైతులకు పరిహారం కింద రూ.36.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆర్థిక శాఖలో పెండింగ్..

రెండో విడత పంట నష్టం పరిహారానికి సంబంధించిన నిధులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో 2 విడతలకు సంబంధించి రూ.151.54 కోట్లు విడుదల చేయగా వాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదని అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ వస్తే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏడు ఎకరాల్లో పంట నష్టపోయాను



గతేడాది యాసంగిలో ఏడెకరాల్లో వరి పంట సాగు చేస్తే వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా పంటంతా నాశనమైంది. చేతికొచ్చిన గింజలన్నీ చేలోనే రాలిపోయి ఏమీ చేతికిరాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. కానీ, ఏడాది దాటుతున్నా ఒక్క పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం వద్దే పైసలు ఆగిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారాన్ని అందించాలి.

\- గొడ్డేటి రాజు, గానుగుపహాడ్, జనగామ జిల్లా

17 పార్లమెంటు స్థానాలకు కాంగ్రెస్ ఇన్‌చార్జిలు

- మంత్రులందరికీ బాధ్యతలు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలుపే లక్ష్యంగా మొత్తం 17 సెగ్మెంట్లకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలను నియమించింది. ఈమేరకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి సైతం గతంలో పార్లమెంటు సెగ్మెంట్ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించగా... తాజా ఉత్తర్వుల్లో మాత్రం వారిద్దరి పేర్లను మినహాయించారు. ఇద్దరూ స్టార్ క్యాంపెయినర్లుగా రాష్ట్రమంతా పర్యటించాల్సి ఉన్నందున ఇన్‌చార్జి బాధ్యతల నుంచి మినహాయించినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. మొత్తం పదిమంది మంత్రులకూ వారి సొంత జిల్లాలు లేదా ఇన్‌చార్జి మంత్రులుగా వ్యవహరిస్తున్న జిల్లాల్లోని పార్లమెంటు స్థానాల బాధ్యతలను అప్పగించారు. ఏప్రిల్ 6న తుక్కుగూడలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పాల్గొనే జన జాతర సభకు ముందే ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలు ఖమ్మం - పొంగులేటి శ్రీనివాస రెడ్డి, నల్లగొండ - ఉత్తమ్ కుమార్ రెడ్డి, కరీంనగర్- పొన్నం ప్రభాకర్, వరంగల్-రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పెద్దపల్లి-దుద్దిళ్ల శ్రీధర్‌బాబు,మహబూబాబాద్ - తుమ్మల నాగేశ్వరరావు, హైదరాబాద్ - ఒబేదుల్లా కొత్వాల్, సికింద్రాబాద్-కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి-కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ - జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్-ఎస్ఏ సంపత్‌కుమార్, చేవెళ్ల - వేం నరేందర్‌రెడ్డి, మల్కాజిగిరి-మైనంపల్లి హన్మంతరావు, మెదక్ - కొండా సురేఖ, నిజామాబాద్ - పి. సుదర్శన్‌రెడ్డి, ఆదిలాబాద్ - సీతక్క, జహీరాబాద్ - దామోదర రాజనర్సింహ.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

- సీఈసీ సమావేశంలో పాల్గొనేందుకు..

హైదరాబాద్/న్యూఢిల్లీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ లోక్‌సభ సీట్ల అభ్యర్థుల ఖరారుపై ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) నిర్వహించే భేటీలో పాల్గొననున్నారు. ఈ సమావేశం ముగిసిన వెంటనే 4 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశముంది. రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఈ భేటీలో పాల్గొంటారు. వాస్తవానికి ఆదివారమే సీఈసీ సమావేశం జరగాల్సి ఉంది. ఇందుకోసం రేవంత్, భట్టి అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. అయితే సోమవారానికి సమావేశం వాయిదా వేసినట్లు ఏఐసీసీ కొన్ని గంటల ముందే సమాచారం ఇచ్చింది. దీంతో రేవంత్ తన పర్యటనను వాయిదా వేసుకోగా.. భట్టి ఆదివారమే ఢిల్లీకి వెళ్లిపోయారు. ఇటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో బీఆర్ఎస్ ఎంపీ కె.కేశవరావు కూడా ఆదివారమే కాంగ్రెస్‌లో చేరాల్సి ఉంది. ఆయన చేరిక సైతం సోమవారానికి వాయిదా పడింది.

బెంగాల్‌లో తుఫాను బీభత్సం

- నలుగురి మృతి, 200 మందికి గాయాలు

కలకత్తా, మార్చి 31: పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ తుఫాను కారణంగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, హోర్డింగులు, కరెంటు స్తంభాలు నేల కూలాయి. పలు వాహనాలు తిరగబడ్డాయి. దాంతో నలుగురు మృతి చెందగా, 200 మందికి పైగా గాయపడ్డారు. మృతి చెందిన వారికి పశ్చిమ బెంగాల్ సీఎం మమత సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తగిన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని హామీ ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. బెంగాల్ వరదల్లో మరణించిన వారికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు.

జగన్ నిర్వాకంతో ఏపీ ఖజానా ఖాళీ

అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు: చంద్రబాబు



బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు తీసుకోకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బు లేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రోత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నమ్మించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో 52 అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో 49 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించారని.. కానీ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్లు ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. బటన్ నొక్కి ప్రజల సంక్షేమమని ప్రతిరోజూ చెబుతున్నాడని.. అలాగైతే మద్య నిషేధం, జాబ్ కేలెండర్, డీఎస్సీలపై ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని.. ఆర్టీసీ, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి జనం అల్లాడుతుంటే.. వాటిని తగ్గించే బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. 'సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 లాగేసుకుంటున్నాడు. బటన్ నొక్కి ఇచ్చింది ఎంత? ప్రజల నుంచి నొక్కింది ఎంత? అందులో మీరు బొక్కింది ఎంత' అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35 శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27 శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడేయడం ఖాయమని చంద్రబాబు అన్నారు. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు ఆద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశంతోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారు పడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పోతాయని రెచ్చగొడుతున్నారు" అని మండిపడ్డారు.



ఉత్తరాదిపై మజ్లిస్ గురి!

- యూపీ, బిహార్‌లో ఖరారైన పొత్తులు
- వ్యూహాత్మకంగా హిందువులకూ టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్ పాతనగరంలో.. ఎంసీహెచ్(ప్రస్తుతం జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పత్తర్‌గట్టీ డివిజన్ నుంచి విజయభేరీ మోగించిన మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) క్రమంగా జాతీయ పార్టీగా ఎదుగుతోంది. ఈ క్రమంలో బిహార్, యూపీల్లో ఓటుబ్యాంకును.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ ముందుకు పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమకు సిటింగ్ స్థానం ఉన్న మహారాష్ట్రతో పాటు.. యూపీ, బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించింది. "మేము బీజేపీకి వ్యతిరేకం. అలాగని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు కాదు. ఇండియా కూటమి కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం. మైనారిటీ, బడుగు వర్గాల అభ్యున్నతికి మేం పనిచేస్తాం" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో డాక్టర్ పల్లవి పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్(కామెరవాడి)తో కలిసి పోటీ చేస్తామని ఆదివారం ఆయన ప్రకటించారు. ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీతోనూ పొత్తు ఉంటుందని, బిహార్‌లోనూ ఎన్డీయే-ఇండియా కూటముల్లో లేని పార్టీలను కలుపుకొనిపోతున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఏడు, బిహార్‌లో 11 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఐదు చోట్ల హిందువులకు మజ్లిస్ టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఎంవీఏతో కలిసి పోటీ చేసిన మజ్లిస్.. ఈ సారి ఒంటరిగా వెళ్తోంది. తమ పార్టీ ఔరంగాబాద్ సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అదేస్థానంలో పోటీ చేయనుండగా.. మైనారిటీల బలం ఎక్కువగా ఉన్న మరో నాలుగు చోట్ల మజ్లిస్ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సమీకరణాలు అనుకూలంగా లేనందున పోటీ చేయడం లేదని మజ్లిస్ వర్గాలు తెలిపాయి.

కూటమి విజయం ఖాయం: పవన్

- వైసీపీ దోపిడీని అరికడితే అన్ని పథకాలకు నిధులు వస్తాయి
- పింఛన్లు అందేలా చూడండి.. 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు



పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనుభవజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామవళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 1 ఏప్రిల్ 2024

శ్రీశక్తి



సౌరశక్తికి బ్రాండ్ అంబాసిడర్

అమెరికాలో ఉన్నత చదువు... ప్రముఖ కంపెనీలో కొలువు... ఇవేవీ ఆమెకు సంతృప్తినివ్వలేదు. అందుకే మాతృభూమికి తిరిగివచ్చి... అంకుర సంస్థ ఒకటి నెలకొల్పారు. సౌర విద్యుత్‌ను కొత్త పుంతలు తొక్కించి... దానికి బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకువచ్చారు. దేశం నలుమూలలా సేవలు విస్తరించి... అనతి కాలంలోనే కంపెనీని వంద కోట్ల టర్నోవర్‌కు తీసుకువెళ్లారు. 'ఫ్రేయర్ ఎనర్జీ' రూఫ్‌టాప్ సోలార్ కంపెనీ సహవ్యవస్థాపకురాలు రాధిక చౌదరి విజయప్రస్థానం 'నవ్య'కు ప్రత్యేకం.

"జీరో కరెంట్ బిల్... ఈ లక్ష్యంతోనే మా 'ఫ్రేయర్ ఎనర్జీ' సోలార్ కంపెనీ పుట్టింది. కంపెనీ ప్రారంభించేనాటికి నాకు మూడేళ్ల బాబు ఉన్నాడు. మా కుటుంబ స్నేహితుడు సౌరబ్ మర్దా, నేను కలిసి 2014లో దీన్ని నెలకొల్పాం. ఇళ్లకు, చిన్నపాటి వ్యాపార సంస్థలు, పరిశ్రమలకు సోలార్ పవర్ సిస్టమ్స్ అమర్చే కంపెనీ మాది. ఒక్కసారి పెట్టుబడి పెడితే సరిపోతుంది. మేం అందించే సోలార్ ప్యానల్స్ జీవిత కాలం... పాతికేళ్లు. ఈ మధ్యలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా మేమే పరిష్కరిస్తాం. దాని కోసం ఒక యాప్‌ను తెచ్చాం. ఎంత విద్యుత్‌చ్ఛక్తి ఉత్పత్తి అయింది, ఎంత ఖర్చయింది తదితర వివరాలన్నీ ఆ యాప్‌లోనే చూసుకోవచ్చు. ఒకవేళ ఉత్పత్తి తగ్గితే దానికి గల కారణాలు ఏంటనేది కనుగొని చెబుతాం. వినియోగదారులకు ఒకేసారి భారం కాకుండా ఫైనాన్స్ సదుపాయం కూడా కల్పిస్తున్నాం. మొత్తం పెట్టుబడిలో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తోంది.

అమెరికా నుంచి వచ్చాక...

సోలార్ కంపెనీ ఒకటి పెట్టాలన్న ఆలోచన నాకైతే లేదు. నేను పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తయ్యాక 2004లో అమెరికా వెళ్లాను. అక్కడి 'పర్‌డ్యూ యూనివర్సిటీ'లో న్యూక్లియర్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చదివాను. 'జనరల్ ఎలక్ట్రికల్స్'లో ఆరు నెలలు ఇంటర్న్‌షిప్ తరువాత 'ఎస్‌కేఎఫ్ యూఎస్ఏ ఇంక్‌'లో విండ్ ఎనర్జీకి సంబంధించి అప్లికేషన్ ఇంజనీర్‌గా రెండేళ్లకు పైగా పని చేశాను. అయితే ఎందుకో అమెరికాలో ఉద్యోగం నాకు సంతృప్తినివ్వలేదు. దాంతో 2008లో భారత్‌కు వచ్చేశాను. ఇక్కడి 'ల్యాంకో విండ్ పవర్'లో ఏజీఎంగా కొత్త ఉద్యోగం మొదలుపెట్టాను. అక్కడి నుంచి 'ల్యాంకో సోలార్ ప్రైవేట్ లిమిటెడ్'లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా, తరువాత మరో రెండు కంపెనీల్లో వివిధ హోదాల్లో పని చేశాను.



అవగాహన అవసరం...

మహిళలు ఎవరైనా సరే వ్యాపార రంగంలోకి రావాలంటే ముఖ్యంగా కావల్సింది అన్ని విషయాలపై అవగాహన. అదే ఉద్యోగం అయితే... కోడింగ్ అనో, టెస్టింట్ టూల్స్ అనో సంబంధిత సబ్జెక్ట్‌పై పట్టు ఉంటే సరిపోతుంది. కానీ బిజినెస్‌లో అలా కుదరదు. సమర్థవంతమైన టీమ్‌ను పెట్టుకోవాలి. అకౌంట్స్, ఫైనాన్స్ ఫండ్ రైజింగ్, లీగల్, కాంట్రాక్ట్ తదితర అంశాలపై కనీస అవగాహన ఉండాలి. అందరినీ కలుపుకొని పోయే తత్వం కావాలి. అలాంటివారే ముందుకు వెళ్లగలుగుతారు.

అలా మొదలైంది...

వ్యాపారం ఒకటి ప్రారంభించాలన్న ఆలోచన సౌరబ్‌ది. ఆయన అమెరికాలో చదువుకొని తిరిగి వచ్చాక... సోలార్ ఎనర్జీకి సంబంధించి నాకున్న అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని అటు వైపు ఆలోచించమన్నారు. నాకు కూడా ఆ రంగంలో మంచి అనుభవం, నెట్‌వర్క్, రిలేషన్‌షిప్స్ ఉండడంతో ఓకే అన్నాను. రాబోయే రోజుల్లో ఈ రంగానికి భారత్‌లో మంచి భవిష్యత్తు ఉందనిపించింది. ఎందుకంటే పదేళ్ల కిందట మా కంపెనీ ప్రారంభించే నాటికి సౌర విద్యుత్ రంగంలో అభివృద్ధి చాలా పరిమితం. అదీకాకుండా ఫలానా కంపెనీ నంబర్ వన్ అనేది లేదు. ఏ ప్రాంతంలోని వ్యాపారులు ఆ ప్రాంతానికే పరిమితమయ్యేవారు. ఉదాహరణకు వరంగల్‌లోనివారు హైదరాబాద్‌లో ఇన్‌స్టాల్ చేసేవారు కాదు. అలాగే హైదరాబాద్‌వారు మరో నగరానికి వెళ్లరు. సోలార్ ఎనర్జీకి సంబంధించి ఒక బ్రాండ్ అంటూ లేదు. ఎక్కడివాళ్లు అక్కడే ఉండేవారు. ఇవన్నీ బేరీజు వేసుకొని... కంపెనీ ప్రారంభించాం. ఏకరూపత తీసుకువచ్చాం. అంటే హైదరాబాద్‌లో వినియోగదారుడు మా ద్వారా ఎలాంటి సేవలు పొందుతారో... ఈశాన్య రాష్ట్రాల్లోనివారికి కూడా అంతే నాణ్యమైన, కచ్చితమైన సేవలు అందుతాయి. అదే సమయంలో ధర అందుబాటులో ఉండేలా చూసుకొంటున్నాం.

కోటి నుంచి వంద కోట్లకు...

భారత్‌లో సోలార్ ప్యానల్స్ తయారు చేసే మంచి కంపెనీలు చాలా ఉన్నాయి. మాకు ఎలా కావాలో చెప్పి తయారు చేయించుకొంటాం. ప్రధానంగా మాది ఇంజనీరింగ్, డిజైనింగ్, ప్రొక్యూర్‌మెంట్, ఇన్‌స్టాలేషన్, సర్వీస్. వారంటీ సర్టిఫికెట్‌తో సహా అన్నీ పక్కాగా ఉంటాయి మా దగ్గర. అందుకే ఇవాళ భారత్‌లోనే నంబర్ వన్ కంపెనీగా నిలవగలిగాం. కోటి రూపాయలు బ్యాంకు రుణంతో మొదలుపెట్టిన మా కంపెనీ టర్నోవర్ నేడు దాదాపు వందట కోట్లకు చేరిందంటే కారణం... మాపై వినియోగదారులకు ఉన్న నమ్మకం.

ఎలా పని చేస్తుందంటే...

ఇంటిపైన సోలార్ ప్యానల్స్ బిగిస్తాం. వాటిపై నీడ పడకూడదు. దీని నుంచి వెలువడే డీసీ పవర్ ఇంటికి ఉపయోగించే ఏసీ పవర్‌గా మారుతుంది. లైట్ల నుంచి ఏసీల వరకు అన్నిటికీ ఉపయోగించుకోవచ్చు. ఒకవేళ మన అవసరానికి మించి విద్యుత్ ఉత్పత్తి అయితే, మిగిలింది గ్రిడ్‌కు వెళుతుంది. అప్పుడు ప్రభుత్వం ఫలానా ఇంటి నుంచి ఇన్ని యూనిట్లు వచ్చాయని లెక్క కడుతుంది. ఉదాహరణకు ఒక విల్లాకు కరెంటు బిల్లు నెలకు మూడు వేలు వస్తుందనుకోండి. అలా ఏడాదికి 36 వేలు. దీన్ని జీరో బిల్ చేసుకోవాలంటే 3కేవీ సోలార్ సిస్టమ్ పెట్టుకోవాలి. దానికి అయ్యే పెట్టుబడి రెండున్నర లక్షలు. ఎక్విప్‌మెంట్, ఇన్‌స్టాలేషన్ కలిపి. ప్రభుత్వం నుంచి 78 వేలు సబ్సిడీ నేరుగా వినియోగదారుడి ఖాతాలో జమ అవుతుంది. నాలుగేళ్లలో పెట్టింది వెనక్కి వచ్చేస్తుంది. అపార్ట్‌మెంట్లలో కామన్ ఏరియాలో ఉపయోగించే మోటార్లు, లైట్లు, పంపులకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే వ్యక్తిగతంగా ఫ్లాట్లలో అమర్చుకొనే సౌకర్యం ఇంకా మన దేశంలో అందుబాటులోకి రాలేదు. కానీ ఇతర దేశాలతో పోల్చితే సౌర విద్యుత్ రంగం భారత్‌లోనే అభివృద్ధి దిశగా సాగుతోంది.

అంత సులువు కాదు...

మా ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లోనే ఉంది. దేశంలోని 26 రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్నాం. ప్రస్తుతం మా సంస్థలో మూడొందల మంది పని చేస్తున్నారు. వారిలో ముప్పై శాతం మహిళలు. ఒక అంకుర సంస్థగా ప్రారంభమైన మా ప్రయాణం ఇవాళ ఇంతమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిందంటే ఎంతో సంతోషంగా ఉంది. పారిశ్రామికవేత్తగా రాణించాలంటే నిత్యం ఎన్నో సవాళ్లు, ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా ఒక మహిళగా ప్రత్యేకమైన సమస్యలు ఉంటాయి. నాకు ఇద్దరు పిల్లలు. అన్నీ బాగున్న రోజు ఇబ్బందేమీ అనిపించదు. కానీ ఇల్లు, పిల్లలు, వ్యాపారం... అన్ని బాధ్యతలనూ సమర్థవంతంగా నిర్వర్తించడం అంత సులువు కాదు. అందుకు కుటుంబ సహకారం తప్పనిసరి. నేను అమెరికా నుంచి తిరిగి రావాడానికి అది కూడా ఒక కారణం... ఇక్కడైతే మా కుటుంబం మద్దతు ఉంటుందని. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని. అందరికీ ఆ అవకాశం ఉండదు. అలాగే ఒక బిజినెస్‌లో ప్రధానంగా వచ్చే సమస్య... భాగస్వాముల మధ్య, ఉద్యోగుల మధ్య విబేధాలు. మార్కెట్‌లో ఒక ఉత్పత్తి అమ్మాలంటే ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. కొన్నిసార్లు మన ఆలోచన, అన్నీ బాగుంటాయి. కానీ మార్కెటింగ్ పరంగా ఆశించిన ఫలితాలు రావు. అన్నిటికంటే పెద్ద సమస్య... వినియోగదారులను ఎలా ఆకట్టుకోవాలి అనేది. కొన్నిసార్లు ఏ ప్రాజెక్ట్‌ను చేపట్టాలి? పెద్దదా? చిన్నదా? అనేదానిపై సరైన అవగాహన లేకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి. అయితే మొదటి నుంచీ సౌరబ్‌కు... నాకు మధ్య మంచి అవగాహన ఉంది. అందువల్లే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోగలుగుతున్నాం. ముఖ్యంగా సరైన టీమ్‌ను నిర్మించుకోవడానికి మాకు చాలా సమయం పట్టింది. ప్రస్తుతం మా కంపెనీకి సంబంధించి మార్కెటింగ్ స్ట్రేటజీస్, యాప్ డెవలప్‌మెంట్ నేను చూసుకొంటున్నా. ఫైనాన్స్ ఆపరేషన్స్, సేల్స్ బాధ్యతలు సౌరబ్ తీసుకున్నారు. ఈ రంగంలో నా కృషికి గానూ పలు అవార్డులు కూడా అందుకున్నాను. మేం సౌర విద్యుత్‌పై అపార్ట్‌మెంట్లలో స్టాల్స్ లాంటివి పెట్టి అవగాహన కల్పిస్తున్నాం. స్కూల్స్‌లో పిల్లలకు అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నాం. సోలార్ ఎనర్జీ వల్ల పర్యావరణానికి కలిగే ప్రయోజనాన్ని వివరిస్తున్నాం."

● హనుమా



ఫ్యాషన్ ఐకాన్...

మోడలింగ్, నటన... ఇవి ఆమె కలలు. "కానీ కట్టుబాట్లు, అందానికి సమాజం ఇచ్చే పడికట్టు నిర్వచనాలు ఆ లక్ష్య సాధన మార్గంలో అవరోధాలు. అయితే దేనికీ భయపడకపోవడమే నా బలం" అంటూ ముందుకు సాగింది ఆంజెల్ మరీనా టిర్కీ. జార్ఖండ్‌లోని ఒక చిన్న పట్టణంలో మొదలై... 'ఫ్యాషన్ ఐకాన్'గా ప్రశంసలందుకుంటూ... 'క్వీన్ ఆఫ్ ఇంటర్నేషనల్ టూరిజం టైటిల్' గెలిచిన ఆమెది స్ఫూర్తివంతమైన ప్రయాణం.

"నమ్‌కుమ్... జార్ఖండ్ రాజధాని రాంచీకి సమీపంలో ఉన్న పట్టణం. నిశ్శబ్దంగా ఉండే ఆ పట్టణంలో... గిరిజన సంప్రదాయాలు ప్రజల దైనందిన జీవనంతో గాఢంగా పెనవేసుకొని ఉంటాయి. ఓరాన్ గిరిజన కుటుంబంలో పుట్టిన నేను కఠినమైన కట్టుబాట్ల మధ్య పెరిగాను. అలాంటి పరిస్థితుల్లో ఒక అమ్మాయి మోడలింగ్ రంగంలోకి, వినోద పరిశ్రమలోకి వెళ్లాలనుకోవడం సాహసమే. కానీ అదే నా గమ్యమని నేను హైస్కూల్లో ఉన్నప్పుడే నిర్ణయించుకున్నాను. ఆ సంగతి ఎవరికీ చెప్పలేదు... నవ్వుతారని, ఎగతాళి చేస్తారని భయం. ఒక్కోసారి 'నేను అసాధ్యమైన కల కంటున్నానా' అని కూడా అనిపించేది. అయితే... రాంచీలోని సెయింట్ జేవియర్స్ కాలేజీలో... గ్రాడ్యుయేషన్ కోసం చేరడంతో నాకు కొత్త ద్వారాలు తెరుచుకున్నట్టయింది. అప్పటివరకూ కట్టుబాట్ల చిన్న ప్రపంచంలో ఉన్న నా పరిధి విస్తృతమయింది. అందరినీ అక్కున చేర్చుకొనే కాలేజీ వాతావరణం, తోటి విద్యార్థులు, లెక్చరర్ల వైఖరిని చూసి నా అభిప్రాయాలెన్నిటినో మార్చుకున్నాను.

ఆత్మన్యూనతను గెలిచి...

అందానికి సమాజం ఇచ్చే సాధారణ నిర్వచనంలో నేను ఇమడననేది అప్పట్లో నా నమ్మకం. రంగు తక్కువగా ఉన్నాననీ, గిరిజన కుటుంబానికి చెందినదాన్ననీ నాకు న్యూనతలు ఉండేవి. 'నా ఆశయం నెరవేర్చుకోగలనా?' అనే అనుమానం కలిగేది. కానీ క్రమంగా అర్థం లేని సామాజిక నిబంధనలను పట్టించుకోకుండా... నా ఆదివాసీ మూలాల్లోని ప్రత్యేకతను స్వీకరించే శక్తిని సంపాదించాను. అయితే అది అంత సులభంగా జరగలేదు. నేను మోడల్‌ను, నటిని కావాలని ఎవరితోనైనా మాటవరసకు చెప్పినా అదోలా వింతగా చూసేవారు. అనేక సందర్భాల్లో అవమానాలూ పడ్డాను. ఆదివాసీ లక్షణాలను అందానికి ప్రమాణాలుగా పరిగణించని ప్రపంచంలో... విజయం తాలూకు అర్థాన్ని పునర్నిర్వచించడం తేలిక కాదని నాకు తెలుసు. నా ప్రతిభను రుజువు చేసుకోవడానికి... కాలేజీలో ఏ కార్యక్రమం జరిగినా ఉత్సాహంగా పాల్గొనేదాన్ని. క్రమంగా ఆత్మన్యూనత దూరమయింది. అందాల పోటీలకు సిద్ధమయ్యాను. ఈ సంగతి తెలిసి మా కమ్యూనిటీవాళ్ళు అభ్యంతరం తెలిపారు. సంప్రదాయాల్ని ధిక్కరిస్తోందనీ, అదుపులో ఉంచాలనీ మా అమ్మనూ, నాన్ననూ హెచ్చరించారు. కానీ నేను ఊహించిని స్థాయిలో నా కుటుంబం నుంచి నాకు మద్దతు లభించింది. వారి సహకారం నేను మరింత పట్టుదలగా నా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి దోహదపడింది.



ఆ ప్రశంస మరచిపోలేను...

2019లో 'నార్త్ ఈస్ట్ ఐకాన్- సీజన్6'లో టైటిల్ గెలుచుకోవడం నా జీవితంలో పెద్ద మలుపు. అది కేవలం నా వ్యక్తిగత విజయం మాత్రమే కాదు... నా కలలను పరిమితం చెయ్యడానికి ప్రయత్నించిన అనేక పక్షపాతాల మీద విజయం. ఇది నా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. సమాజం అందాన్ని చూసే విధానంలో మార్పు వస్తోందనే వాస్తవాన్ని స్పష్టం చేసింది. ఆ మార్పుకు నేనొక చిహ్నంగా మారాను. "మూస పద్ధతులను సవాల్ చేస్తూ... అందానికి మరింత సమగ్రమైన నిర్వచనానికి మార్గం సుగమం చేశావు" అంటూ న్యాయనిర్ణేతల్లో ఒకరు ఇచ్చిన ప్రశంసను నేను ఎప్పటికీ మరచిపోలేను. ఆ తరువాత దేశ, విదేశాల్లోని ఈవెంట్స్‌లో మోడల్‌గా నిలిచి... నా కలలో మొదటి భాగాన్ని నెరవేర్చుకున్నాను. 2020లో 'మిస్ ఇండియా యునైటెడ్ నేషన్స్' ఫైనలిస్ట్‌తో సహా పలు టైటిల్స్ గెలిచాను. 'ఫ్యాషన్ ఐకాన్'గా గుర్తింపు పొందాను. ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో ప్రతిష్ఠాత్మకమైన 'క్వీన్ ఆఫ్ ఇంటర్నేషనల్ టూరిజం-2023' టైటిల్ విజేతగా అంతర్జాతీయ వేదికపై నిలబడినప్పుడు... నా గతాన్ని గుర్తు చేసుకున్నాను. నా కథలో ప్రధానాంశం ఫ్యాషన్, వినోద పరిశ్రమలో ప్రవేశించడం గురించి మాత్రమే కాదు... అడ్డంకులను దాటడం, సామాజిక అంచనాలను ధిక్కరించడం, అందాన్ని పునర్నిర్వచించడం, లక్ష్యాన్ని సాధించడానికి ధైర్యంగా ముందుకు సాగడం... లాంటి ఎన్నో అంశాలు అందులో ఉన్నాయి. అందుకే... 'మరింతమంది గిరిజన, సామాన్య కుటుంబాలకు చెందిన వారిని కలలు కనేలా, వాటిని నెరవేర్చుకొనేలా ప్రేరేపించడం నా బాధ్యత' అని గ్రహించాను. దానికోసం బాలికలకు ఒక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాను. మరోవైపు పేదల కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నాను. నా లక్ష్యంలో రెండో భాగం... వినోద పరిశ్రమలో పేరు తెచ్చుకోవడం. ఇప్పుడు ఆ దిశగా అడుగులు వేస్తున్నాను."

నవ్య | చిత్రజ్యోతి



ట్రెండీ లుక్‌లో

'భీష్మ' చిత్రం లాంటి భారీ విజయం తర్వాత నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కలయికలో వస్తున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. శనివారం నితిన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో తన పాత్రలోని విభిన్న షేడ్స్‌ను చూపిస్తూనే, ట్రెండీ లుక్‌లో నితిన్ ఆకట్టుకున్నారు. రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిశోర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

నితిన్ 'తమ్ముడు'

డైరెక్టర్ వేణు శ్రీరామ్ దర్శకత్వంలో నితిన్ నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. శనివారం టైటిల్ లోగో, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసి, ఈ చిత్రానికి 'తమ్ముడు' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. 'దిల్', 'శ్రీనివాస కల్యాణం' చిత్రాల తర్వాత నితిన్ సినిమాను దిల్ రాజు మూడోసారి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

నానితో మళ్లీ దసరా టీమ్



పీరియాడిక్ లవ్, మాస్ యాక్షన్ డ్రామాగా రూపొందిన 'దసరా' చిత్రం ఘన విజయం సాధించిన సంగతి విదితమే. హీరో నానికి ఎంతో పేరు తెచ్చిన సినిమా ఇది. ఇప్పుడు 'దసరా' టీమ్.. నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కొత్త సినిమా కోసం మళ్లీ చేతులు కలిపింది. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. నానిని మరో పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ప్రజెంట్ చేయడానికి దర్శకుడు శ్రీకాంత్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. భారీ బడ్జెట్‌తో సుధాకర్ చెరుకూరి నిర్మించే ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదలవుతుంది.


వేసవిలో అలరించే భరతనాట్యం



సూర్య తేజ ఏలే కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'భరత నాట్యం'. 'దొరసాని' ఫేమ్ కేవీఆర్ మహేంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. పాయల్ సరాఫ్ నిర్మించారు. మీనాక్షి గోస్వామి కథానాయిక. ఏప్రిల్ 5న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆనంద్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'కేవీ మహేంద్రగారి 'దొరసాని' చిత్రం మా అందరికీ మంచి పేరు తెచ్చింది. ఇప్పుడు ఈ 'భరతనాట్యం' చిత్రం సూర్యతేజతో పాటు యూనిట్‌కు గొప్ప గుర్తింపు తెస్తుంది' అన్నారు. కేవీఆర్ మహేంద్ర మాట్లాడుతూ "'దొరసాని' విజయం పునరావృతమౌతుంది. సినిమా ఆద్యంతం కడుపుబ్బా నవ్వించేలా ఉంటుంది. 'భరతనాట్యం' ఈ వేసవిలో ప్రేక్షకులను అలరిస్తుంది' అని చెప్పారు. నిర్మాతలు ఖర్చుకు వెనుకాడకుండా క్వాలిటీతో సినిమాను నిర్మించారని సూర్య తేజ తెలిపారు.

నిజం తెలియాలంటే చూడండి

- యూట్యూబ్‌లో సెన్సేషన్‌గా వైఎస్ వివేకానందరెడ్డి బయోపిక్ - 'వివేకం'
- స్ట్రీమింగ్ అయిన తొలిరోజే పది లక్షల వ్యూస్



అగ్రతారలు లేరు, దర్శకుడి పేరు కూడా తెలియదు, ప్రచారం కోసం పైసా ఖర్చు లేదు... అయితేనేం ఆ సినిమా ఏకంగా అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తోంది. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సోషల్ మీడియాతో పాటు సామాన్య జనాల చర్చల్లో భాగమైన ఆ చిత్రం మాజీ ఎంపీ దివంగత వైఎస్ వివేకానంద రెడ్డి బయోపిక్ - 'వివేకం'. యూట్యూబ్‌లో ఈ చిత్రం సన్సేషన్ సృష్టిస్తోంది. స్ట్రీమింగ్ మొదలైన తొలి రోజే పది లక్షలకు పైగా వ్యూస్ సాధించి అగ్రహీరోల చిత్రాలను సైతం వెనక్కి నెట్టింది. మరోవైపు సోషల్ మీడియాలోనూ నెటిజన్లు 'వివేకం' సినిమాలోని సీన్లను వైరల్ చేస్తున్నారు. మేధావులనే కాదు సామాన్య జనాలను సైతం ఈ సినిమా ఇంతలా ఆకర్షించడం సినీ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తోంది.

ఏపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించి ఓటీటీ విడుదలను అడ్డుకోవడంతో మేకర్స్ యూట్యూబ్‌లో స్ట్రీమింగ్ చేశారు. అక్కడా లక్షల్లో వ్యూస్‌ను దక్కించుకుంటూ దూసుకుపోతోంది. యూట్యూబ్‌తో పాటు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వివేకా బయోపిక్.కామ్ అనే వెబ్‌సైట్‌లోనూ ఈ చిత్రాన్ని లైవ్ స్ట్రీమింగ్‌కు ఉంచారు. పే పర్ వ్యూ పద్ధతిలో వీక్షించవచ్చు. రోజు రోజుకూ ఈ చిత్రాన్ని చూసే వారి సంఖ్య భారీగా పెరుగుతుండడం, ఇది ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి లాభించేలా ఉండడంతో వైఎస్సార్ సీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ప్రభుత్వం ఈ సినిమా కంటెంట్‌ను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నా నెటిజన్లు పైరసీ లింకుల ద్వారా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో వీక్షకులకు అందుబాటులో ఉంచుతున్నారు.

రామ్‌గోపాల్ వర్మ రాజకీయ ప్రేరేపిత సినిమాలు 'వ్యూహం, శపథం' లాంటి సినిమాలు సైతం తుస్సుమన్న తరుణంలో 'వివేకం' ప్రజలను ఇంతలా కదిలించడానికి సినిమాను తెరకెక్కించిన తీరే కారణం అని చెప్పాలి. ఇది వైఎస్ వివేకానందరెడ్డి హత్య చుట్టూ అల్లుకున్న కథ అని మేకర్స్ సినిమా ప్రారంభంలోనే కుండబద్దలు కొట్టారు. వివేకానందరెడ్డి హత్యకేసులో సీబీఐ తన చార్జిషీట్‌లో పొందుపొరచిన అంశాలే కథకు ఆధారమని తెలిపారు. ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతీరెడ్డి, తల్లి విజయమ్మ, సోదరి సునీతారెడ్డి, అవినాష్‌రెడ్డి సహా ఇతర పాత్రల పేర్లను కూడా నేరుగానే వాడేశారు. ఆ పాత్రలు పోషించిన నటీనటుల రూపురేఖలు, వారి హావభావాలు సైతం అచ్చు గుద్దినట్లు దించడం ప్రేక్షకులను మెప్పించింది. 'హూ కిల్డ్ బాబాయ్' అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ సినిమాలో వివేకా హత్యలో పాత్రధారులు, సూత్రధారులతో పాటు పథక రచన నుంచి అమలు వరకూ ప్రతి పాయింట్‌ను సాధికారికంగా చూపించిన తీరు బాగుందని నెటిజన్లు దర్శకుణ్ణి ప్రశంసిస్తున్నారు. 'దస్తగిరి కదిరికి పోయినాడు... గొడ్డలి తీసుకొస్తున్నాడు' లాంటి డైలాగ్‌లు జనం నోళ్లలో నానుతున్నాయి. 'నిజం తెలియాలంటే చూడండి' అంటూ నెటిజన్లు 'వివేకం' సినిమా లింకులను షేర్ చేస్తున్నారు. 'ప్రతి ఒక్కరూ వివేకంతో ఆలోచించి 'వివేకం' చిత్రం చూడాలని ప్రజలను కోరుతున్నారు. దీంతో ఈ సినిమా ఆంధ్రప్రదేశ్ ఎన్నికల మీద ప్రభావం చూపే అవకాశముందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. రామ్‌గోపాల్ వర్మ లాంటి వాళ్లు ఈ సినిమా టేకింగ్‌ను చూసి నేర్చుకోవాలని నెటిజన్లు ఓ సలహా పడేస్తున్నారు.

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం



కన్ను అంతర్భాగాలు

కన్ను గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఆప్తాల్మాలజీ అంటారు. కన్ను దృష్టికి సంబంధించిన జ్ఞానాంగం. పుర్రెలోని నేత్రగుళికలో కన్ను ఇమిడి ఉంటుంది. కన్నులో నేత్రగోళం, అనుబంధ నిర్మాణాలు(కనురెప్పలు, కంటి పక్ష్మాలు, కనుబొమ్మలు, అశ్రు పరికరం, వెలుపలి కండరాలు) ఉంటాయి. అశ్రు పరికరంలోని నిర్మాణాలు, కన్నీటిని ఉత్పత్తి చేస్తుంది. కన్నీటిలో లవణాలు, శ్లేష్మం, సూక్ష్మ జీవనాశక ఎంజైమ్ లైసోజోమ్ ఉంటాయి. నేత్రగుళికలో నేత్రగోళం కదలిక ఆరు కండరాల సహాయంతో జరుగుతుంది.

నేత్రగోళపు పొరలు

నేత్రగోళ కుడ్యంలో మూడు పొరలు ఉంటాయి. అవి ఒకదాని వెనక ఒకటి ఉంటాయి. అవి- 1) తంతు పటలం 2) ప్రసరణ పటలం 3) రెటీనా

తంతు పటలం: ఇది నేత్రగోళం వెలుపలి పొర. దీని పూర్వాంతంలో కార్నియా, పరాంతంలో దృఢస్తరం(స్క్లీరా) ఉంటాయి. కార్నియా రక్తనాళరహిత పారదర్శక పొర, ఇది స్థిరకటకంగా ఉండి ఐరిస్‌ను కప్పుతుంది. కార్నియాను ఆవరించి కంజెక్టివా ఉంటుంది. నేత్రదాన ప్రక్రియలో కార్నియాను మాత్రమే సేకరిస్తారు. మృతిచెందిన వ్యక్తి నుంచి నేత్రాలను ఆరుగంటల లోపు తీసుకోవాల్సి ఉంటుంది. స్క్లీరా అనేది కంటిలోని తెల్లని భాగం. ఇది అంతర్ భాగాలకు రక్షణనిస్తుంది.

ప్రసరణ పటలం: దీనిని యూవియా అని కూడా పిలుస్తారు. ఇది నేత్రగోళం మధ్యపొర. దీనిలో మూడు భాగాలుంటాయి. అవి- ఎ) కొరాయిడ్ బి) సిలియరి బాడీ సి) ఐరిస్. కొరాయిడ్ అనేది విరివిగా రక్తనాళాలతో కూడి నీలివర్ణంలో ఉంటుంది. సిలియరిబాడీలోని నునుపు కండరాలు కంటి కటకాన్ని నిర్దిష్టస్థానంలో ఉంచడానికి, కటకం ఆకారాన్ని హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టికి అనుకూలంగా మార్చడానికి ఉపయోగపడతాయి. ఐరిస్ అనేది నేత్రగోళంలోని వర్ణక ప్రాంతం. ఇది కార్నియాకు కటకానికి మధ్య సస్పెండెడ్‌గా ఉంటుంది. ఐరిస్ మధ్యలో కనుపాప ఉంటుంది. ఇది కెమెరాలోని డయాఫ్రమ్‌లా పనిచేస్తుంది. రాత్రిపూట సంచరించే నిశాచర జీవుల్లో ఐరిస్ పైన పడిన కాంతి పరావర్తనం చెందడం వల్ల వాటి కళ్లు మెరుస్తాయి.

రెటీనా: ఇది నేత్రగోళంలోని లోపలిపొర. దీనిలో పిగ్మెంటెడ్ ఎపిథీలియం, నాడీ ప్రాంతం అనే రెండు భాగాలుంటాయి. పిగ్మెంటెడ్ ఎపిథీలియం అనేది ఒక మెలనిన్ ఆచ్ఛాదం. నాడీ ప్రాంతంలో ఫోటోరిసెప్టార్ లేయర్, బైపోలార్ సెల్ లేయర్, గాంగ్లియాన్ సెల్ లేయర్ అనే మూడు పొరలుంటాయి. ఫోటోరిసెప్టార్ లేయర్‌లో రాడ్స్, కోన్స్ అనే రెండురకాల కాంతి గ్రాహకాలు ఉంటాయి. రాడ్స్, కోన్స్ మధ్య నిష్పత్తి 15:1. రాడ్స్ అనేవి రొడాప్సిన్ అనే వర్ణకాన్ని కలిగి ఉంటాయి. రాడ్ సెల్ అతి తక్కువ కాంతిలో అనగా చీకటిలో వస్తువులను చూడటానికి పనికొస్తాయి. కానీ వివిధ రంగులను గుర్తించలేవు. కోన్ సెల్స్‌లో అయొడాప్సిన్ అనే వర్ణక పదార్థం ఉంటుంది. కోన్‌సెల్స్ కాంతివంతమైన వెలుతురులో వస్తువులను చూడటానికి ఉపయోగపడతాయి. ఇవి రంగులను గుర్తిస్తాయి. రెటీనా పరాంత మధ్యభాగాన్ని మాక్యులాల్యూటియా లేదా పసుపుచుక్క అంటారు. పసుపు చుక్కలో కోన్‌సెల్స్ అధికంగా ఉంటాయి. కంటిలో ప్రతిబింబం ఏర్పడే ప్రాంతమే ఈ పసుపు చుక్క.

నేత్రగోళం నుంచి వార్తలను మెదడుకి చేరవేసే నాడిని దృక్ నాడి అంటారు. రెటీనాతో దృక్‌నాడి కలిసే ప్రాంతాన్ని బ్లైండ్ స్పాట్ అంటారు. దీనిలో ఏవిధమైన కాంతి గ్రాహకాలు ఉండవు. అందువల్ల ఈ ప్రదేశంలో ప్రతిబింబాలు ఏర్పడవు. రెటీనాను కెమెరాలోని ఫిల్మ్‌తో పోల్చవచ్చు. నేత్రగోళ కుహరంలో ఐరిస్ వెనుక ద్వికుంభాకార కటకం ఉంటుంది. ఇది సర్దుబాటు చేసుకునే కటకం. దీనిని కెమెరాలోని కటకంతో పోలుస్తారు. చూసే వస్తువు దూరాన్ని బట్టి ఈ కటకం తన నాభ్యాంతరాన్ని మార్చుకుంటుంది. కన్ను లోపలి భాగాన్ని కటకం పూర్వాంతపు, పరాంత కక్ష్యలుగా విభజిస్తుంది. పూర్వాంతపు కక్ష్యను అక్వియస్ చాంబర్ అని, పరాంతపు కక్ష్యను విట్రియస్ చాంబర్ అని అంటారు. అక్వియస్ చాంబర్‌లోని ద్రవం కటకానికి, కార్నియాకి పోషక పదార్థాలను అందిస్తుంది. విట్రియస్ చాం బర్‌లోని ద్రవం అంతరనేత్ర ఒత్తిడిని స్థిరంగా ఉంచి నేత్రగోళం ఆకారాన్ని కాపాడుతుంది.

కన్ను పనిచేసే విధానం

కన్ను కాంతిని సేకరించి కుంభాకార కటకం ద్వారా కేంద్రీకరించి, కంటిలో వెనుక భాగాన ఉండే రెటీనాపై ప్రతిబింబాన్ని ఏర్పరుస్తుంది. కటకం వల్ల ఏర్పడే ప్రతిబింబంలో ఎడమ కుడిగాను, తలకిందులుగాను ఉంటుంది. మెదడులోని జ్ఞానకేంద్రాల్లో పటాలన్నీ సాధారణంగా తిరగబడి, తలకిందులుగా అవుతాయి. నాడీ కణాలన్నీ కట్టలా కలిసి, కంటి నుంచి దృష్టి సమాచారాన్ని మెదడుకు పంపించే దృక్‌నాడిని ఏర్పరుస్తాయి. రెండు కళ్లూ సేకరించిన రెండు దృశ్యాలను కలిపి ఒక త్రిమితీయ పటంగా మెదడు తయారుచేస్తుంది. కంటిగుడ్డులో మన కంటికి కనిపించే భాగం 1/6వ వంతు మాత్రమే. కంటికి, టీవీకి మధ్యదూరం 2 1/2 మీటర్లు లేదా ఆరు అడుగులు ఉండాలి. కంటికి, పుస్తకానికి మధ్య దూరం 30 సెం.మీ. ఉండాలి. ఒక ప్రతిబింబం ముద్ర రెటీనా మీద ఉండే సమయం 1/6 సెకన్లు మాత్రమే. కంటిచూపు లేనివారిని అంధులు అంటారు. లూయిస్ బ్రెయిలీ స్పర్శ ద్వారా చదివే బ్రెయిలీ లిపిని అంధుల కోసం కనుగొన్నారు. ఈయన ఫ్రెంచ్ దేశీయుడు. అంధుల కోసం ఆరు చుక్కల బ్రెయిలీ లిపిని ఆవిష్కరించారు.

వివిధ రకాల జంతువుల్లో కంటి దృష్టి

ఎ) మొజాయిక్ దృష్టి: ఆర్థ్రోపొడకు చెందిన కీటకాల్లో దీనిని గమనించవచ్చు. కీటకాల్లో సంయుక్త నేత్రం ఉంటుంది. దీనిలో అనేక చిన్న చిన్న సరళ నేత్రాలు ఉంటాయి. కీటకనేత్రంలోని ఈ భాగాలను నేత్రాంశాలు అంటారు. ఒక్కొక్క నేత్రాంశం దృశ్యంలోని కొంత భాగాన్ని గ్రహిస్తుంది. చివరకు అన్నిభాగాల ప్రతిబింబాలు మెదడును చేరి పూర్తి దృశ్యాన్ని కీటకం చూడగలదు. ఉదాహరణకు సీతాకోకచిలుక, బొద్దింక.

బి) మోనాక్యులార్ దృష్టి: తలకు ఇరువైపులా నేత్రాలు ఉన్న జీవుల్లో ఈరకమైన దృష్టి ఉంటుంది. ఒక కన్నుతో ఒక దృశ్యాన్ని, మరో కన్నుతో మరో దృశ్యాన్ని చూస్తాయి. ఉదాహరణకు చేపలు, ఉభయచరాలు, సరీసృపాలు, పక్షులు.

సి) బైనాక్యులార్ దృష్టి: రెండు కళ్ల సహాయంతో ఒకే వస్తువును చూడటాన్ని బైనాక్యులార్ దృష్టిగా పేర్కొంటారు. తలకు ముందు భాగంలో కళ్లు అమరి వున్న జంతువుల్లో ఈ రకమైన దృష్టి ఉంటుంది. ఉదాహరణకు కోతులు, మానవుడు. గుడ్లగూబలో మాత్రం బైనాక్యులార్ దృష్టిని మనం గమనించవచ్చు. రెండు కళ్ల సహాయంతో తన చుట్టూ ఉన్న పరిసరాల మొత్తాన్ని చూడగలిగిన దృష్టిని స్టీరియో స్కోపిక్ దృష్టిగా పేర్కొంటాం. ఒకరకంగా చెప్పాలంటే స్టీరియో స్కోపిక్ దృష్టి అనేది బైనాక్యులార్ దృష్టిలో ఉన్నతమైన దృష్టిగా పరిగణిస్తారు.

డి) టెలిస్కోపిక్ దృష్టి: చాలా దూరంగా ఉండే వస్తువులను స్పష్టంగా చూడగలగడం. ఉదాహరణకు పక్షులు.

కంటి వ్యాధులు

ఎ) గ్లాకోమా: నిద్రలేకపోవడం వల్ల కంటిలోని ద్రవంపై ఒత్తిడి కలిగి నీరుకారడం.

బి) ట్రకోమా: క్లామిడియా ట్రాకోమాటిస్ అనే కణాంతర బాక్టీరియా వల్ల వస్తుంది.

సి) కండ్లకలక: ఇది ఎడినో వైరస్ వల్ల కలుగుతుంది.

డి) కంటి శుక్లాలు: కటకంలో ప్రోటీన్ భాగం, ఫైబర్ తగ్గితే కంటి శుక్లాలు వస్తాయి. అప్పుడు చూపు మందగిస్తుంది.

ఇ) మెల్లకన్ను: దీనిని స్ట్రాబిస్మస్ అని కూడా పిలుస్తారు. కండరాల సమస్యల వల్ల ఇది వస్తుంది.

ఎఫ్) మయోపియా: రెటీనాకు ముందు ప్రతిబింబం ఏర్పడితే దగ్గరి వస్తువులను మాత్రం చూడగలం. దీని నివారణకు పుటాకార కటకాన్ని ఉపయోగించాలి.

జీ) హైపర్ మెట్రోపియా: రెటీనాకు వెనుక ప్రతిబింబం ఏర్పడితే దూరం వస్తువులను మాత్రమే చూడగలం. నివారణకు కుంభాకార కటకాన్ని ఉపయోగించాలి.

హెచ్) ప్రెస్ బయోపియా: వృద్ధాప్యంలో సాధారణంగా కలిగే వ్యాధి. దీని నివారణకు ద్వికుంభాకార కటకం వాడాలి.



కె. నాగశేషులు
బయాలజీ ఫ్యాకల్టీ

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

జమిలి ఎన్నికలు
వివిధ కమిటీల సిఫార్సులు

'జమిలి/ ఏకకాల ఎన్నికలు' అనగా లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలు, పట్టణ/ గ్రామీణ స్థానిక సంస్థలన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం. అధికారపక్ష బీజేపీ మానిఫెస్టో అంశమైన జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాల పరిశీలనకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన నియమించిన ఉన్నత స్థాయి కమిటీ 2024 మార్చి 14న జమిలి ఎన్నికలను సిఫార్సు చేస్తూ నివేదిక సమర్పించడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశం అయింది.

ఈ నేపథ్యంలో రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులు, జమిలి ఎన్నికలపై గతంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, లా కమిషన్‌లు, ఎలక్షన్ కమిషన్ వెల్లడించిన అభిప్రాయాలు, జమిలి ఎన్నికల వల్ల లాభనష్టాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులు

ప్రభుత్వం జమిలి ఎన్నికలపై సిఫార్సుల కోసం మాజీ రాష్ట్రపతి కోవింద్ అధ్యక్షతన, ఎనిమిదిమంది సభ్యులతో ఒక ఉన్నతస్థాయి కమిటీని(హెచ్‌ఎల్‌సీ) నియమించింది. దీనినే 'వన్ నేషన్, వన్ ఎలక్షన్ కమిటీ'గా కూడా వ్యవహరిస్తారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా రామ్‌నాథ్ కోవింద్ ఉండగా సభ్యులుగా అమిత్‌షా(కేంద్ర హోంమినిస్టర్), హరీష్ సాల్వే(సీనియర్ అడ్వకేట్), సుభాష్ కాశ్యప్(లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్), ఎన్.కె.సింగ్(కేంద్ర 15వ ఆర్థికసంఘం మాజీ ఛైర్మన్), సంజయ్ కొఠారి (సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ మాజీ కమిషనర్), గులాం నబీ ఆజాద్(రాజ్యసభ మాజీ ప్రతిపక్ష నాయకుడు), అధిర్ రంజన్ చౌదరి(లోక్‌సభ కాంగ్రెస్ నాయకుడు- ఈయన కమిటీలో ఉండటానికి నిరాకరించారు) ప్రత్యేక ఆహ్వానితులుగా కేంద్ర న్యాయశాఖమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ఉంటారు. లా సెక్రటరీ ఈ కమిటీకి సెక్రెటరీగా వ్యవహరిస్తారు.

ఈ కమిటీ మొత్తం 65 సమావేశాలు నిర్వహించి, 18,626 పేజీల నివేదికను 2024 మార్చి 14న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది. ఈ కమిటీ జమిలి ఎన్నికలను ఏకగ్రీవంగా సమర్థిస్తూ వాటిని జరపడానికి చేపట్టాల్సిన సముచిత చర్యలు, రాజ్యాంగ సవరణలు, ఎదురుకానున్న కొన్ని కీలక సమస్యలకు పరిష్కార మార్గాలను సూచిస్తూ ఒక సమగ్ర నివేదికను రూపొందించింది.

కమిటీ సిఫార్సుల్లో ప్రధానాంశాలు



1. తొలుత లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిపి, ఈ ఎన్నికలు పూర్తయిన వందరోజుల్లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలి.
2. ఎప్పటినుంచి జమిలి ఎన్నికలు అమల్లోకి రావాలనే విషయాన్ని సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరవాత ఎన్నికయ్యే కొత్త ప్రభుత్వం నిర్ణయిస్తుంది.
3. జమిలి ఎన్నికలను తొలిసారి జరిపేటప్పుడు ఒక అపాయింటెడ్ డేట్‌ను నిర్ణయించాలి. అప్పటికి లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల శాసనసభ కాలపరిమితి ముగిసినట్లు భావించవచ్చు. ఇక్కడ అయిదు సంవత్సరాల కాలపరిమితిలో హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా స్థిరీకరించవచ్చు.
4. హంగ్‌హౌస్ లేదా అవిశ్వాస తీర్మానం నెగ్గడం వంటి సందర్భాల్లో మరలా ఎన్నికలు నిర్వహిస్తారు. అయితే మిగిలిన కాలపరిమితి వరకే ఆ ప్రభుత్వాలు కొనసాగుతాయి. ఈవిధంగా కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో ప్రభుత్వాల పాలనకాలాన్ని సమాంతరం చేయవచ్చు.
5. జమిలి ఎన్నికలను ప్రవేశపెట్టడానికి కొన్ని రాజ్యాంగ ప్రకరణలను సవరించడంతోపాటు, కొన్ని అంశాలపరంగా కనీసం సగం రాష్ట్రాల ఆమోదం సాధించాల్సి ఉంటుంది. రాష్ట్రాల శాసనసభల కాలావ్యవధికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణ 172, లోక్‌సభ కాలావధికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణ 83లను సవరించాలి. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర శాసనసభలతోపాటు స్థానిక సంస్థలకు కూడా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు విధివిధానాలు గల ఒక కొత్త ప్రకరణను, ప్రకరణ 324కు జోడించి 324(ఎ)ను రూపొందించాలి.
6. కేంద్ర, రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు కలిపి సంయుక్తంగా ఒకే ఓటర్ల జాబితా ఉండాలి. దానికోసం కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లతో కలిసి 'యూనిఫైడ్ ఎలక్టోరల్ రోల్'ను ఏర్పాటుచేసి, ఒకే ఓటరు ఐడీ కార్డును జారీ చేయాల్సి ఉంటుంది. దీని కోసం రాజ్యాంగ ప్రకరణ 325లో మార్పులు చేయాల్సి ఉంటుంది. ఈ సవరణలకు కనీసం సగం రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు అవసరం.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, లా కమిషన్, ఎలక్షన్ కమిషన్ అభిప్రాయాలు

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ(2015) సూచనలు

- వేర్వేరు ఎన్నికలు అధికవ్యయంతో కూడుకున్నవి.
- తరచూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) అమలులోకి రావడంతో పాలసీ పెరాలసిస్(పథకాల స్తంభన) ఏర్పడుతుంది. దీనితో అత్యవసరంగా చేపట్టాల్సిన పాలన చర్యలకు అవరోధాలు కలుగుతున్నాయి.
- తరచూ ఎన్నికలతో మానవ వనరులపై అధిక పనిభారం, ఒత్తిడి పెరుగుతుంది.
- జమిలి ఎన్నికలు దేశవ్యాప్తంగా ఒకేసారి కన్నా కొంత వ్యవధితో రెండు దఫాలుగా జరపడం ఆచరణ సాధ్యంగా ఉంటుంది.
- తమ కాలవ్యవధి పూర్తిచేసుకునే సమయం ఆధారంగా రాష్ట్రాలను వర్గీకరించి ఒక ఏడాదిలో రెండు దఫాలుగా తొలుత ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. జమిలిని ప్రవేశపెట్టిన మొదటి సంవత్సరం పాలన కాలం కొన్ని రాష్ట్రాలకు అధికం కావచ్చు. మరి కొన్ని రాష్ట్రాలకు తగ్గనూవచ్చు.
- రాష్ట్రాలపై ప్రభావం ఉంటుంది కావున కనీసం 2/3వ వంతు రాష్ట్రాల ఆమోదం కావాలి.
- అవిశ్వాస తీర్మానంతోపాటు, విశ్వాస తీర్మానం కూడా(ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటూ) ఏకకాలంలో ఆమోదించేటప్పుడు ఉంటేనే జమిలి విధానం సాధ్యం.

లా కమిషన్ సిఫార్సులు(2018)

1999, 2018ల్లో లా కమిషన్లు జమిలి ఎన్నికల ఆవశ్యకత గుర్తిస్తూ ఇంచుమించుగా ఒకే సిఫార్సులు చేశాయి. అవి-

- జమిలి ఎన్నికల వల్ల ప్రజాధనం ఆదా అవుతుంది. ప్రభుత్వ వర్గాలపై భద్రతా బలగాలపై పనిభారం తగ్గుతుంది.
- ప్రభుత్వ పథకాలు, పాలన నిరంతరాయంగా కొనసాగేందుకు అవకాశం ఉంటుంది.
- ప్రస్తుతం ఉన్న రాజ్యాంగంలో కనీసం అయిదు సవరణలన్నా చేయాల్సి ఉంటుంది. 50 శాతం రాష్ట్రాలు ఈ సవరణలకు ఆమోదం తెలపాలి.
- ప్రజా ప్రాతినిధ్యచట్టం(1951), లోక్‌సభ, అసెంబ్లీల నియమ నిబంధనల్లో కూడా మార్పులు తేవాలి.
- అవిశ్వాస తీర్మానాలు నెగ్గడం లేదా గడువుకు ముందే ప్రభుత్వాలు రద్దును కోరినప్పుడు మిగతాకాలం ప్రభుత్వాలు కొనసాగేందుకు ఏంచేయాలి అన్నది జమిలి విధానానికి ఉన్న ప్రధాన అవరోధం.
- ఒక ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు, ఏ ప్రభుత్వం కొనసాగుతుందో చెప్పే విశ్వాస తీర్మానం కూడా నెగ్గాల్సి ఉండటం వంటి ఏర్పాట్లు ఉండాలి.

ఎలక్షన్ కమిషన్ అభిప్రాయం

జమిలి ఎన్నికలకు పెద్దఎత్తున ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, ఓటరు వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్(వీవీపీఏటీ) అవసరమవుతాయి. ప్రస్తుతం ఉన్నవాటికి అదనంగా రెండింతలు, మొత్తంగా 30 లక్షల ఈవీఎంఎస్, వీవీపీఏటీలు అవసరమవుతాయని పేర్కొంది.

అయితే జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు తాము సిద్ధమేనని, ఇది ఎలక్షన్ కమిషన్‌పై గణనీయంగా భారం తగ్గిస్తుందని 2022లోనే ప్రధాన ఎలక్షన్ కమిషనర్ సుశీల్‌చంద్ర సంసిద్ధత వ్యక్తం చేశారు. నిజానికి 1983లోనే ఎలక్షన్ కమిషన్ జమిలి ఎన్నికల ప్రస్తావన తెచ్చింది. కానీ అప్పటి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయలేదు.

ఈ జమిలి విధానం గతంలో భారతదేశ స్వాతంత్ర్యానంతరం జరిగిన నాలుగు వరుస సార్వత్రిక ఎన్నికల్లో(1952, 1957, 1962, 1967ల్లో) పాటించారు. కారణం, అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తికాలంపాటు కొనసాగడం. కానీ, 1957లో కేరళలో అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుతాన్ని, ప్రకరణ 356ను ప్రయోగించి కేంద్రప్రభుత్వం రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించింది. 1960లో తిరిగి కేరళ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. దీనితో కేంద్ర, రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విధానానికి గండిపడింది. 1967 ఎన్నికల్లో చాలా రాష్ట్రాల్లో(బిహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా) కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అయితే వాటిలో చాలావరకూ పూర్తికాలం కొనసాగకుండానే రద్దవడంతో 1967 తరవాత జమిలి ఎన్నికలు సాధ్యపడలేదు.


(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

గుప్త సామ్రాజ్యం



భారతదేశంలో గుప్త సామ్రాజ్యాన్ని చరిత్రకారులు స్వర్ణయుగంగా అభివర్ణించారు. గుప్తులు వైశ్య వర్ణానికి చెందినవారు. వీరు సుమారు 280 క్రీ.శ. నుంచి 550 క్రీ.శ.వరకు పాలించారు. పశ్చిమ భారతదేశంలో గుజరాత్, రాజస్థాన్‌లో కొంత భాగం; తూర్పు వైపున బంగ్లాదేశ్ ప్రాంతాలకు గుప్త సామ్రాజ్యం విస్తరించింది. పాటలీపుత్రం వీరి రాజధాని. శాంతి, అభివృద్ధి ధ్యేయంగా సాగిన వీరి పాలన శాస్త్రీయ, కళా రంగాల్లో విస్తృత ప్రగతిని సాధించింది. చరిత్రకారుడు వి.ఎ.స్మిత్ గుప్తుల కాలాన్ని 'హన్', 'టాంగ్', 'రోమన్' సామ్రాజ్యాలతో పోల్చాడు. వీరి కాలంలో భారతదేశ శాస్త్ర పరిజ్ఞానం, గణితం, ఖగోళశాస్త్రం, తత్త్వశాస్త్రం బాగా ప్రాచుర్యం పొందాయి. వీటికి తోడు సాహిత్య, శిల్పకళా రంగాలు కూడా అభివృద్ధి చెందడంతో గుప్తుల కాలాన్ని స్వర్ణయుగంగా భావించారు.

రాజకీయ చరిత్ర

గుప్తులు బెంగాల్‌లోని గౌడ ప్రాంతీయులని చైనా బౌద్ధ సన్యాసి ఒకరు తన రచనల్లో పేర్కొన్నాడు. అయితే వీరు వైశ్య వర్ణానికి చెందిన వారని ఎ.ఎస్.అల్టేకర్ పేర్కొన్నాడు. మరో చరిత్రకారుడు ఆర్.ఎస్.శర్మ "సాంప్రదాయకంగా వాణిజ్యంతో సంబంధం ఉన్న వైశ్యులు గత పాలకుల చేతిలో అణచివేతకు గురై, ప్రతిఘటించి తరవాత పాలకులుగా మారి ఉంటారు" అని అభిప్రాయపడ్డాడు. కాని ఎస్.ఆర్.గోయల్ మాత్రం గుప్తులు బ్రాహ్మణులు అని సిద్ధాంతీకరించాడు. వీరికి బ్రాహ్మణులతో వివాహ సంబంధాలు ఉండటమే దీనికి కారణం అని పేర్కొన్నాడు. ఉదాహరణకు..గుప్త యువరాణి ప్రభావతి గుప్త వాకాటిక రాజ్యానికి రాణి అయ్యింది.

గుప్త వంశ స్థాపకుడు శ్రీగుప్తుడు. బౌద్ధ సన్యాసుల కోసం ఇతను 'మృగ-శిఖ' నగరం వద్ద ఒక ఆలయం నిర్మించాడు. ఇది నలంద సమీపంలో ఉంది. తరవాత ఘటోత్కచ రాజు అయ్యాడు. అలహాబాద్ స్తంభ శాసనంలో ఘటోత్కచను మహారాజుగా వర్ణించారు. తర్వాత వచ్చిన మొదటి చంద్రగుప్తను 'మహారాధిరాజు'గా వర్ణించారు. మొదటి చంద్రగుప్తుడు 'లిచ్ఛవి' యువరాణి కుమారదేవిని వివాహం చేసుకున్నాడు. ఈ వివాహం అతని రాజకీయ శక్తి, ఆధిపత్య విస్తరణకు దోహదం చేసింది. ఫలితంగా తన భార్య పేరు మీద బంగారు నాణేలు ముద్రించాడు.

సముద్రగుప్తుడు: క్రీ.శ.335-375 మధ్యకాలంలో పరిపాలించాడు. ఇతని సైనిక విజయాలను అలహాబాద్ శాసనంలో పేర్కొన్నారు. ఈ శాసనాన్ని హరిసేనుడు చెక్కించాడు. ఈ రాతిని మొదట అశోకుడు స్థాపించాడు. 17వ శతాబ్దంలో మొగల్ చక్రవర్తి జహంగీర్ రాసిన శాసనాలు కూడా ఈ రాతిపైనే చెక్కారు. ఈ శాసనంపై మొదట పాళి భాషలో అశోకుడు, తరవాత సంస్కృతంలో హరిసేనుడు, పర్షియన్‌లో జహంగీర్ చెక్కించారు. అయితే అశోకుడు తొలుత కౌశాంబి ప్రాంతంలో శాసనం చెక్కించగా, తరవాత దానిని అక్బర్ అలహాబాద్‌కు తరలించాడని చరిత్రకారులు పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలోని కాంచీపురం రాజు విష్ణుగుప్తుడు, వేంగీ శాలంకాయనరాజు హస్తివర్మ పేర్లు కూడా ఈ శాసనంలో ఉన్నాయి.

ఆర్యావర్తంలో ఎనిమిది మంది రాజులను, దక్షిణ భారతంలో 12 మంది రాజులను సముద్రగుప్తుడు ఓడించినట్లు ఈ శాసనంలో పేర్కొన్నారు. సముద్రగుప్తుడు తన దండయాత్రల ద్వారా తొమ్మిది మంది చక్రవర్తులను నిర్మూలించాడని, 12 మందిని లొంగదీసుకున్నాడని వి.ఎ.స్మిత్ పేర్కొన్నాడు. ఈ సందర్భంగా సముద్రగుప్తుడిని 'భారతీయ నెపోలియన్' అని స్మిత్ వ్యాఖ్యానించాడు. సముద్రగుప్తుడు పురాతన వేద అశ్వబలిని పునరుద్ధరించాడు. 'అశ్వమేధయోగి' అని బిరుదు పొందాడు. ఇతని తల్లి కుమారదేవి, భార్య దత్తాదేవి, కోడలు ధ్రువాదేవి. సముద్రగుప్తుడు వంద యుద్ధాలు చేసి 'పరాక్రమ' అనే బిరుదు పొందాడని, రాజులందరినీ సంహరించాడని, తనతో సరితూగే శక్తిమంతమైన శత్రువు లేని వ్యక్తి అని, నాలుగు సముద్ర జలాలచే కీర్తిని పొందాడని అలహాబాద్ శాసనం పేర్కొంది. సరిహద్దు రాజ్యాలుగా కామరూప(అస్సాం), నేపాలా(నేపాల్), కర్తిపుర (త్రిపుర, ఈశాన్య రాష్ట్రాలు) ఉన్నాయి. సమతత, దావక మొదలైన రాజ్యాలను ఆక్రమించాడు. సముద్రగుప్తుడు గొప్ప సంగీతకారుడు. ఇతన్ని కవిరాజు, కవులరాజు అని పిలిచేవారు.



రామగుప్తుడు: విశాఖ దత్తుని గ్రంథం 'దేవీ చంద్రగుప్తం'లో, దుర్జన్పుర శాసనంలో, జైన చిత్రాలలో ఇతని 'మహారాజాధిరాజు'గా పేర్కొన్నారు. విదిశ ప్రాంతంలో ఇతని రాగినాణేలు లభించాయి. రామగుప్తుడు సముద్రగుప్తుని పెద్దకుమారుడు కావచ్చునని చరిత్రకారులు భావిస్తున్నారు. ఇతను పాలనకు అనర్హుడని భావించి పదవిచ్యుతుడిని చేసి, చంపి అతని తమ్ముడు రెండో చంద్రగుప్తుడు బాధ్యతలు స్వీకరించాడు.

రెండో చంద్రగుప్తుడు: ఇతను సముద్రగుప్తుని రెండో కుమారుడు. క్రీ.శ.375 నుంచి 415 వరకు పరిపాలించాడు. ఈయన కుంతల కదంబ యువరాణి 'కుంతల'ను, నాగవంశానికి చెందిన 'కుభేరనాగ'ను వివాహం చేసుకున్నాడు. తన కుమార్తె ప్రభావతి గుప్తను రెండో రుద్రసేనుడికి ఇచ్చి వివాహం చేశాడు. రెండో చంద్రగుప్తుడు మాళ్వా, గుజరాత్, సౌరాష్ట్రలకు చెందిన సాక(శక), పశ్చిమ క్షత్రపులను ఓడించాడు. ముఖ్యంగా మూడో రుద్రసింహను ఓడించాడు. తన రాజధానిని పాటలీపుత్రం నుంచి ఉజ్జయినికి మార్చుకున్నాడు. ఇతనికి 'విక్రమాదిత్య', 'శకారి', 'సాహసాంక' మొదలైన బిరుదులున్నాయి. ఇతను మొత్తం 21 రాజ్యాలను జయించినట్లు కాళిదాసు రచనల్లో కన్పిస్తుంది. అదేవిధంగా సకాల, కంబోజా, యవన, తుషార, పరాసికాసు రాజ్యాలను అణచివేసినట్లు కశ్మీరి రచయిత క్షేమేంద్రుడు 'బృత్కథ మంజరి'లో పేర్కొన్నాడు. చైనా యాత్రికుడు ఫాహియాన్ ఇతని ఆస్థానాన్ని సందర్శించాడు. ఫాహియాన్ క్రీ.శ. 399లో తన ప్రయాణాన్ని చైనా నుంచి ప్రారంభించాడు. క్రీ.శ.405లో భారతదేశం చేరుకున్నాడు. క్రీ.శ.411 వరకు వివిధ రాజ్యాలు, ప్రాంతాలను ఫాహియాన్ సందర్శించాడు. మధుర, కనోజ్, కపిలవస్తు, కుశినగరం, వైశాలి, పాటలీపుత్రం, కాశీ, రాజగృహాలకు తీర్థయాత్రకు వెళ్లాడు. ఫాహియాన్ చైనా భాషలో 'ఫోకోకు' గ్రంథం రచించాడు. దీనిలో అనేక అంశాలు పేర్కొన్నాడు. దీనిని లెగ్గీస్ అనే ఆంగ్లేయుడు 'ఫై ట్రావెల్స్ ఇన్ బుద్ధిస్ట్ కింగ్‌డం' పేరుతో ఆంగ్లంలోకి అనువాదం చేశాడు. భారతదేశంలో శిక్షాస్మృతి సులభంగా ఉందని, నేరాలకు కేవలం జరిమాన మాత్రమే విధిస్తారని, భారత సమాజంలో అంటరానివారు లేదా పంచమ వర్ణానికి చెందిన ప్రజలను గుర్తించానని, ఇది ప్రపంచంలో కేవలం ఇక్కడే ఉందని, మరెక్కడా లేదని ఆ గ్రంథంలో పేర్కొన్నాడు.

రెండో చంద్రగుప్తుని ఆస్థానంలో 'నవరత్నాలు' అనే గొప్ప శాస్త్ర సాంకేతిక, వైజ్ఞానిక, గణిత, సాహిత్య రంగాలకు చెందిన వారు ఉండేవారు. వీరిలో కాళిదాసు, అమరసింహుడు, ధన్వంతరి, వరహమిహిరుడు, వరరుచి, ఘటకర్ప, భేతాళ, శంకు ముఖ్యమైన వారు.

కుమార గుప్తుడు: రెండో చంద్రగుప్తుని తరవాత అతని కుమారుడు మొదటి కుమారగుప్తుడు రాజ్యానికి వచ్చాడు. ఇతను 'మహేంద్రాదిత్య' అనే బిరుదును స్వీకరించాడు. ఇతని కాలంలో నర్మదానది లోయలో 'పుష్యమిత్ర' అనే తెగ ఉద్భవించి రాజ్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభించింది. మరోవైపు కిడారియులు, హూణుల దాడులు జరిగాయి. వీటిని అణచివేయడానికి తన కుమారుడు స్కందగుప్తుడిని పంపించాడు. ఆ దాడులను స్కందగుప్తుడు వీరోచితంగా పోరాడి ఎదుర్కొన్నాడు. నలంద విశ్వవిద్యాలయాన్ని కుమార గుప్తుడు స్థాపించాడు. ఈ కట్టడాన్ని 2016 జూలై 15న యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించింది.

స్కందగుప్తుడు: 'విక్రమాదిత్య', 'క్రమాదిత్య' అనే బిరుదులు స్వీకరించాడు. ఇతని కాలంలో భారతదేశంలో శ్వేత హూణుల దాడులు ఎక్కువగా జరిగాయి. వీరిని అణచివేయడంలో విజయం సాధించాడు. యుద్ధ వ్యయం వలన రాజ్యంలో వనరులు అంతరించిపోయాయి. దీంతో వ్యాపారం కోసం చైనాకు రాయబారిని పంపాడు. వ్యవసాయం అభివృద్ధికి, 'సుదర్శన తటాకం' మరమ్మతుల కోసం గుజరాత్ గవర్నర్ చక్రపాలితను, అతని కుమారుడు పర్ణదత్తుడిని స్కందగుప్తుడు నియమించాడు.

గుప్త రాజ్య పతనం

హూణుల దండయాత్రలు; ఇండో- రోమన్ వాణిజ్య సంబంధాలు దెబ్బతినడంతో గుప్త సామ్రాజ్యం అంతరించసాగింది. పాటలీపుత్రం, నాసిక్, బెనారస్ వంటి పట్టణాల్లో పట్టు ఉత్పత్తులు ఎగుమతులు చేసినప్పటికీ, హూణుల దండయాత్రల వలన ఆదాయ వనరులపై పన్నులు వసూలు చేయలేకపోయారు. విదేశీ వస్త్రాలపై దీని ప్రభావం పడింది. భారతీయ పట్టణ సంస్కృతి క్షీణించింది. గుప్తుల వంశంలో చివరిరాజు విష్ణుగుప్తుడు అని 'దామోదర్పూర్' శాసనంలో ఉంది. ఉత్తరప్రదేశ్, బిహార్‌లో వచ్చిన వినాశకరమైన వరద కారణంగా గుప్తులు పతనం చెందారని శంకర శర్మ అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు.



డాక్టర్ ఐ.నీలా,
అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట.

ప్రభాకర్‌రావు లొంగు'బాట'?

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్ చేసి, "ఇప్పుడు ప్రభుత్వం చెబుతున్నట్లు మీరు ఎలా చేస్తున్నారో.. గత ప్రభుత్వం చెప్పింది మేం చేశాం" అని వ్యాఖ్యానించారనే విషయం తెలిసిందే..! అయితే.. "మీరు ఏం చెప్పాలనుకున్నా.. హైదరాబాద్‌కు వచ్చి చెప్పండి. లేదంటే తెలంగాణ పోలీసు అధికారిక ఈ-మెయిల్‌కు వివరాలు పంపండి" అని సదరు దర్యాప్తు అధికారి చెప్పగానే ప్రభాకర్‌రావు ఫోన్ కట్‌చేశారు. నిజానికి తాను అమెరికాలో క్యాన్సర్ చికిత్సకు వచ్చానని, రెండు-మూడు నెలల తర్వాత తిరిగి హైదరాబాద్‌కు వస్తానని చెప్పిన ప్రభాకర్‌రావు.. ఇప్పుడు ఆగమేఘాల మీద దర్యాప్తు అధికారుల ఎదుట హాజరయ్యేందుకు సిద్ధపడ్డట్లు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు మాదిరిగానే.. నేరుగా పశ్చిమ మండలం డీసీపీ ఎదుట ప్రభాకర్‌రావు లొంగిపోనున్నట్లు సమాచారం.

మధ్యవర్తిత్వం నెరపిందెవరు?

ప్రభాకర్‌రావు తన క్యాన్సర్ చికిత్స పూర్తయ్యాకే అమెరికా నుంచి తిరిగి వస్తానని ఇంతకు మునుపే దర్యాప్తు అధికారులకు స్పష్టం చేశారు. అయితే.. ఉన్నఫళంగా తన మనసును మార్చుకుని, హైదరాబాద్ వస్తుండడం వెనక ఓ కీలక వ్యక్తి మధ్యవర్తిత్వం నెరిపినట్లు పశ్చిమ మండలం పోలీసులు చర్చించుకుంటున్నారు. ఆ వ్యక్తి ప్రభాకర్‌రావుతో మాట్లాడి.. "పరిస్థితి మరింత జటిలంగా మారక ముందే.. పోలీసుల ఎదుట లొంగిపోవడం మంచిది. లేదంటే.. మీరు వచ్చే వరకు ఇతర నిందితులకు బెయిల్ కూడా వచ్చే అవకాశాల్లేవు. పైగా.. మీ ఇళ్లలో సోదాలు జరుగుతున్నాయి. ఇంటర్‌పోల్ సాయం తీసుకునేదాకా పరిస్థితి వెళ్తే మీక్కూడా మంచిది కాదు. నేరం చేయలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత కూడా మీపైనే ఉంటుంది" అని సముదాయించినట్లు తెలిసింది. అంతేకాకుండా.. పోలీసు శాఖలో ఉండేదంతా మనవాళ్లేనని, మీకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకుంటామని భరోసా ఇవ్వడంతో.. ప్రభాకర్‌రావు హైదరాబాద్



బంజారాహిల్స్ ఠాణా నుంచి బయటకొస్తున్న శ్రీధర్‌రావు

వచ్చేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది.

అప్రూవర్‌గా మారుతారా?

ఈ కేసు కోర్టులో నిలబడాలంటే.. బలమైన సాక్ష్యాధారాలు అవసరం అని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్‌ను ప్రయోగించినా.. ఐపీసీలోని సెక్షన్లను పెట్టినా.. విపక్ష నేతల ఫోన్ల ట్యాపింగ్ జరిగిందనడానికి కోర్టుకు పక్కా ఆధారాలు అవసరం అని వివరిస్తున్నారు. ఇప్పటికే ప్రణీత్‌రావు హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేశారని చెబుతున్న నేపథ్యంలో.. ఏ సాఫ్ట్‌వేర్ వాడారు? ర్యాండమ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రోజన్/టూల్(ర్యాట్)ను టార్గెట్ ఫోన్లలో ఎలా ప్రవేశపెట్టారు? ఎవరెవరి ఫోన్లను ట్యాప్ చేశారు? అనే వివరాలను రాబట్టడం కష్టమేనంటున్నారు. ఇక దర్యాప్తు అధికారుల విచారణ సందర్భంగా.. అరెస్టయిన పోలీసు అధికారులు ఇచ్చిన వాంగ్మూలం కూడా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21(3) ప్రకారం చెల్లుబాటు కాదని, ఏసీపీ/డీఎస్పీ స్థాయి అధికారి ఎదుట ఇచ్చిన వాంగ్మూలం చెల్లుబాటు అయ్యేలా చట్టం ఉన్నా.. కోర్టులో నిందితులు మాట మారిస్తే ఇబ్బందేనని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఫోన్‌ట్యాపింగ్ సూత్రధారులకు శిక్ష పడాలంటే.. పాత్రధారులైన నిందితుల్లో ఎవరైనా అప్రూవర్‌గా మారితే తప్ప అది సాధ్యం కాదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అయితే ప్రభాకర్‌రావు, లేదంటే ప్రణీత్‌రావు సిద్ధమైతే.. వారిని అప్రూవర్‌గా పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దర్యాప్తు అధికారులు ఈ ట్యాపింగ్ అంశాన్ని రెండుగా విభజించినట్లు తెలుస్తోంది. మొదటిది ఇంటెలిజెన్స్ కాగా.. రెండోది ఆపరేషన్స్. ఇంటెలిజెన్స్ కేటగిరీలో ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావు నేరుగా ఉండగా.. మిగతా నిందితులంతా ఆపరేషన్స్ కేటగిరీలో ఉన్నట్లు తెలుస్తోంది.

మూడోరోజు ముగిసిన విచారణ..

మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలను మూడోరోజు కస్టడీలో భాగంగా పంజాగుట్ట పోలీసులు ఆదివారం విచారించారు. ఈ సందర్భంగా కీలక ఆధారాలను సేకరించినట్లు తెలిసింది. వీరిద్దరూ ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్‌లో పనిచేసినప్పుడు ఎంతమంది ఫోన్లను ట్యాప్ చేశారు? ఎంతమందిని వేధించారు? ఎవరి మెప్పుకోసం ఈ చర్యలకు పాల్పడ్డారు? అనే అంశాలపై ప్రశ్నించినట్లు సమాచారం. వీరి కస్టడీకి మరో రెండ్రోజుల గడువే ఉండడంతో.. ఆలోగా రాధాకిషన్‌రావు కస్టడీకి కూడా లైన్ క్లియర్ అయితే.. ముగ్గురినీ కలిపి విచారించే అవకాశాలున్నాయి. సోమవారం నాంపల్లి న్యాయస్థానంలో రాధాకిషన్‌రావు కస్టడీ పిటిషన్‌పై వాదనలు జరగనున్నాయి.

త్వరలో రాజకీయ నాయకులకు నోటీసులు

భుజంగరావు, తిరుపతన్న విచారణ సందర్భంగా పలువురు రాజకీయ నాయకుల పేర్లు బయటకు వచ్చినట్లు తెలిసింది. దీంతో ఆయా నేతలకు నోటీసులు జారీ చేసి, విచారణకు పిలిపించాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఆదివారం కూడా పలువురికి శ్రీముఖాలు అందాయని, వారు సోమవారం నుంచి విచారణకు హాజరయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ఠాణాకు సంధ్య కన్వెన్షన్ ఎండీ

సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావు ఆదివారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. తన ఫోన్ ట్యాప్ చేసి వేధింపులకు గురిచేశారంటూ ఇటీవల శ్రీధర్‌రావు తరఫున ఆయన అడ్వొకేట్ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఆయన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, విచారణాధికారులకు పలు ఆధారాలు సమర్పించినట్లు తెలుస్తోంది. భుజంగరావు తన ఫోన్‌ను ట్యాప్ చేసి, అనేక ఇబ్బందులకు గురిచేశారని చెప్పినట్లు సమాచారం. భుజంగరావు తన కార్యాలయానికి పిలిపించి, బెదిరించారని, అక్రమంగా కేసులు పెట్టించారని వివరించినట్లు తెలిసింది. అందుకు తగిన ఆధారాలను దర్యాప్తు అధికారులకు సమర్పించినట్లు తెలుస్తోంది. ఠాణా నుంచి బయటకు వస్తున్న సందర్భంగా శ్రీధర్‌రావుకు మీడియా పలు ప్రశ్నలు వేయగా.. "త్వరలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తా. అప్పుడు అన్ని వివరాలు చెబుతా" అని వ్యాఖ్యానించారు. తాను చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు అధికారులకు ఆధారాలను అందజేసేందుకు వచ్చినట్లు చెప్పారు.



టోలు వాయింపు

- హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65పై పెరిగిన వాహనాల టోల్ ఫీ
- కొత్త ధరలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి

కేతేపల్లి, మార్చి 31: మీరు తరచుగా హైదరాబాద్-విజయవాడ (65వ నంబరు జాతీయ రహదారి) రూట్‌లో ప్రయాణిస్తారా? అయితే పెరిగిన టోల్ ఫీజులు చెల్లించడానికి సిద్ధంగా ఉండండి. ఈ రహదారిలో జీఎమ్మార్ ఏర్పాటుచేసిన టోల్‌ప్లాజాల్లో చార్జీలు కొన్నిచోట్ల యథాతథంగా ఉండగా.. మరికొన్ని చోట్ల రూ.5 నుంచి గరిష్ఠంగా రూ.40 మేర పెరిగాయి. కొత్త ధరలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ నడుమ 181.5 కిలోమీటర్ల మేర రెండు లేన్లుగా ఉన్న ఈ రహదారి పనులను దాదాపు రూ.2 వేల కోట్ల వ్యయంతో పన్నెండున్నర సంవత్సరాల క్రితం జీఎంఆర్ సంస్థ నిర్వహించింది. విస్తరణ పనులకు అయిన వ్యయాన్ని రాబట్టుకునేందుకు రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్, ఏపీ రాష్ట్రం కృష్ణా జిల్లాలోని చిల్లకల్లు వద్ద మూడు టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేసింది. 2012 డిసెంబరు 20 నుంచి టోల్ చార్జీల వసూలును ప్రారంభించింది. జాతీయ రహదారి విస్తరణ పనుల విభాగం నిబంధనల మేరకు వార్షిక సవరణల పేరిట ఏటా టోల్ చార్జీలను సవరించి పెంచుకునే వీలుంది. ఈ మేరకు పెంచిన టోల్ ట్యాక్సును జీఎమ్మార్ యంత్రాంగం ఆదివారం అర్ధరాత్రి (ఏప్రిల్ 1) నుంచి అమల్లోకి తెచ్చింది. అలాగే టోల్‌ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు చెందిన స్థానిక వాహనాల నెలసరి పాస్ చార్జీలను రూ.330 నుంచి రూ.340కి పెంచింది.

ఎంత పెరిగిందంటే..

పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్ ప్లాజాల మీదుగా ఒకవైపు ప్రయాణానికి..

వాహనం రకం	పాత రేటు (రూ.)	కొత్త రేటు (రూ.)
కారు, జీపు, వ్యాన్, లైట్ మోటార్ వాహనాలు	325	335
లైట్ వాణిజ్య, లైట్ గూడ్స్ లేదా మినీ బస్సు	515	525
బస్సు లేక ట్రక్కు, (రెండు యాక్సిల్స్)	1065	1100
3 నుంచి 6 యాక్సిల్స్ వాహనాలు	1655	1695
7 అంతకు మించి యాక్సిల్స్ ఉండే అతి భారీ వాహనాలు	2060	2115

నిఘా నేత్రంలో మద్యం ఉత్పత్తి కేంద్రాలు

- 24 కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- ఎన్నికల వేళ అక్రమ మద్యం తరలింపు కట్టడే లక్ష్యం
- ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి: ఈసీ

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా మద్యం అక్రమ తరలింపును కట్టడి చేయడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందుకు సంబంధించిన విషయాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం వెల్లడించింది. ఇప్పటి వరకు మద్యం షాపులు, గోడౌన్లపైనే ప్రత్యేక నిఘా వేస్తూ వచ్చిన సంబంధిత విభాగాలు.. ఇప్పుడు మద్యం ఉత్పత్తి కేంద్రాలపై నిఘా పెట్టాయి. అందులో భాగంగానే.. రాష్ట్ర వ్యాప్తంగా 24 మద్యం ఉత్పత్తి కేంద్రాలను సీసీ కెమెరాల నిఘా నీడలోకి ఎన్నికల సంఘం తీసుకువచ్చింది. అక్కడి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు ఎక్సైజ్ శాఖ సహకారంతో జీఎస్‌టీ, సీజీఎస్‌టీ విభాగాల ద్వారా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో గతంలో చేస్తున్న మద్యం ఉత్పత్తి కంటే 20 శాతం పెరుగుదల ఉంటే ఎక్సైజ్‌శాఖలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు ఎన్నికల కమిషన్‌కు తక్షణం సమాచారాన్ని చేరవేస్తాయి. తద్వారా అక్రమంగా మద్యం తరలించే ప్రయత్నం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోనున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 1,700 మద్యం గోడౌన్‌లను ఎంపికచేసి వాటిని నిరంతరం పర్యవేక్షించడం వల్ల ఆ సమయంలో రూ.90 కోట్ల విలువైన అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని సీఈవో వికాస్‌రాజ్ ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

కలెక్టర్లతో ఈసీ వీడియో కాన్ఫరెన్స్

రాష్ట్రంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలంగాణ ఎన్నికల సంఘం కోరింది. ఆదివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో ఈసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు ఎలక్షన్స్ ట్రైనింగ్ తీసుకునే మొదటి రోజునే ఫామ్-12ను సమర్పించాలని అడిషనల్ సీఈవో లోకేశ్‌కుమార్ ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్‌ను రిటర్నింగ్ అధికారికి ఇచ్చేందుకు ఒక రోజు సాధరణ సెలవును కూడా మంజూరు చేశారు. కాగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ కోసం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌ను నియమించాలని కలెక్టర్లను ఈసీ ఆదేశించింది.

తెలంగాణ ప్రవాసీకి బీజేపీ ఎమ్మెల్యే బాసట

- గల్ఫ్‌లో దుర్భరస్థితిలో నిజామాబాద్ వాసి
- ఉద్యోగం కోల్పోయి.. ఆస్పత్రి పాలై ఇబ్బందులు
- ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి చొరవతో త్వరలో స్వదేశానికి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఓ వైపు ఉద్యోగం కోల్పోయి తన హక్కు కోసం న్యాయ పోరాటం చేస్తూ.. మరోవైపు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి బిల్లు చెల్లించలేక.. స్వదేశానికి తిరిగి రాలేక దుర్భర స్థితిలో ఉన్న తెలంగాణ ప్రవాసీకి బీజేపీ ఎమ్మెల్యే బాసటగా నిలిచారు. నిజామాబాద్ జిల్లా మక్లూరు మండలం రాంచంద్రపల్లి గ్రామానికి చెందిన చెందిన దూసం గంగాధర్ కువైత్‌లో పని చేస్తుండగా అతనికి యజమాని వేతనం చెల్లించకపోవడంతో కోర్టులో కేసు దాఖలు చేశాడు. దీంతో ఆ యజమాని గంగాధర్‌పై తప్పుడు కేసు బనాయించి వీసాను బ్లాక్‌లిస్టులో పెట్టించాడు. గంగాధర్ ఇతర చోట్ల ఉద్యోగం చేయలేక, స్వదేశానికి రాలేక కువైత్‌లో గత కొన్ని నెలలుగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో కొద్ది వారాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర్ కాలు విరిగింది. ఆస్పత్రిలో చికిత్సకు 1200 దీనార్లు (రూ.3.25 లక్షలు) బిల్లయింది. ఇప్పటికే ఉద్యోగం లేక ఇబ్బందులు పడుతున్న గంగాధర్ పరిస్థితి దుర్భరంగా మారింది. గంగాధర్ దుస్థితిని అతని కుటుంబం బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన గంగాధర్‌ను ఆదుకోవాలని కువైత్‌లోని తన మిత్రులకు సమాచారం అందించారు. దీంతో ఆస్పత్రి బిల్లు చెల్లించడంతో పాటు వీసాను పునరుద్ధరించి స్వదేశానికి పంపించే యత్నాలు ప్రారంభించారు. న్యాయస్థానంలో కేసును ఉపసంహరించి గంగాధర్‌ను త్వరలోనే స్వదేశానికి పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్లు రాకేశ్ మిత్రుడు ఒకరు తెలిపారు.

బీజేపీని గద్దె దించడమే తక్షణ కర్తవ్యం

- దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు: బీ.వీ రాఘవులు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలవకుండా చేసి గద్దె దించడమే తమ తక్షణ రాజకీయ కర్తవ్యమని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీ.వీ రాఘవులు అన్నారు. బీజేపీ మతోన్మాద విధానాలను ప్రశ్నిస్తూ దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నిర్ణయించిందని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ ఒక్క ఎంపీ సీటు కూడా గెలవకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఈ సందర్భంగా రాఘవులు కోరారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం అప్రజాస్వామికమని, దీనిపై లోతుగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ వీరయ్య డిమాండ్ చేశారు. కరువు పీడిత ప్రాంతాల్లో మంత్రులు పర్యటించలేదని సీఎం రేవంత్ ఈ అంశంపై దృష్టి సారించి ఎకరానికి రూ.20వేల నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. కాగా సార్వత్రిక ఎన్నికల్లో సీపీఐ వైఖరిని ప్రకటించాలన్నారు.

తప్పుడు ప్రచారాలతో ఔషధాల విక్రయంపై కొరడా

- ఆయుర్వేద మందుల తయారీ సంస్థలపై డీసీఏ దాడులు

హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తప్పుడు ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ తగిన అనుమతులు లేకుండా మందులను విక్రయిస్తున్న పలు ఆయుర్వేద ఔషధ సంస్థలపై డీసీఏ (డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్) కొరడా ఝుళిపించింది. వేర్వేరు ప్రాంతాల్లో దాడులు చేసిన డీసీఏ అధికారులు ఆయా సంస్థలు తయారు చేసిన మందులను సీజ్ చేశారు. తాము ఇచ్చే అశ్వగంధ చూర్ణంతో మధుమేహం నియంత్రణలో ఉంటుందని ప్రచారం చేసుకుంటున్న చర్లపల్లిలోని ద్విభాషి బాపన్న ఆయుర్వేద నిలయంపై దాడి చేసిన అధికారులు ఆయా మందులను సీజ్ చేశారు. సంగారెడ్డి అమీన్‌పూర్‌లోని ఓ మందుల దుకాణంలో ఉన్న ఆ మందుల నిల్వలను కూడా స్వాధీనం చేసుకున్నారు. అలాగే, కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌లోని ఆయుర్‌జిన్ హెర్బ్స్‌పై దాడి చేసి మందులను సీజ్ చేశారు. కాగా, అనుమతి లేకుండా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న మందుల దుకాణాలు, క్లినిక్‌లపై దాడి చేసిన డీసీఏ అధికారులు నిర్వాహకులపై కేసులు పెట్టారు.

సత్తుపల్లి పట్టణ సీఐపై గిరిజనుల దాడి

ఖమ్మం జిల్లా చంద్రాయపాలెం, బుగ్గపాడు గ్రామాల గిరిజనుల మధ్య భూ వివాదం

- ఆదివారం వివాదాస్పద స్థలాల్లోకి ఇరు వర్గాలు
- అడ్డుకోవడానికి వెళ్లిన సత్తుపల్లి సీఐ కిరణ్
- దాడి చేసిన బుగ్గపాడు గ్రామ గిరిజనులు



సీఐ కిరణ్‌పై దాడి చేస్తున్న గిరిజనులు

సత్తుపల్లి, మార్చి 31: భూవివాదంలో ఇరువర్గాలను విచారించి, నచ్చజెప్పి, హింస చెలరేగకుండా ఆపడానికి వెళ్లిన సత్తుపల్లి పట్టణ సీఐ కిరణ్‌పై ఓ గ్రామానికి చెందిన గిరిజనులు దాడి చేశారు. ఆయన బైక్‌పై వెళ్తుండగా అడ్డుకొని ఆయన్ను కిందపడేసి కొట్టారు. ఖమ్మం జిల్లాలో ఈ ఘటన జరిగింది. సత్తుపల్లి మండలం చంద్రాయపాలెం, బుగ్గపాడు గ్రామాలకు చెందిన గిరిజనుల మధ్య చాలా కాలంగా భూ వివాదం ఉంది. చంద్రాయపాలెంలో అటవీశాఖకు చెందిన 400ఎకరాల భూమిలో తమకు 1999లో 170ఎకరాలు చెట్టు పట్టా ఇచ్చారని, దీన్ని తాము అనుభవిస్తున్నామని చంద్రాయపాలెం గిరిజనులు చెబుతున్నారు. జలగం వెంగళరావు సీఎంగా ఉన్న సమయంలో 1976-77లలో రెవెన్యూశాఖ ద్వారా ఇదే భూమిలోని 343నుంచి 359 సర్వే నెంబర్ల మధ్య తమకు పట్టాలు ఇచ్చారని, తమకూ హక్కులున్నాయని బుగ్గపాడు గిరిజనులు వాదిస్తున్నారు. ఆదివారం రెండు గ్రామాల గిరిజనులు సదరు స్థలాల్లోకి వెళ్లారు. ఈ క్రమంలో, బుగ్గపాడు గిరిజనులు వచ్చి తమ భూమిలో గొడవ చేస్తున్నారని చంద్రాయపాలెం గిరిజనులు పోలీసులకు సమాచారం అందించారు. సత్తుపల్లి పట్టణ సీఐ కిరణ్ సంఘటనా స్థలానికి వెళ్లి చంద్రాయపాలెం గిరిజనులను సదరు భూములోంచి వెనక్కు పంపించి తరువాత బుగ్గపాడు గిరిజనులతో మాట్లాడుతుండగా వాగ్వాదం తలెత్తింది. ఈ క్రమంలో వారు సీఐపై దాడి చేశారు. అయితే గిరిజన మహిళల పట్ల సీఐ దురుసుగా ప్రవర్తించారని, మహిళలు ఆయన్ను అడ్డుకున్నారే తప్ప దాడిచేయలేదని బుగ్గపాడు గిరిజనులు చెప్పారు. కాగా, దాడి అనంతరం కల్లూరు ఏసీపీ రఘు ఆధ్వర్యంలో సత్తుపల్లి సబ్ డివిజన్ పోలీసులు బుగ్గపాడు చేరుకొని సీఐపై దాడిచేసిన గిరిజనులను అదుపులోకి తీసుకుని సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు లాఠీఛార్జీ చేయడంతో నాగమణి అనే మహిళ తీవ్రంగా గాయపడింది.

రాజ్యాంగం మేరకు గవర్నర్లు నడుచుకోవాలి

- పంజాబ్, మహారాష్ట్రల్లో గవర్నర్ల చర్యలు వారి పరిధికి మించినవి
- అందుకే వారి నిర్ణయాలపై కోర్టుల్లో కేసులు నమోదవుతున్నాయి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న
- నోట్లరద్దుతో నల్లధనం తెల్లధనంగా మారిందన్న జడ్జి



సదస్సులో ప్రసంగిస్తున్న జస్టిస్ నాగరత్న

హైదరాబాద్, మార్చి 31: గవర్నర్లు రాజ్యాంగం ప్రకారం పని చేయాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న పేర్కొన్నారు. గవర్నర్లకు ఏం చేయాలి? ఏం చేయొద్దు? అని చెప్పటం ఇబ్బందికరమైన విషయమని, అయినప్పటికీ, వారికి ఆ సూచన చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా వాటిని పెండింగులో పెడుతున్న దృష్టాంతాల నేపథ్యంలో జస్టిస్ నాగరత్న ఈ వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు పంజాబ్ గవర్నర్‌కు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య నడిచిన కేసును ఉదహరించారు. శనివారం నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాలో నిర్వహించిన 'కోర్టులు-రాజ్యాంగం' ఐదవ సదస్సులో జస్టిస్ నాగరత్న కీలక ప్రసంగం చేశారు. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం సంక్షోభాన్ని ఎదుర్కొన్న సందర్భంగా ఆ రాష్ట్ర గవర్నర్ వ్యవహరించిన తీరును ప్రస్తావించారు. మహారాష్ట్ర అసెంబ్లీలో విశ్వాసపరీక్షకు గవర్నర్ నాడు ఆదేశించాల్సిన పరిస్థితులు లేవని, ఇది కూడా గవర్నర్లు తమ పరిధి దాటి వ్యవహరించిన ఘట్టాలకు ఒక నిదర్శనమన్నారు. 'ఇది ఆరోగ్యకర పరిణామం కాదు. గవర్నర్ల చర్యలను సవాల్ చేస్తూ కోర్టుల్లో కేసులు నమోదవుతున్నాయి' అని పేర్కొన్నారు. గవర్నర్ పోస్టు కీలకమైన రాజ్యాంగబద్ధ పదవి అని, గవర్నర్లు రాజ్యాంగం ప్రకారం విధులు నిర్వహించాలని జస్టిస్ నాగరత్న పిలుపునిచ్చారు. తమిళనాడు మంత్రివర్గంలోకి డీఎంకే నేత కే పొన్ముడిని తిరిగి తీసుకోవటానికి ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి నిరాకరించటంపై సుప్రీంకోర్టు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేయటం, దీంతో గవర్నర్ ఆమోదం తెలపటం తెలిసిన విషయమే. ఈ నేపథ్యంలోనే జస్టిస్ నాగరత్న ఈ అంశంపై మాట్లాడారు. మరోవైపు, 2016లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన నోట్లరద్దుపైనా న్యాయమూర్తి స్పందించారు. నల్లధనాన్ని అరికట్టే లక్ష్యంతో రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేశామని ప్రకటించినప్పటికీ, నల్లధనం తెల్లధనంగా మారేందుకు ఈ నిర్ణయం దోహదపడిందని.. 98 శాతం నోట్లు బ్యాంకుల్లోకి వచ్చాయని గుర్తు చేశారు. అందుకే ఈ అంశంపై తీర్పు ఇచ్చినప్పుడు నోట్లరద్దు నిర్ణయాన్ని తాను వ్యతిరేకించానని తెలిపారు. కేంద్రం నోట్లరద్దు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తులు సమర్థించగా, ఒకే ఒక్క న్యాయమూర్తి (జస్టిస్ నాగరత్న) వ్యతిరేకించారు. దీనిపై తాజాగా స్పందిస్తూ.. 'నోట్లరద్దు నిర్ణయం తీసుకోవటానికి ముందు నిర్దేశిత నిబంధనలను అనుసరిస్తూ ఎటువంటి ప్రక్రియను పాటించలేదు. ఎంత గోప్యతతో, హడావిడిగా ఆ నిర్ణయం తీసుకున్నారంటే నాటి కేంద్ర ఆర్థికమంత్రికి కూడా దాని గురించి తెలియదని కొందరన్నారు. రాత్రికి ప్రకటించారు. పొద్దున అమల్లోకి ఇచ్చింది. నిజంగానే మన దేశంలో కాగితపు కరెన్సీ బదులు ప్లాస్టిక్ కరెన్సీ తీసుకురావాలనుకుంటే నోట్లరద్దు అందుకు ఉపయోగపడజాలదు' అని జస్టిస్ నాగరత్న స్పష్టం చేశారు. ఈ సదస్సులో నేపాల్, పాకిస్థాన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో పాటు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, నల్సార్ చాన్స్‌లర్ జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అయోధ్యకు నేరుగా విమానాలు



హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరామచంద్రుడి దర్శనార్థం హైదరాబాద్ నుంచి నేరుగా విమాన సౌకర్యం అందుబాటులోకి రానుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయని వివరించారు. వారంలో మూడు రోజులు– మంగళ, గురు, శని వారాలు ఈ విమానాల సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. "అయోధ్యకు నేరుగా విమాన సౌకర్యం కల్పించాలని ఫిబ్రవరి 26న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు లేఖ రాశాను. ఆయన సానుకూలంగా స్పందించి, ఆ సేవలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు" అని కిషన్‌రెడ్డి వివరించారు. కాగా.. హైదరాబాద్ నుంచి అయోధ్యకు వెళ్లాలంటే.. గతంలో కనెక్టింగ్ ఫ్లైట్స్ మాత్రమే అందుబాటులో ఉండేవి. దీని వల్ల ధరాభారం ఎక్కువగా ఉండేది. రెండు వైపులా ప్రయాణానికి కనీసం రూ. 21 వేలు చెల్లించాల్సి వచ్చేది. పైగా.. కనెక్టింగ్ ఫ్లైట్ స్టాప్, లేఓవర్(సంబంధిత విమానాశ్రయంలో కనెక్టింగ్ ఫ్లైట్ కోసం ఎదురు చూసే సమయం) కలుపుకొని.. హైదరాబాద్ నుంచి అయోధ్యకు చేరేందుకు కనీసం మూడున్నర గంటల సమయం పట్టేది. గరిష్ఠంగా ఈ సమయం 10 గంటలకు పైగా ఉండేది. నేరుగా విమానాలు రావడం వల్ల రెండువైపులా ప్రయాణానికి కనిష్ఠంగా రూ.14 వేల మేర చార్జీలు అవుతాయి. రెండు గంటల్లో అయోధ్య విమానాశ్రయానికి చేరుకోవచ్చు.

డిజిటల్ ఇండియా ట్రస్ట్ ఏజెన్సీతో అక్రమ రుణ యాప్‌లకు చెక్

న్యూఢిల్లీ, మార్చి 31: సైబర్ మోసాలు నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో వాటికి అడ్డుకట్టవేసేందుకు ఆర్బీఐ ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ రుణ యాప్‌లను నిలువరించేందుకుగాను డిజిటల్ ఇండియా ట్రస్ట్ ఏజెన్సీ (డిజిట)ని ఏర్పాటు చేయాలనుకుంటోంది. ఈ ప్రతిపాదిత ఏజెన్సీ డిజిటల్ రుణ యాప్‌ల వెరిఫికేషన్‌కు దోహదపడుతుంది. అలాగే ధ్రువీకరించిన యాప్‌లకు సంబంధించి ఒక పబ్లిక్ రిజిస్టర్‌ను కూడా నిర్వహించనున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు పేర్కొన్నాయి. 'వెరిఫైడ్' అన్న డిజిట సిగ్నేచర్‌లేని యాప్‌లను అనధికారికంగా పరిగణించనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. డిజిటల్ రంగంలో ఆర్థికపరమైన నేరాలపై పోరాటానికి ఇది ఒక కీలకమైన చెక్ పాయింట్‌గా ఉంటుందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. 442 ప్రత్యేక డిజిటల్ రుణ వితరణ యాప్‌ల జాబితాను ఐటీ మంత్రిత్వ శాఖకు ఆర్బీఐ పంపింది. మరోవైపు గూగుల్ 2022 సెప్టెంబరు నుంచి 2023 ఆగస్టు వరకు తన యాప్ స్టోర్ నుంచి 2,200కు పైగా డిజిటల్ రుణ యాప్ (డీఎల్‌ఏ)లను తొలగించింది.

కేరళ మంత్రి రాజీవ్ వైఖరిపై కర్ణాటక ఆగ్రహం

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో తాగునీటి సమస్య నెలకొన్న క్రమంలో కేరళ పరిశ్రమలశాఖ మంత్రి రాజీవ్ ఐటీ కంపెనీలను ఆహ్వానించడంపై కర్ణాటక పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ విరుచుకుపడ్డారు. ఆదివారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. ఎండాకాలం, కరువు రెండూ కలసి వచ్చాయని, ఈ కారణంతో బెంగళూరులో తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. నగర శివారు ప్రాంతాల్లో బోరుబావులపై ఆధారపడ్డారని, ప్రస్తుతం అక్కడే తాగునీటి సమస్య ఉత్పన్నమైందని తెలిపారు. వర్షాభావంతో దేశవ్యాప్తంగా నీటి ఎద్దడి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులపాటు సమస్య తలెత్తితే తమ రాష్ట్రానికి పరిశ్రమలతో రండి అని కేరళ ప్రభుత్వం ఎలా ఆహ్వానిస్తుందని ప్రశ్నించారు. ఇది ఆరోగ్యకరమైన పరిణామం కాదని, సమాఖ్య వ్యవస్థలో పరస్పర సహకారం ఉండాలని, ఇలా అవకాశవాదం మంచిదికాదని హితవు పలికారు. కేరళలో ఎక్కడా తాగునీటి సమస్య లేదా..? అని ప్రశ్నించారు.

తెలుగు రాష్ట్రాల్లో మాకు మంచి ఫలితాలు: గడ్కరీ

నాగపూర్, మార్చి 31: లోక్‌సభ ఎన్నికల్లో ఈ సారి సొంతంగా 370 స్థానాలు సాధిస్తామని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనకు దక్షిణ భారతం తమకు తోడ్పడుతుందని ఆదివారమిక్కడ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. నాగపూర్ నుంచి వరుసగా మూడోసారి బరిలోకి దిగిన ఆయన... శనివారం మండు టెండలో 4 గంటలపాటు భారీ రోడ్‌షో నిర్వహించారు. ఎన్డీయే కచ్చితంగా 400 సీట్లను కైవసం చేసుకుంటుందనడంలో సందేహమే లేదని తెలిపారు. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను తమ ప్రభుత్వం అస్త్రాలుగా వాడుతోందన్న ఆరోపణలను తోసిపుచ్చారు. "తమిళనాడు, కేరళ, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మేం బాగా కష్టపడి పనిచేశాం. ఆంధ్ర, తెలంగాణల్లో ఈ సారి మంచి ఫలితాలు వస్తాయి' అని వివరించారు. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీకి అధిక విరాళాలు అందడంపై వస్తున్న విమర్శలను తోసిపుచ్చారు. బీజేపీ అధికారపక్షం కాబట్టి ఎక్కువ విరాళాలు రావడం సహజమేనన్నారు.

మద్యం కుంభకోణం డబ్బును ఆప్ గోవా ఎన్నికల్లో వాడింది: ఈడీ

న్యూఢిల్లీ, మార్చి 31 : ఢిల్లీ మద్యం కుంభకోణం ద్వారా వచ్చిన ముడుపుల్లో రూ.45 కోట్లను ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) 2022 గోవా ఎన్నికల ప్రచారానికి వినియోగించిందని ఈడీ స్పష్టం చేసింది. ఈ నగదును హవాలా రూపంలో గోవా చేర్చారని తెలిపింది. ఐటీ, సీబీఐ వేర్వేరుగా చేసిన దర్యాప్తుల్లోనూ ఈ విషయం నిర్ధారణ అయిందని పీఎంఎల్‌ఏ ప్రత్యేక న్యాయస్థానానికి సమర్పించిన పత్రాల్లో ఈడీ పేర్కొంది. ఈ దర్యాప్తులో భాగంగా పెద్ద సంఖ్యలో హవాలా నిర్వాహకులు, అంగాడియా(హవాలా దళారుల్లో మరో వ్యవస్థ)లను విచారించామని ఈడీ వివరించింది. కాగా, 2021-22లో గోవా ఎన్నికల్లో ప్రచార కార్యక్రమాల నిర్వహణకు చారియట్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థతో ఆప్ ఒప్పందం చేసుకుంది. ఆ సంస్థకు చెందిన వారిని విచారణ చేయగా చెల్లింపులు ఎక్కువగా నగదు రూపంలో జరిగినట్టు వెల్లడైందని ఈడీ కోర్టుకు తెలిపింది.

మ్యాచ్ ఫిక్సింగ్ మోదీని గద్దె దింపుదాం!



ప్రజాస్వామ్య పరిరక్షణ సభలో కల్పన, సునీత, సోనియా గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

ఐదారుగురు బడా వ్యక్తుల చేతుల్లోకి వెళతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం అనేది ప్రజల గొంతుక అని, ఒకవేళ రాజ్యాంగం ఖతమైతే దేశం వేర్వేరు రాజ్యాలుగా మరోసారి ముక్కలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ల అరెస్టును నిరసిస్తూ విపక్ష 'ఇండియా కూటమి' ఆదివారం ఢిల్లీలోని రామ్ లీలా మైదాన్‌లో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షణ సభ పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభలో ఖర్గే, సోనియా, రాహుల్, శరద్ పవార్, అఖిలేశ్, సీతారాం ఏచూరి సహా 27 విపక్ష పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ప్రసంగించారు. "ఇవేం ఎన్నికలు? డబ్బు, అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వాలను కూల్చివేస్తున్నారు. రాజకీయ నేతలను బెదిరిస్తున్నారు. సోరెన్, కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. ముగ్గురు-నలుగురు బిలియనీర్లను అడ్డం పెట్టుకొని ఎన్నికల్లో 'మ్యాచ్ ఫిక్సింగ్' ద్వారా గెలవాలని మోదీ అనుకుంటున్నారు" అని ఆరోపించారు. పోలీసులు, సీబీఐ, ఈడీ బెదిరింపుల ద్వారా దేశాన్ని నడిపించగలం అని మోదీ అనుకుంటున్నారని, మీడియాను కూడా కొనుగోలు చేశారని కానీ ప్రపంచంలో ఏ శక్తీ భారత ప్రజల గొంతు నొక్కలేదని హెచ్చరించారు. బీజేపీ 400 సీట్లు గెలుస్తామని చెబుతోందని.. 'మ్యాచ్ ఫిక్సింగ్' లేకుండా.. మీడియాను కొనకుండా, ఈవీఎంలను వాడకుంటే కమలం పార్టీ కనీసం 180 స్థానాలను కూడా గెలవలేదని పేర్కొన్నారు.

ఐక్యత లేకపోతే విజయం సాధించలేం

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కాలకూట విషం లాంటివని, వారు దేశాన్ని ధ్వంసం చేశారని, మరింత విధ్వంసం సృష్టించేందుకు ఇక ఎంతమాత్రం అనుమతించరాదని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా ఉంటేనే బీజేపీని ఓడించడం సాధ్యపడుతుందని, తద్విరుద్ధంగా విపక్ష పార్టీలే తమలో తాము పోట్లాడుకుంటే విజయం సాధించలేమని హెచ్చరించారు. అధికారం కోల్పోతామన్న భయంతో బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష నేతలంతా ఢిల్లీలో ఉండటం చూసి.. ప్రధాని ఢిల్లీ విడిచి వెళ్లారని ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్ ఎద్దేవా చేశారు. ఈడీ, సీబీఐ, ఐటీని ప్రయోగించి చందాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తనపైనే కాకుండా తన తండ్రి, తల్లి, చెల్లెళ్లపైనా కేసులు మోపారని, అయితే తాము సింహాలమని, ఎవ్వరికీ భయపడబోమని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ పేర్కొన్నారు. దేశంలో ఒకే వ్యక్తి చేతిలో ఒకే పార్టీ ప్రభుత్వం ఉండటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, సంకీర్ణ ప్రభుత్వమే దేశానికి సరైందని ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలమని పీడీపీ నేత ముఫ్తీ చెప్పారు. మత తత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడాలని సీపీఎం నేత సీతారాం ఏచూరి అన్నారు.

నియంతృత్వం పోవాలి

కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ అరెస్టులపై విపక్ష పార్టీల నేతలు తీవ్ర నిరసన తెలిపారు. కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్‌లు కూడా సభలో ప్రసంగించారు. భారత మాత గాయలతో బాధపడుతోందని, ఈ నియంతృత్వం పోవాలని సునీతా కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే ఇండియా కూటమి ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందంటూ కేజ్రీవాల్ పంపిన సందేశాన్ని ఆమె చదివి వినిపించారు.

రాముడి నుంచి మోదీ తెలుసుకోవాలి

బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా ఎన్ని అడ్డంకులు కల్పించినా ఇండియా కూటమి దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాటం చేస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ అన్నారు. తాను చిన్నప్పటి నుంచీ రామ లీలా మైదాన్‌కు వచ్చి రావణుడిని దగ్ధం చేస్తుంటే చూసేదాన్ని అని గుర్తు చేసుకున్నారు. అరెస్టయిన నేతలను విడిచిపెట్టి, నిష్పాక్షిక విచారణ జరిపించాలనే ప్రతిపక్ష కూటమి డిమాండ్లను ఆమె చదివి వినిపించారు.

ఇండియా కూటమి తరఫున ఎన్నికల కమిషన్‌కు ప్రియాంకా గాంధీ చేసిన ఐదు డిమాండ్లు ఇవే!

- లోక్‌సభ ఎన్నికల్లో పరిస్థితులు ప్రభుత్వానికి, విపక్షాలకు సమాన అవకాశాలు ఉండేలా ఎన్నికల కమిషన్ భరోసా ఇవ్వాలి.
- ఎన్నికలను ప్రభావితం చేసేందుకు విపక్షాలపై కేంద్రం ప్రయోగిస్తున్న ఐటీ, సీబీఐ, ఈడీ అస్త్రాలను ఈసీ ఆపివేయాలి.
- హేమంత్ సోరెన్, కేజ్రీవాల్‌ను తక్షణమే విడుదల చేయాలి.
- విపక్షాల ఆర్థికంగా చిదిమివేసే పరిస్థితులను ఈసీ నిరోధించాలి.
- ఎలక్టోరల్ బాండ్ల ద్వారా దొడ్డిదారిన బీజేపీ నిధులు సమకూర్చుకున్న వ్యవహారంపై దర్యాప్తునకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ ఏర్పాటు చేయాలి.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	42.4	17.9
నిజామాబాద్	41.5	26.8
హైదరాబాద్	41.4	21.7
నల్లగొండ	40.5	24.4
ఆదిలాబాద్	40.3	25.2
వరంగల్	38.0	22.5

కస్టడీకా? తిహాడ్ జైలుకా?

నేడు రౌస్ అవెన్యూ కోర్టు ముందుకు కేజ్రీ

న్యూఢిల్లీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ ఈడీ కస్టడీ ముగియడంతో సోమవారం ఆయన్ను కోర్టులో హాజరుపర్చనున్నారు. ఈ క్రమంలో రౌస్ అవెన్యూ కోర్టు తీసుకోబోయే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కేజ్రీవాల్‌ను మరింతగా ప్రశ్నించేందుకు ఈడీ కస్టడీని పొడిగించాలని కోరుతుందా? లేక జ్యుడీషియల్ రిమాండ్ విధించాలని విజ్ఞప్తి చేస్తుందా? అనే విషయంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇదే కేసులో అరెస్టయిన ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా తిహాడ్ జైల్లోనే ఉండగా.. ఇటీవలే బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను కూడా అదే జైలుకు తరలించారు. కవితను తొలుత అరెస్టు చేసినప్పుడు ఈడీ 10 రోజుల కస్టడీకి కోరగా.. కోర్టు 7 రోజులకు అనుమతి ఇచ్చింది. ఆ తర్వాత మళ్లీ 5 రోజుల కస్టడీ కావాలని కోరగా, 3 రోజులకు అనుమతిచ్చింది. కేజ్రీవాల్ విషయంలోనూ ఇదే జరిగింది. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ తిహాడ్ జైలుకెళతారా? ఈడీ కస్టడీ కోరుతుందా? అన్నది చర్చనీయాంశమైంది. కాగా, తన అరెస్టు అక్రమమని, మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు నిరాకరించింది. అలాగే, కేజ్రీవాల్ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ఈడీకి నోటీసులు జారీ చేసింది. దీనిపై ఏప్రిల్ 3న విచారణ జరగనుంది.

ఏప్రిల్ 5న కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

న్యూఢిల్లీ, మార్చి 31: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఏప్రిల్ 5న విడుదల చేయనుంది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... మార్చి 16న తమ పార్టీ 5 న్యాయాలు, 25 గ్యారెంటీలను(పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారెంటీస్) విడుదల చేసిందన్నారు. ఇంటింటికీ గ్యారెంటీ పేరిట ఏప్రిల్ 3 నుంచి 8 కోట్ల గ్యారెంటీ కార్డులను దేశ వ్యాప్తంగా పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 5న మేనిఫెస్టో విడుదల చేస్తామన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజలతో సంప్రదించి, అలాగే ఈ మెయిల్ ద్వారా, 'ఆవాజ్ భారత్ కి' వెబ్‌సైట్ ద్వారా అందిన వేలాది సూచనలను క్రోడీకరించి కాంగ్రెస్ మేనిఫెస్టోని రూపొందించినట్లు జైరాం రమేష్ చెప్పారు. ప్రజల మనోభావాలకు తమ మేనిఫెస్టో ప్రతిబింబం అని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌కు 'పన్ను' పోటు!

» రూ.3,567 కోట్లకు చేరిన బకాయిలు..సుప్రీంలో కేసు

న్యూఢిల్లీ, మార్చి 31: కాంగ్రెస్ పార్టీని 'పన్ను'పోటు వెంటాడుతోంది. రాజకీయ పార్టీల నిధులకు ఆదాయపన్ను మినహాయింపును తొలగించినప్పటి నుంచి ఆ పార్టీ పన్ను బకాయిలు పెరుగుతూ వస్తున్నాయి. 2014-15లో రూ. 663 కోట్లు, మరో 2015-16లో రూ.664 కోట్లు, 2016-17లో ఇంకో రూ.417 కోట్ల పన్నును కలిపి.. బకాయిలు ఆ మూడు ఆర్థిక సంవత్సరాలకు రూ.1,745 కోట్లకు చేరుకుంది. తాజాగా ఆ పార్టీ చెల్లించాల్సిన పన్ను బకాయిల మొత్తం రూ.3,567 కోట్లుగా ఐటీశాఖ లెక్కగట్టింది. గతంలో కాంగ్రెస్ పార్టీ ఖాతా నుంచి ఐటీ అధికారులు రూ.135కోట్లను విత్‌డ్రా చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ ఆదాయ పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్, హైకోర్టులను ఆశ్రయించినా.. చుక్కెదురైంది. దాంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రానుంది. మరోవైపు బీజేపీ సర్కారు విపక్ష పార్టీలపై ట్యాక్స్ టెర్రరిజానికి పాల్పడుతోందని కాంగ్రెస్ మండిపడింది.

200 సీట్లైనా గెలవండి.. చూద్దాం

» బీజేపీకి మమతాబెనర్జీ సవాల్



కృష్ణానగర్(పశ్చిమ బెంగాల్), మార్చి 31: లోక్‌సభ ఎన్నికల్లో 400లకు పైగా సీట్లు గెలుస్తామని చెబుతున్న బీజేపీ కనీసం 200 సీట్లైనా గెలిచి చూపాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ సవాల్ విసిరారు. ఆదివారం కృష్ణానగర్ ప్రాంతంలో టీఎంసీ అభ్యర్థి మహువా మొయిత్రా తరఫున ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బీజేపీని జుమ్లా పార్టీ అని అన్నారు. "2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ 200 సీట్లు గెలుస్తామని బీజేపీ గొప్పలు చెప్పుకుంది. కానీ 77 సీట్లకే పరిమితమయ్యింది" అని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలును అనుమతించబోమని మమతాబెనర్జీ స్పష్టం చేశారు. సీఏఏకు దరఖాస్తు చేసుకుంటే 5 ఏళ్ల విదేశీయులుగా మారుతారని, కాబట్టి ఎవరూ దరఖాస్తు చేసుకోవద్దని ఆమె కోరారు. రాష్ట్రంలో సీపీఐ(ఎం), కాంగ్రెస్‌లు బీజేపీ కోసం పనిచేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో వామపక్ష-కాంగ్రెస్-ఐఎస్‌ఎఫ్ కూటమి అభ్యర్థులకు ఓటు వెయ్యొద్దని, వారికి ఓటేస్తే బీజేపీకి వేసినట్టేనని మమతాబెనర్జీ చెప్పారు.

కీలక నిర్ణయాలన్నీ తొలి 100 రోజుల్లోనే

(మొదటి పేజీ తరువాయి)

రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తోందని తెలిపారు. మొదటి 100 రోజుల్లో ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవాలనే దానిపై శరవేగంగా పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. దేశ ప్రజలు గత పదేళ్లలో ట్రైలర్‌ను మాత్రమే చూశారని, అసలు అభివృద్ధి ముందుందని చెప్పారు. 2024 ఎన్నికల తీర్పుతో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించేందుకు దోహదం చేయనుందన్నారు. ఈ సందర్భంగా మేరట్‌లో నిర్వహించిన మెగా ర్యాలీలో ప్రసంగించిన ప్రధాని విపక్షాలపై విరుచుకుపడ్డారు. అవినీతికి వ్యతిరేకంగా తాము తీసుకుంటున్న చర్యలతో కొందరు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల కొందరు ఇండియా కూటమి నేతలను కేంద్ర దర్యాప్తు సంస్థలు అరెస్టు చేయడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికలు అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఎన్డీయేకు, అవినీతిపరులను రక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్న మరో వర్గానికి మధ్య సాగుతున్నాయన్నారు. 'భ్రష్టాచార్ హఠావో' అని తాము పిలుపునిస్తుంటే వారు మాత్రం 'భ్రష్టాచారీ బచావో' అని అంటున్నాయని దుయ్యబట్టారు. గత పదేళ్లలో తాము తీసుకున్న చర్యల ఫలితంగానే నేడు అవినీతిపరులు జైల్లో ఉన్నారని తెలిపారు. అవినీతిపరులపై విచారణ జరపడమే కాకుండా ప్రజల నుంచి వారు దోచుకున్న సొమ్మును తిరిగి ప్రజలకే ఇప్పిస్తున్నామని వెల్లడించారు. పేదరికంలో జీవించిన తనకు ప్రతి పేదవాడి బాధ, కష్టాలు తెలుసని, అందుకే పేదల ప్రతి సమస్యను పరిష్కరించేందుకు పథకాలు రూపొందించినట్లు చెప్పారు. చౌదరి చరణ్‌సింగ్ వంటి విప్లవ వీరులను దేశానికి అందించిన విప్లవాల పురిటిగడ్డ మేరట్ అని మోదీ కొనియాడారు. రైతులను ద్వేషించే ఇండియా కూటమి చౌదరి చరణ్‌సింగ్‌కు సరైన గౌరవం కూడా ఇవ్వలేదని విమర్శించారు. పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా విపక్ష నేతలు ఏం చేశారో దేశం మొత్తం చూసిందన్నారు. భారతరత్న అవార్డు గురించి మాట్లాడేందుకు మా సోదరుడు జయంత్ చౌధరి లేచినప్పుడు అడ్డుకోవడానికి ప్రయత్నించడంతో పాటు ఆయన్ను కించపరిచేందుకు కూడా యత్నించారని మోదీ గుర్తుచేశారు.



మేరట్ ర్యాలీలో యూపీ సీఎం యోగి, ప్రధాని మోదీ

ఎన్నికల బాండ్ల రద్దుపై విపక్షాలు పశ్చాత్తాప పడతాయ్

న్యూఢిల్లీ, మార్చి 31: తమ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్నికల బాండ్ల విధానాన్ని మోదీ సమర్థించుకున్నారు. ఈ బాండ్లే పెద్ద కుంభకోణమని విపక్షాలు విమర్శిస్తుండగా మోదీ మాత్రం వీటి ద్వారా పారదర్శకత పెరిగిందని అన్నారు. 2014కు ముందు ఎన్నికల్లో ఎంత ఖర్చు పెట్టేవారో ఎవరికీ తెలిసేది కాదని, ఇప్పుడు ఎన్నికల బాండ్ల పుణ్యమా అని అన్ని వివరాలు అందుబాటులో ఉంటున్నాయని చెప్పారు. వీటిని రద్దు చేయించిన విపక్షాలు అనంతర కాలంలో పశ్చాత్తాపడుతాయన్నారు. ఆదివారం ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

కచ్చాతివుపై రాజకీయ దుమారం!

న్యూఢిల్లీ, మార్చి 31: పాక్ జలసంధిలోని కచ్చాతివు ద్వీపంపై రాజకీయ దుమారం చెలరేగింది. ఆ ద్వీపాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రీలంకకు ధారాదత్తం చేసేసిందని ప్రధాని మోదీ ఆక్షేపించారు. దీనిపై ఒక మీడియా కథనాన్ని ఉటంకిస్తూ ఆదివారం 'ఎక్స్'లో మోదీ స్పందించారు. 'కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా కచ్చాతివును వదులుకున్న కొత్త వాస్తవాలు కళ్లు తెరిపించాయి' అని మోదీ పేర్కొన్నారు.తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఆర్టీఐ కింద దరఖాస్తు ద్వారా సేకరించిన ఈ సమాచారాన్ని ఒక ఆంగ్ల దినపత్రిక ఆదివారం ప్రచురించింది. కచ్చాతివును శ్రీలంకకు అప్పగించడంలో కాంగ్రెస్, డీఎంకే ఎలా కుమ్మక్కయ్యాయో ఆ ఆంగ్ల పత్రిక స్పష్టం చేసిందని అన్నామలై 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆ దీవిని పొరుగుదేశానికి అప్పగిస్తూ 1974లో ఇందిరాగాంధీ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. నాడు కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం వల్లే ఇప్పుడు తమిళనాడు జాలర్లు తమ రాష్ట్రానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ దీవి వద్ద చేపల వేటకు వెళ్లి శ్రీలంక నేవీ చేతిలో అరెస్టవుతున్నారని బీజేపీ ఆక్షేపించింది. అయితే, కచ్చాతివును వెనక్కి తీసుకునేందుకు గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వం ఎందుకు ప్రయత్నించలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిలదీశారు. ఎన్నికల ముందు సున్నితమైన అంశాలను లేవనెత్తడం మోదీలోని నిరాశను తెలియజేస్తోందన్నారు. స్నేహపూర్వక ఒప్పందంలో భాగంగానే శ్రీలంకకు కచ్చాతివును అప్పగించినట్టు 'ఎక్స్'లో తెలిపారు.

ఏకగ్రీవంగా.. అధ్యక్షా..!

» అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 10 సీట్లలో ఎదురే లేని బీజేపీ నేతలు

» పెమాఖండు ఏకగ్రీవం.. ఇది మూడోసారి



పెమాఖండుకు బీజేపీ నేత అశోక్ సింఘాల్ శుభాకాంక్షలు

ప్రజాస్వామ్యానికి అసలైన అర్థం ఎన్నికలే! ఇద్దరు లేదా అంతకు మించి నేతలు బరిలో దిగాలి. పోటీ పడాలి. ప్రజలు వారిలో ఎవరిని ఎన్నుకుంటే వారు గెలవాలి. అలా కాకుండా.. అసలు పోటీయే లేకుండా.. ఒక్కరే నామినేషన్ వేసేసి, ఎన్నికే జరగకుండా గెలిచేస్తే అందులో ఏం మజా ఉంటుంది? అసలు అలా జరుగుతుందా? అంటారా..! జరుగుతుంది. జరుగుతోంది. తాజాగా మూడ్రోజుల క్రితమే అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగింది కూడా. ఆంధ్రప్రదేశ్‌లోలాగానే అరుణాచల్‌లో కూడా 2024 ఎంపీ ఎన్నికలతోపాటు ఆ రాష్ట్ర శాసనసభకూ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ రాష్ట్ర అసెంబ్లీలో మొత్తం అరవై సీట్లు ఉండగా.. అందులో ఆరోవంతు.. అనగా 10 సీట్లకు అసలు పోటీయే లేకుండా.. నామినేషన్‌తోనే బీజేపీ నేతలు గెలిచేశారు. ఆ పదిమందిలో అరుణాచల్ ప్రస్తుత సీఎం పెమా ఖండు, డిప్యూటీ సీఎం చౌనామీన్ కూడా ఉండడం విశేషం. బీజేపీకే చెందిన మరో అభ్యర్థి జిక్కే టాకో అయితే ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఇది వరుసగా రెండోసారి. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ కేవలం 34 సీట్లలోనే పోటీ చేయడం గమనార్హం.

ఏకగ్రీవాలు.. కొత్త కాదు..

స్థానిక సంస్థల ఎన్నికల్లో, రాజ్యసభ ఎన్నికల్లో ఏకగ్రీవాలు సాధారణమేగానీ.. ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు జరిగే ఎన్నికల్లో ఏకగ్రీవాలు అరుదు. కానీ, కొత్త విషయమేమీ కాదు. ఎవరిదాకానో ఎందుకు.. పెమా ఖండునే 2011లో, 2014లో ఇలాగే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2014లో అయితే అరుణాచల్‌లో ఏకంగా 11 సీట్లు ఏకగ్రీవమయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి చూస్తే.. 1952లో దేశవ్యాప్తంగా 298 మంది ఎమ్మెల్యేలు, 28 మంది ఎంపీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాగాలాండ్‌లో ఇప్పటిదాకా అన్ని ఎన్నికల్లో కలిపి ఎలాంటి పోటీ లేకుండా ఎన్నికైన ఎమ్మెల్యే సంఖ్య 77. తర్వాతి స్థానంలో 63 మంది ఎమ్మెల్యేలతో జమ్ముకశ్మీర్ ఉండగా, అరుణాచల్ ప్రదేశ్ 40 మంది ఏకగ్రీవ ఎమ్మెల్యేలతో మూడోస్థానంలో నిలిచింది. ఎంపీ సీట్ల విషయానికి వస్తే.. 1952 నుంచి ఇప్పటిదాకా జమ్ముకశ్మీర్‌లో నలుగురు ఎంపీలు పోటీ లేకుండా గెలిచారు. ఏపీ, అసోం, ఒడిశా, తమిళనాడు, తెలంగాణ, యూపీల్లో ఒకరికి మించి ఎంపీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పార్టీలు.. నేతల లెక్క...

ఏకగ్రీవ ఎన్నికల విషయంలో పార్టీల పరంగా చూస్తే.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా కాంగ్రెస్ పార్టీ నుంచి అత్యధికంగా 194 మంది ఎమ్మెల్యేలు పోటీ లేకుండా నెగ్గారు. అలాంటి 34 మంది ఎమ్మెల్యేలతో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ రెండోస్థానంలో.. 15 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ మూడో స్థానంలో నిలిచాయి. 29 మంది స్వతంత్ర ఎమ్మెల్యేలు ఇప్పటిదాకా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎక్కువసార్లు ఏకగ్రీవంగా ఎమ్మెల్యే అయినవారి జాబితాలో అగ్రస్థానం పెమా ఖండు (3సార్లు), జమ్ముకశ్మీర్ మాజీ సీఎం సయ్యద్ మీర్ ఖాసిం (3సార్లు). పెమా ఖండు తండ్రి దోర్జీ ఖండు కూడా 1990లో, 2009లో అదే సీటులో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక లోక్‌సభ ఎన్నికల విషయానికి వస్తే.. కాంగ్రెస్ పార్టీ నుంచి 20 మంది (1952 నుంచి ఇప్పటిదాకా) ఎంపీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇద్దరేసి ఎంపీలతో నేషనల్ కాన్ఫరెన్స్, సమాజ్‌వాదీ పార్టీ తర్వాతి స్థానంలో నిలిచాయి. ఒక స్వతంత్ర ఎంపీ కూడా ఎలాంటి పోటీ లేకుండా గెలవడం గమనార్హం. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఉపప్రధాని వైబీ చవాన్ నాసిక్ నుంచి, నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా శ్రీనగర్ నుంచి, కేంద్ర మాజీ మంత్రి టీటీ కృష్ణమాచారి (తిరుచెందూర్), కేంద్ర మాజీ మంత్రి పీఎం సయీద్ (లక్షద్వీప్), కేఎల్ రావు (విజయవాడ).. తదితరులు ఎలాంటి పోటీ లేకుండానే ఎంపీలయ్యారు. - సెంట్రల్ డెస్క్

ఆడ్వాణీకి భారతరత్న ప్రదానం

న్యూఢిల్లీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అగ్ర నేత, మాజీ ఉప ప్రధాని ఆడ్వాణీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను ప్రదానం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం స్వయంగా ఆడ్వాణీ ఇంటికి వెళ్లి అవార్డును అందజేశారు. శనివారం రాష్ట్రపతి భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. అయితే.. వయోభారం, అనారోగ్య కారణాలతో ఆడ్వాణీ హాజరు కాలేదు. దీంతో రాష్ట్రపతే స్వయంగా ఆడ్వాణీ ఇంటికి వెళ్లి ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్, రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో పాటు ఆడ్వాణీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దేశ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే చెరగని అధ్యాయం ఆడ్వాణీ అని మోదీ ఈ సందర్భంగా కొనియాడారు. దేశ అభ్యున్నతికి, పురోగమనానికి ఆడ్వాణీ చేసిన సేవలకు భారతరత్న ఒక గుర్తింపని తెలిపారు. తన గురువుకు దేశ అత్యున్నత పౌరపురస్కారం ప్రదానం చేయడం, ఆ వేడుకకు తాను హాజరు కావడం తనకెంతో గౌరవంగా ఉందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

ఆడ్వాణీ రథయాత్రతో బీజేపీకి ఖ్యాతి

1927 నవంబర్ 8వ తేదీన ప్రస్తుత పాకిస్థాన్‌లోని కరాచీలో ఆడ్వాణీ జన్మించారు. 1947లో దేశ విభజన సమయంలో భారత్‌కు ఆయన కుటుంబం తరలి వచ్చింది. కాగా, 14 ఏళ్ల వయసులోనే ఆడ్వాణీ ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరారు. 1970లో తొలిసారి ఢిల్లీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1980లో వాజపేయితో కలిసి బీజేపీని స్థాపించారు. మూడుసార్లు బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1990లో ఆడ్వాణీ చేపట్టిన రథయాత్ర ఆ పార్టీకి జాతీయ ఖ్యాతిని తీసుకొచ్చింది. ఆయన రెండుసార్లు కేంద్ర హోంమంత్రిగా పనిచేశారు. 2019 నుంచి క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

రాష్ట్రపతి నిల్చుంటే.. మోదీ కూర్చుంటారా?

ఆడ్వాణీకి భారతరత్న పురస్కారం ప్రదానం సందర్భంగా వెలువడిన ఒక ఫొటోపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సదరు ఫొటోలో ప్రధాని మోదీ, ఆడ్వాణీ కుర్చీలపై కూర్చొని ఉండగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిలబడి ఉన్నారు. దీనిని పలువురు తప్పు పడుతున్నారు. వయోభారం వల్ల ఆడ్వాణీ కూర్చోవచ్చుగానీ.. రాష్ట్రపతి నిల్చున్నప్పుడు ప్రధాని మోదీ కూర్చోవటమేమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రధాని మోదీ ఉద్దేశపూర్వకంగానే ఆదివాసీ మహిళ అయిన రాష్ట్రపతిని అవమానిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కూడా స్పందిస్తూ.. 'ప్రధాని మోదీ గారు.. ఆదివాసీ అంటే చులకనా? రాష్ట్రపతి పదవి అంటే చులకనా? లేక ప్రజాస్వామ్యం అంటేనే చులకనా?' అని ఎక్స్‌లో ప్రశ్నించింది.

రైతులను సర్కారు ఆదుకోవాలి

» ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలి: బండి సంజయ్

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు పరిహారం అందించలేదని, సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవటం లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని, తక్షణమే వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో అధికారులకు వినతి పత్రాలు అందజేస్తామని, మంగళవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ కేంద్రం వద్ద ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు రైతు దీక్ష చేపడతామని ప్రకటించారు. వడ్ల కల్లాల వద్ద బస చేసి.. రైతులు పడుతున్న బాధలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, వడ్ల కొనుగోలు కేంద్రాలను కూడా పరిశీలిస్తామని పేర్కొన్నారు. రైతు సంఘాలు, ప్రజా సంఘాలు తన దీక్షకు సంఘీభావం తెలపాలని కోరారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం కూడా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, 2-3 రోజుల్లో ప్రణాళికను వెల్లడిస్తామన్నారు. ఈ మేరకు బండి సంజయ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రైతుల పక్షాన బీజేపీ డిమాండ్లు ఇవే..

తాలు, తేమ, తరుగుతో సంబంధం లేకుండా వడ్లను పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఇందిరమ్మ రైతు భరోసా కింద రైతులతోపాటు కౌలు రైతులుకు ఎకరాకు రూ.15 వేలు, భూమి లేని వ్యవసాయ కూలీలలకు రూ.12 వేలు ఇవ్వాలి. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలి. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులతో అనుసంధానించాలి. రైతు కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. సమగ్ర పంటల బీమాను అమలు చేసి రైతులతోపాటు రైతు కూలీలు, భూమి లేని రైతులకు సైతం బీమా పథకాన్ని వర్తింపజేయాలి. కొత్త సాగు విధానంతోపాటు పంటల సమగ్ర ప్రణాళికను విడుదల చేయాలి.

కేసీఆర్.. నాటకాలు బంద్ పెట్టు: చామల

» అవినీతి కేసుల నుంచి దృష్టి మళ్లించే యత్నమే: నిరంజన్

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎండిన పంటపొలాల సందర్శన పేరుతో కేసీఆర్ ఆడుతున్న నాటకాలను బంద్ పెట్టాలని భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. 'తుంగతుర్తిలో బయ్యన్నవాగు నుంచి రుద్రమదేవి చెరువుకు కాల్వ తవ్వకం వైఎస్ హయాంలోనే 7 కిలోమీటర్లు పూర్తయింది. మరో 2 కిలోమీటర్లు తవ్వితే ఆ చెరువుకు నీళ్లందేవి. ఈ రుద్రమదేవి చెరువు.. కేసీఆర్ సందర్శించిన పంట పొలాలకు 50 మీటర్ల దూరంలోనే ఉంది. ఈ పదేళ్లలో 2 కిలోమీటర్ల కాల్వను కూడా కేసీఆర్ తవ్వలేకపోయారా?' అంటూ ఓ ప్రకటనలో మండిపడ్డారు. ఈ చెరువును రిజర్వాయర్ చేసి మూడున్నర టీఎంసీల నీళ్లు తెచ్చి సస్యశ్యామలం చేస్తామన్న కేసీఆర్.. అస్సలు పట్టించుకోనేలేదన్నారు. ఆయన పాలనంతా ఫాంహౌస్‌కే పరిమితమైందని విమర్శించారు. అవినీతి కేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సూర్యాపేట పర్యటనలో రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం కేసీఆర్ చేస్తున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆరోపించారు. కేసీఆర్ అవినీతి పాలన చరిత్ర ప్రజల కళ్ల ముందు ఉందని, ఆయన మాటలను వారు నమ్మబోరని చెప్పారు. ప్రభుత్వ ఖజానాను ఆయన ఖాళీ చేసినందునే రైతు రుణమాఫీ జాప్యమవుతోందని ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు. గోరంతను కొండంతగా చూపే ప్రయత్నం చేస్తే ప్రజలే కేసీఆర్‌కు బుద్ధి చెబుతారన్నారు. విపక్షంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్‌కు రైతులు గుర్తుకొచ్చారా అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు రైతుల ఇబ్బందులను పట్టించుకోని కేసీఆర్.. ఓడిపోగానే రాజకీయ లబ్ధి కోసం పొలం బాట పట్టారని విమర్శించారు. రైతుల పేరిట రాజకీయం మొదలు పెట్టిన కేసీఆర్‌ను ప్రజలు నమ్మబోరని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ అన్నారు. కేసీఆర్‌లాంటి అవినీతిపరుడు.. ప్రజలు, పోరాటాల గురించి మాట్లాడడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు.

కాంగ్రెస్ అసమర్థతతోనే కరువు

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. ఎవరో ఒకరిద్దరిని పార్టీలో చేర్చుకొని చిల్లర రాజకీయాలు చేయడం కాదని, రైతుల బాధలపై ప్రభుత్వం స్పందించాలని హితవు పలికారు. ప్రజల సమస్యల్ని వదిలేసి అడ్డగోలు మాటలు, గత ప్రభుత్వాన్ని బదనాం చేసే చిల్లర పనులు చేస్తున్నారని ఆరోపించారు. తాము ఎందరితోనో పోరాడామని, ఎందరినో పాతరేశామని, గద్దెనెక్కి పదేళ్లు పాలించామని చెప్పారు. ప్రజలు తమకు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారని, వారి తరఫున పోరాడుతామని అన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఈ ప్రభుత్వాన్ని వదిలేదని లేదని, వెంటాడి వేటాడుతామని హెచ్చరించారు. ఆదివారం ఆయన జనగామ జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గంలో, సూర్యాపేట జిల్లాలోని తుంగుతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం సూర్యాపేటలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "మా పాలనలో రాష్ట్రాన్ని కట్టిన ఇల్లు.. పెట్టిన పొయ్యిలా తీర్చిదిద్దాం. ఇప్పుడు పాలిస్తున్న ప్రభుత్వంలో అర్భకత్వం కనిపిస్తోంది. వంద రోజుల ఈ ప్రభుత్వ పాలనలో 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ ప్రభుత్వం నీళ్లిస్తామని హామీ ఇస్తేనే పంటలు వేసి చివరకు నీళ్లులేక పంటలు ఎండి నష్టపోతున్నామని రైతులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. రైతులు కష్టాల్లో ఉంటే కనీసం పరామర్శించి ఆదుకునే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు" అని కేసీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో దాదాపు 14, 15 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి, రైతులు గోస పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే కరువుపై స్పందించాలని, పంటలు ఎండిన రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ఈ దుస్థితి ఎందుకొచ్చింది?

గత పదేళ్లలో ఎనిమిదేళ్లపాటు తాము వ్యవసాయాన్ని స్థిరీకరించామని కేసీఆర్ తెలిపారు. రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించామని, రైతులకు అవసరమైన సందర్భంలో పెట్టుబడులకు ఉపయోగపడేలా రైతుబంధు అందించామని, 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తు అందించామని, రైతులు పండించిన


సూర్యాపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్

పంటలను 7600 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరలకు కొనిపించామని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక వందరోజుల్లో ఇవన్నీ ఎందుకు మాయమైపోయాయని ప్రశ్నించారు. ఇక్కడ రాజకీయాలు ప్రధానం కాదని, ఉన్నత స్థితికి వెళ్లిన రాష్ట్రంలో మళ్లీ ఈ దుస్థితి ఎందుకు తలెత్తుతోందని ప్రశ్నించారు. మిషన్ భగీరథ పథకం కింద తాగునీరెందుకు అందడం లేదని, ట్యాంకర్లు మళ్లీ ఎందుకు రోడ్లమీదకు వచ్చాయని నిలదీశారు. హైద్రాబాద్ నగరంలో తాము 20వేల లీటర్ల నీటిని ఉచితంగా అందిస్తే ఈ ప్రభుత్వం మళ్లీ నీటి బిల్లులు వసూలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్తు వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తాము రూ.35 వేల కోట్లు ఖర్చుచేశామని కేసీఆర్ పేర్కొన్నారు. న్యూయార్క్, లండన్‌లలో కరెంటు పోయినా హైదరాబాద్‌లో రెప్పపాటు సమయం కూడా కరెంటు పోని స్థితికి తెచ్చామన్నారు. టెక్నోక్రాట్స్‌తోనే విద్యుత్తు వ్యవస్థను నడిపామని, ఈ ప్రభుత్వం వచ్చాక వారి స్థానంలో ఐఏఎస్‌లను నియమించిందని, విద్యుత్ వ్యవస్థను సమర్థంగా నడిపేందుకు మంత్రులకు, ఐఏఎస్‌లకు తీరికలేకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని మండిపడ్డారు. రైతుబంధు డబ్బులను 10, 12 రోజుల్లో రైతుల ఖాతాల్లో వేశామని, ఇప్పుడు మూడెకరాలని, అయిదెకరాలని రైతులను ఒత్తిళ్ల గురిచేసి ఎంతకాలం సాగదీస్తారని ప్రశ్నించారు.

రైతుల పక్షాన గొంతు విప్పుతున్నా..

కాంగ్రెస్ నేతలు అడ్డగోలు సొల్లు పురాణాలతో అధికారంలోకి వచ్చారని కేసీఆర్ ఆరోపించారు. నాలుగో నెల కావస్తోందని, ఇప్పుడు రైతుల పక్షాన, ప్రజల పక్షాన తన గొంతు విప్పుతున్నానని అన్నారు. వ్యవసాయం రంగంపై కనీస సమీక్ష నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వమని దుయ్యబట్టారు. తాము రాజకీయాల కోసం రాలేదని, ఇది రైతుల బాధ అని చెప్పారు. రైతులను ఆదుకొనేంతవరకు మంత్రులను, ఎమ్మెల్యేలను నిలదీస్తామన్నారు. బీఆర్ఎస్ దళాలు ఇప్పటికే గ్రామగ్రామాన తిరుగుతున్నాయని, రైతుల బాధలు తెలుసుకుంటున్నాయని చెప్పారు. చీప్ ట్రిక్కులతో అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, సీపేజీ వాటర్ లీక్ అయ్యేచోట లంగ కథలు అల్లి డ్రామాలు చేస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. గోదావరిలో పిల్లర్ల కింద ఇసుక కొట్టుకుపోతే దానికి చిల్లర కథలు అల్లుతున్నారని, అప్పుడప్పుడు ఇంజనీర్ల తప్పిదాలతో ఇలాంటివి జరుగుతుంటాయని పేర్కొన్నారు. రైతులు అరిగోస పడుతున్నారని, ఈ ప్రభుత్వానికీ ఇది మంచిది కాదని హితవు పలికారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారని, డిసెంబరు 9 వెళ్లిపోయి ఎన్నిరోజులైందో సీఎంకు గుర్తుందా? అని నిలదీశారు. "రైతులు వారి ఇబ్బందులను మాతో చెప్పవద్దని కాంగ్రెస్ నేతలు బెదిరించారట. సోషల్ మీడియాలో సమస్యలను ప్రస్తావించే యువకులను పోలీసులు బెదిరిస్తున్నారు. పోలీసులు పరిమితుల్లో ఉండడం మంచిది. మా ప్రభుత్వంలో మేం ఇలాగే చేస్తే ఈ ప్రభుత్వం వచ్చేదా?" అని కేసీఆర్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈ నెల 2న కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. 6న నియోజకవర్గ కేంద్రాల్లో దీక్ష చేయాలన్నారు.

ఈ ప్రభుత్వంలో కరెంటు వస్తా పోతా ఉంటది

సూర్యాపేటలో కేసీఆర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సమయంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగింది. దీంతో, "ఈ ప్రభుత్వంలో ఇలా కరెంటు వస్తా, పోతా ఉంటది. కరెంటు కోతలని ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం" అంటూ వ్యాఖ్యానించారు. అయితే విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగిందనే ప్రచారం అవాస్తవమని సూర్యాపేట ఎస్ఈ పాల్‌రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ ప్రెస్‌మీట్ కోసం బీఆర్ఎస్ కార్యాలయం బయట టెంట్లు వేశారని, 125 కేవీఏ డీజిల్ జనరేటర్ ద్వారా విద్యుత్తు వినియోగం జరిగిందని తెలిపారు. మైక్ కనెక్షన్‌లో చిన్న సమస్య ఉండడం వల్ల 22 సెకన్లు మైకులు పని చేయలేదని, దానిని ఎలక్ట్రీషియన్ వెంటనే సరిచేశాడని తెలిపారు.

కేసీఆర్ వాహనం తనిఖీ

కొడకండ్ల/జగదేవ్‌పూర్: కేసీఆర్ సూర్యాపేట జిల్లా పర్యటనకు వెళ్లే క్రమంలో మొండ్రాయిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు ఆయన వాహనాన్ని తనిఖీ చేశారు. కాగా, ఉదయం ఎర్రవల్లిలోని ఫాంహౌస్ నుంచి బయలుదేరిన కేసీఆర్‌కు బాల్యమిత్రుడు జహంగీర్ దట్టీ కట్టారు.


సూర్యాపేట జిల్లా వెలుగుపల్లిలో రైతుతో కేసీఆర్

అధైర్య పడకండి.. అండగా ఉంటా

పంటలు ఎండిన రైతులు ఎవరూ ధైర్యం చెడవద్దని, వారికి అండగా ఉంటానని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని ధరావత్‌తండాలో ఎండిపోయిన వరి పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేసీఆర్ వద్ద రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. అప్పులు తెచ్చి పంటలు సాగు చేశామని, కాలువల ద్వారా నీరు రాకపోవడం, బోర్లు ఎండిపోవడం వల్ల పంటంతా ఎండిపోయిందని వివరించారు. అంగోతు సత్తెమ్మ అనే మహిళా రైతు.. తాను 6 ఎకరాల్లో వరి నాటు వేశానని, ఉన్న ఒక్క బోరూ ఎండిపోవడం వల్ల పంటంతా ఎండిపోయిందని చెప్పారు. దీంతో నెల క్రితం రూ.2 లక్షలు వెచ్చించి నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 4న తన కొడుకు రాజేందర్ పెళ్లి ఉందని, ఇదే సమయంలో పంట ఎండిపోయాయని, బోర్లు వేసినందుకు రూ.2 లక్షలు అప్పులు అయ్యాయని కేసీఆర్‌కు తెలిపారు. దీంతో కేసీఆర్ స్పందించి సత్తెమ్మ కొడుకు పెళ్లి ఖర్చుల కోసం రూ.5 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామంలో ఎండిన పంట పొలాలను కేసీఆర్ పరిశీలించారు. ఎండిపోయిన వరి చేనులో గొర్రెలను మేపుతున్న దయ్యాల వెంకటనారాయణ పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. యాసంగి సాగు మొదట్లోనే కాల్వల్లోకి నీరు వదలకుండా ఉంటే తాము వరి సాగుచేసే వాళ్లంకాదని అన్నారు. నాటు వేసి పెట్టుబడులన్నీ పెట్టాక ప్రభుత్వం కాల్వలకు నీరు ఇవ్వకుండా నిలిపివేయడంతో పంట పూర్తిగా ఎండిపోయిందన్నారు. పొలాల్లో ఎండిన వరిని కట్టలు కట్టి తెచ్చి కేసీఆర్‌కు చూపించగా.. రైతులను కేసీఆర్ ఓదార్చారు. కేసీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, ఎంపీలు సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు. కాగా, ముందుగా నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం.. నల్లగొండ జిల్లా నిడమనూరులోనూ కేసీఆర్ పర్యటించాల్సి ఉండగా.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, విలేకరుల సమావేశంలో మాట్లాడుటప్పటికి సాయంత్రం కావడంతో ఆ పర్యటన రద్దయింది. సాయంత్రం 6 గంటలకు కేసీఆర్ తిరిగి రోడ్డు మార్గంలో ఎర్రవల్లికి వెళ్లారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

» గత ప్రభుత్వం దృష్టంతా అభివృద్ధిపైనే

» రేవంత్‌లా కేసుల వైపు వెళ్లలేదు: హరీశ్

కామారెడ్డి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ నేతలే టార్గెట్‌గా చేసుకుని కేసులు పెట్టాలనే ఆలోచనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉంది. అవినీతి, అక్రమాల పేరుతో మా పార్టీ నేతలను ప్రభుత్వం భయపెట్టే ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకు ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలే నిదర్శనం. అక్రమ కేసులపై బీఆర్ఎస్ భయపడే ప్రసక్తే లేదు. ఇలాంటివి ఎన్నో చూశాం. ఉద్యమ పార్టీగా అన్నింటినీ ఎదుర్కొంటాం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి, అక్రమాల పేరుతో కేసీఆర్‌పై బురద జల్లే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాలపైనే దృష్టి సారించిందని, రేవంత్‌రెడ్డిలాగ ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టలేదని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించకుండా ప్రతిపక్షాలను బ్లాక్‌మెయిల్ చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు సోషల్ మీడియాలో లీక్‌ల న్యూస్‌లు ఇస్తూ, ఫేక్ వార్తలు రాయిస్తూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ మారిన కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లు వెంటనే రాజీనామా చేయాలని, స్పీకర్ వారిపై అనర్హత వేటు వేయాలన్నారు. కాంగ్రెస్ వచ్చింది.. కరువు తీసుకువచ్చిందని, కనీసం తాగు నీరు అందించలేకపోతున్నారని, రైతుల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో 280 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఈ ప్రభుత్వం త్వరలోనే కూలిపోవడం ఖాయమన్నారు. పదేళ్లలో దేశానికి బీజేపీ కూడా చేసిందేమీ లేదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని, బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, ఎల్లారెడ్డి నియోజకవర్గం లింగంపేట మండల కేంద్రంలో సాగునీరందక ఎండిన పంటలను ఎమ్మెల్యేలు హరీశ్ రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డిలు ఆదివారం పరిశీలించారు. రైతులను పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.


నిజామాబాద్ జిల్లా లింగంపేటలో పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్ రావు, పోచారం

నష్టపోయిన రైతులను మీరెప్పుడైనా ఆదుకున్నారా?

నాడు పరిహారం ప్రకటించి.. నయా పైసా ఇవ్వలేదు.. కేసీఆర్.. మీ వ్యక్తిత్వాన్ని చంపుకోవద్దు

» ఎంత నిక్కృష్టుడైనా కరువును రాజకీయం కోసం వాడుకుంటారా?

» ఏ మొహం పెట్టుకొని రైతుల వద్దకు వెళ్తున్నావు?: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): "కేసీఆర్.. ఓ మిత్రుడిగా నేను మీకిచ్చే సలహా.. తెలంగాణ ప్రజల్లో అంతో ఇంతో మిగిలి ఉన్న మీ వ్యక్తిత్వాన్ని చంపుకోవద్దు. ఎంత నిక్కృష్టుడైనా కరువు, వర్షాభావ పరిస్థితులను రాజకీయం చేయడానికి వాడుకోడు. మీ హేయమైన చర్యలతో మీ వ్యక్తిత్వాన్ని హననం చేసుకోవద్దు. గతంలో మీరు చేసిన నిర్వాకాలన్నింటినీ ఇప్పటి ప్రభుత్వం మీద నెట్టివేస్తామంటే కుదరదు. మీరుచేసే విష ప్రయోగాలను తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఏమాత్రం హర్షించరు. మీ పదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు చేసి.. రైతులు సహా అన్ని వర్గాలను మోసం చేసి ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని రైతుల వద్దకు పరామర్శకు వెళ్తున్నావు? ప్రకృతి వైపరీత్యాలను ప్రభుత్వ వైఫల్యంగా చూపాలని ప్రయత్నించే నీచమైన ప్రవృత్తి ప్రధాన ప్రతిపక్షానికి ఉండకూడదు. మీ పాపాలను ఈ వంద రోజుల ప్రభుత్వానికి రుద్దాలనుకోవటం మీ నీచమైన బుద్ధికి నిదర్శనం. గోదావరి వరదలతో సర్వస్వం కోల్పోయిన రైతులకు వేయి కోట్ల రూపాయలు ఇస్తామని సీఎం హోదాలో ప్రకటించి.. వేయి పైసలైనా ఇచ్చారా? మీ(బీఆర్ఎస్) పాలనలో ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ఎప్పుడైనా ఆదుకున్నారా? గత అసెంబ్లీ ఎన్నికలముందు రూ.10 వేల పరిహారం ప్రకటించి.. 2023 సెప్టెంబరు 21 తేదీన రూ.304 కోట్లకు జీవో నెంబరు- 24 జారీ చేసి నయాపైసా అయినా విడుదల చేశారా?" అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఫైర్ అయ్యారు. పంటలు ఎండిపోయిన ప్రాంతాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పర్యటించిన నేపథ్యంలో.. ఆదివారం మంత్రి తుమ్మల ఓ ప్రకటన విడుదల చేశారు.



మీ మాటలను ప్రజలు నమ్మరు

నాగార్జునసాగర్‌లో నీళ్లులేని కారణంగా మొదటి పంటకే నీళ్లివ్వని మీ ప్రభుత్వం.. ఇప్పుడు రెండో పంటకు నీళ్లివ్వాలని హేతుబద్ధత లేని డిమాండ్ చేయటం మీ దుర్బుద్ధికి తార్కాణం కాదా? అనుమతులు లేకుండా, అధికారులు చెబుతున్నా వినకుండా, పక్క రాష్ట్రాలు నీటిని తరలిస్తున్నా కళ్లు మూసుకొని రిజర్వాయర్లు ఖాళీ చేయించిన ప్రబుద్ధులు మీరు కాదా? నీటి నిర్వహణపై కనీస దృష్టి పెట్టకుండా మంచినీటి కోసం పక్క రాష్ట్రాలను అభ్యర్థించాల్సిన పరిస్థితిని ఈ రాష్ట్రానికి తీసుకొచ్చింది మీరు కాదా? రైతుబంధు పథకం పేరుతో విత్తనాల సబ్సిడీ, ఇన్‌పుట్ సబ్సిడీ, యాంత్రీకరణ పథకం, డ్రిప్ స్ప్రింక్లర్ల మీద సబ్సిడీలు ఎత్తివేసి.. చిన్న, సన్నకారు రైతులను కోలుకోకుండా దెబ్బతీసింది మీరు కాదా? మీరు పలికే మాయమాటలు నమ్మడానికి తెలంగా ప్రజలు సిద్ధంగాలేరు. పంటల బీమా పథకాన్ని ఎత్తివేసి.. అంతకంటే గొప్ప పథకాన్ని తెస్తామని ప్రగల్భాలు పలికి రైతుల నోట్లో మట్టి కొట్టింది మీరు కాదా? కేంద్ర ప్రభుత్వ పథకాలైన రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, సాయిల్ హెల్త్ మేనేజ్‌మెంట్, జాతీయ ఉద్యాన పథకం లాంటి అన్ని పథకాలకు మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వకుండా.. ఏ ఒక్క పథకం అమలు చేయకుండా రైతుల ఉసురు పోసుకున్నది మీరు కాదా? అని కేసీఆర్‌ను తుమ్మల ప్రశ్నించారు.

మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి కారకులు మీరుకాదా?

ఉచిత విద్యుత్ పేరుమీద అధిక ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేసి వేల కోట్ల భారాన్ని రాష్ట్రంపై మోపి.. మీరు కోరుకున్న కంపెనీలకు ప్రయోజనం చేకూర్చిన మాట వాస్తవం కాదా? విద్యుత్ ప్రాజెక్టుల్లో కమీషన్లకు కక్కుర్తిపడి రాష్ట్రాన్ని గుదిబండలా మార్చింది మీరుకాదా? కాళేశ్వరం-మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి కారకులు మీరుకాదా? పంపులు, మోటార్ల కంపెనీలకు వేల కోట్లు దోచిపెట్టి, కమీషన్లు దండుకొని రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించింది మీరు కాదా? ధాన్యం కొనుగోళ్లు, ధరణి, గొర్రెలు, చేప పిల్లల పంపిణీ, దళితబంధు, సీఎంఆర్ఎఫ్ పథకాల్లో గోల్‌మాల్ చేసింది మీరు కాదా? మీ కుటుంబమంతా అవినీతికి పాల్పడటంతో పాటు బరితెగించి కుటుంబ సభ్యులు కూడా ఫోన్లు మాట్లాడుకునే పరిస్థితి లేకుండా నిక్కృష్టమైన ఫోన్ ట్యాపింగ్ చేయించిన మీరు ఏ మొహం పెట్టుకొని ప్రజల్లోకి వస్తున్నారు? అని మంత్రి తుమ్మల కేసీఆర్‌ను నిలదీశారు. పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించి రూ.2,500 కోట్ల ప్రీమియం రైతుల తరఫున రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి ప్రకృతి వైపరీత్యాల సమయంలో అండగా ఉంటుందని తుమ్మల ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రైతులను కాదు.. మీ కూతుర్ని ఓదార్చండి

» ధరావత్ తండా ఏమైనా పర్యాటక ప్రాంతమా?

» కేసీఆర్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వ్యాఖ్యలు

పాలకుర్తి, మార్చి 31: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పొలం బాట పేరిట పంటలను పరిశీలించే బదులు లిక్కర్ దందాలో చిక్కుకొని తిహాడ్ జైలులో ఉన్న ఆయన కూతురు కవితను ఓదార్చితే బాగుంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే ఎం. యశస్వినిరెడ్డి సూచించారు. ఆదివారం పాలకుర్తిలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని ధరావత్‌తండాలో బీఆర్ఎస్ నాయకులు పర్యటించారని, అదేమైనా పర్యాటక ప్రాంతమా? అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు. "పది రోజుల క్రితం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వారం రోజుల క్రితం మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇప్పుడు మాజీ సీఎం కేసీఆర్.. ఇలా ఒకరి తర్వాత మరొకరు ఈ ప్రాంతానికి వస్తున్నారు. అది ఏమైనా పర్యాటక ప్రాంతమా? లేక అక్కడ సినిమా షూటింగ్‌లు చేస్తున్నారా? అలా అయితే దానిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం" అంటూ ఎమ్మెల్యే యశ్వసినిరెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతాంగాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆదుకుంటారని చెప్పారు.


పాలకుర్తిలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి

వంద రోజులకే కరువు కాలం

» రైతులను పట్టించుకోరా?: నామా, పువ్వాడ

ఖమ్మం, మార్చి 31(ఆంధ్రజ్యోతిప్రతినిధి): కాంగ్రెస్ పాలనలో వంద రోజులకే కరువుకాలం కనిపిస్తోందని బీఆర్ఎస్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. తాగు, సాగునీటి కోసం ప్రజలు ఇబ్బదులు ఎదుర్కొంటున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎంపీలు నామా, వద్దిరాజుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బృందం ఆదివారం ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌ను పరిశీలించింది. అనంతరం నేలకొండపల్లి మండలంలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. అనంతరం ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతునా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో జలాశయాలన్నీ కళకళలాడాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కరువు కనిపిస్తోందన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా సాగునీటి సమస్య గురించి పట్టించుకోవటం లేదని, తక్షణం పాలేరు రిజర్వాయర్ నింపాలని వారు డిమాండ్ చేశారు.


పద్మారావుకు మద్దతుగా అంబర్‌పేటలో ప్రచారం చేస్తున్న కేటీఆర్

సికింద్రాబాద్ బీఆర్ఎస్‌దే

» ఈ ఎన్నికల్లో కిషన్ రెడ్డి ఓటమి ఖాయం: కేటీఆర్

» పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అంబర్‌పేట పాదయాత్రలో వినతి

అంబర్‌పేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గత ఐదేళ్లలో చేసిందేమీలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన ఆయన.. హైదరాబాద్‌కు గానీ తెలంగాణకు గానీ ప్రత్యేకంగా తీసుకొచ్చిన అదనపు ప్రాజెక్టుగానీ, ఒక్క రూపాయి అదనపు నిధులుగానీ ఏమీలేవని విమర్శించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రజల చేతిలో ఆయన తిరస్కరణకు గురయ్యారని, అదృష్టవశాత్తు గత ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి ఎంపీగా గెలిచారన్నారు. గెలిచాక అటు అంబర్‌పేట నియోజకవర్గానికి గానీ, లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోగానీ చేసిన అభివృద్ధి శూన్యమని చెప్పారు. కిషన్‌రెడ్డికి దమ్ముంటే గత ఐదేళ్లలో తీసుకొచ్చిన నిధులు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందుంచి ఈ ఎన్నికల్లో ఓట్లడగాలని కేటీఆర్ సవాల్ విసిరారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఈసారి ఆయన ఓటమి ఖాయమని, ఈ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందన్నారు. సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు మద్దతుగా అంబర్‌పేట నియోజకవర్గంలో కేటీఆర్ ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. అంబర్‌పేటలోని పటేల్‌నగర్ ప్రాంతం ప్రేమ్‌నగర్ చౌరస్తా నుంచి ఆజాద్ నగర్, పటేల్ వాడల్లో ఇంటింటికీ తిరిగి పద్మారావును గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పటేల్ నగర్ ప్రాంత వాసులు కేటీఆర్‌తో ముచ్చటించారు. పదేళ్లలో హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి పద్మారావుకు మద్దతివ్వాలని కేటీఆర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గెలిచాక ఢిల్లీకి పర్యటనలు చేసే నాయకులు కాకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే పద్మారావులాంటి వారు అవసరమన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్‌కు కంచుకోటగా మారిన రాజధానిలో ఈసారి కూడా గులాబీ జెండా ఎగురుతుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తంచేశారు. పాదయాత్రలో భాగంగా మిర్చి బండి, కిరాణా దుకాణాల నిర్వాహకులతో కేటీఆర్ కాసేపు మాట్లాడారు.

నేడు నల్లగొండలో బీఆర్ఎస్ సమావేశం

» కేటీఆర్ రాక.. ముషంపల్లిలో పంటల పరిశీలన

నల్లగొండ, మార్చి 31: నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం సోమవారం ఉదయం 11గంటలకు జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సమావేశానికి నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడ, కోదాడ, హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, జిల్లా, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు పాల్గొనున్నారు. కాగా, సమావేశం అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు నల్లగొండ మండలం ముషంపల్లిలో ఎండిన పంట పొలాలను కేటీఆర్ పరిశీలించనున్నారు.

‘మహా’ ఖజానా ఖాళీ!

కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని స్థితిలో హెచ్‌ఎండీఏ

- ఏడాది క్రితం దాకా రూ.20 కోట్లతో ఖజానా కళకళ
- హెచ్‌ఎండీఏను ఏటీఎంగా మార్చుకున్న గత సర్కారు
- ప్లాట్లు, భూముల విక్రయాల తాలూకు రాబడి ప్రభుత్వానికే
- సుమారు రూ.20వేల కోట్లకు పైగా మళ్లింపు
- ఇదే కొనసాగితే ఉద్యోగులకు వేతనాలివ్వలేని దుస్థితికి



హైదరాబాద్ సిటీ, మార్చి31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) ఖజానా వెలవెల బోతుంది. ఏడాది క్రితం దాకా కాసులతో గలగలలాడిన హెచ్‌ఎండీఏ, ప్రస్తుతం వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితికి చేరుకుంది. దీనికి గత ప్రభుత్వం అనుసరించిన విధానాలే కారణమన్న విమర్శలున్నాయి. గత పదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నయా పైసా లబ్ధి పొందని హెచ్‌ఎండీఏ రూ.20వేల కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చుకుంది. అయితే హెచ్‌ఎండీఏ ఖజానాను గత ప్రభుత్వం ఏటీఎంగా మార్చుకొని, నిధులను మళ్లించడంతో ఖజానా ఖాళీ అవుతూ వచ్చింది. పైగా ప్లాట్లు, భూములు విక్రయించగా వచ్చిన ఆదాయమంతా హెచ్‌ఎండీఏకు కాకుండా రాష్ట్ర ప్రభుత్వమే మళ్లించుకుంది.. డ్రాఫ్ట్ లే అవుట్లు చేసి ప్లాట్లను విక్రయించగా వచ్చిన నిధులను వచ్చినట్లుగానే మళ్లించుకుంది. ప్రధాన ఆదాయమైన భవన నిర్మాణ, లే అవుట్ అనుమతులపై ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఇకముందూ కొనసాగితే ఉద్యోగులకు వేతనాలివ్వాలేని పరిస్థితి నెలకొంటుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు శివారులోని రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, యాదాద్రి, మెదక్, వికారాబాద్ జిల్లాల పరిధిలో మెరుగైన పట్టణ ప్రణాళికాభివృద్ధి పనులు చేపట్టేందుకు హెచ్‌ఎండీఏ ఏర్పడింది. హెచ్‌ఎండీఏ పట్టణ ప్రణాళిక విభాగమిచ్చే లే అవుట్, భవన నిర్మాణ అనుమతుల ద్వారా ఏటా రూ.600కోట్ల వరకు ఆదాయం వస్తుండగా, మూడు, నాలుగేళ్లుగా ప్లానింగ్ ద్వారా వచ్చే ఆదాయం రెట్టింపు స్థాయిలో వస్తోంది. ప్లాట్లు, భూముల అమ్మకం ద్వారా ఐదేళ్లలో అధిక ఆదాయం వచ్చింది. ఉప్పల్ భగాయత్‌తో పాటు హెచ్‌ఎండీఏ అధీనంలోని వివిధ ప్లాట్లను విక్రయించడం ద్వారా మూడేళ్లలో రూ.1380.5కోట్ల మేర హెచ్‌ఎండీఏకు ఆదాయం వచ్చింది. అందులో అత్యధికంగా ఉప్పల్ భగాయత్ నుంచే వెయ్యి కోట్లకు పైగా ఆదాయం హెచ్‌ఎండీఏ ఖజానాకు సమకూరింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2022 నుంచి 2023 సెప్టెంబరు దాకా కోకాపేట, బుద్వేల్, బాచుపల్లి, తొర్రూర్, బహదూర్‌పల్లి, కుర్మల్‌గూడ, తుర్కయాంజల్, మేడిపల్లి, షాబాద్ ఇలా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను లేఅవుట్లుగా ప్రకటించి పెద్దఎత్తున స్థలాలను విక్రయించింది. కేవలం కోకాపేట నియో పోలీసు లేఅవుట్ పనులు సాగుతున్న క్రమంలోనే 94 ఎకరాలను రెండు విడుతలుగా ప్లాట్లుగా విక్రయిస్తే రూ.5319కోట్ల ఆదాయం హెచ్‌ఎండీఏకు వచ్చింది.

ఆదాయమంతా ప్రభుత్వానికే

హెచ్‌ఎండీఏ డ్రాఫ్ట్ లే అవుట్‌ను ఆధారంగా చేసుకొని బుద్వేల్, మోకిలా, బాచుపల్లి, తొర్రూర్, బహదూర్‌పల్లి, కుర్మల్‌గూడ, తుర్కయాంజల్, మేడిపల్లి, షాబాద్ ఇలా ఆయా ప్రాంతాల్లో ప్లాట్లను విక్రయించగా, దాదాపు రూ.7వేల కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. అత్యధికంగా బుద్వేల్‌లో 100 ఎకరాల్లోని 14ప్లాట్ల ద్వారా రూ.3625.73కోట్లు హెచ్‌ఎండీఏకు సమకూరింది. మోకిలా, మేడిపల్లి, బాచుపల్లి తదితర ప్రాంతాల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన కొందరూ వ్యక్తులు చెల్లింపులు చేయలేదు. కోకాపేటతో సహా భూములు, ప్లాట్ల విక్రయం ద్వారా హెచ్‌ఎండీఏకు సమకూరిన దాదాపు రూ.13వేల కోట్ల ఆదాయమంతా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు అప్పట్లోనే మళ్లించారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటుకు అప్పగించిన సందర్భంలో వచ్చిన రూ.7380కోట్లు హెచ్‌ఎండీఏ ఖజానాకు చేరి మరుసటి రోజే రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు మళ్లించారు. మొత్తంగా సుమారు రూ.20వేల కోట్లకు పైగా ఆదాయం హెచ్‌ఎండీఏ ఖజానా నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి మళ్లించినట్లు సమాచారం

లే అవుట్ల అభివృద్ధికీ నిధులివ్వలేదు

హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేస్తున్న, అభివృద్ధి చేయాల్సిన లే అవుట్లకు నిధులు కరువయ్యాయి. డ్రాఫ్ట్ లేఅవుట్ల రూపొందించి ప్లాట్లను విక్రయించే సందర్భంలో హెచ్‌ఎండీఏ 16నెలల్లో లే అవుట్లను అభివృద్ధి చేస్తామని, ఫైనల్ లే అవుట్ తీసుకొస్తామని ప్రకటించింది. కానీ కోకాపేట, తొర్రూర్, బహదూర్‌పురా, కుర్మల్‌గూడ, గాజులరామారం, ఇన్ముల్‌నార్వా, తుర్కయాంజల్ లే అవుట్ అభివృద్ధి పనులు ఇంకా సాగుతున్నాయి. ఆయా లేఅవుట్లలో ప్లాట్ల కొనుగోలుదారులకు హెచ్‌ఎండీఏ ఇచ్చిన గడువు కూడా పూర్తయింది. కోకాపేట లేఅవుట్ అభివృద్ధి పనులు రూ.549కోట్లతో చేపట్టగా, ఇప్పటికీ 82శాతమే పూర్తయ్యాయి. ఇప్పటి వరకు రూ.419కోట్ల వరకు నిర్మాణ సంస్థకు చెల్లింపులు చేసినట్లు సమాచారం. మిగతా 28శాతం పనులు పూర్తవ్వడానికి మరో వంద కోట్ల మేర అవసరమున్నట్లు తెలిసింది. ఇలా ఇప్పటికే అభివృద్ధి పనులు ప్రారంభించిన మరో ఏడు ప్రాంతాల్లోని లేఅవుట్లు రూ.218కోట్లతో చేపట్టగా, తుర్కయాంజల్, గాజులరామారం, ఇన్ముల్‌నార్వాలో పనులు వంద శాతం పూర్తయ్యాయి. మిగిలిన మరో నాలుగు లేఅవుట్ల అభివృద్ధికి రూ.70కోట్ల వరకు నిధులు కావాల్సి ఉన్నట్లుగా తెలిసింది.

రూ.600కోట్లు ఉంటేనే ఆ లేఅవుట్ల అభివృద్ధి

ఇప్పటికే పనులు ప్రారంభమైన లే అవుట్లకు సుమారు రూ.170కోట్ల వరకు నిధులు అవసరం ఉండగా ఇంకా పనులు ప్రారంభమవ్వని లేఅవుట్లకు రూ.430కోట్ల మేర నిధులు అవసరం. ఇటీవల బుద్వేల్, మోకిల లే అవుట్ల అభివృద్ధి కోసం టెండర్ ప్రక్రియను హెచ్‌ఎండీఏ చేపట్టింది. ఓ ప్రముఖ సంస్థకు పనులు అప్పగించిన్నట్లు తెలిసింది. దాదాపు రూ.3625కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయమిచ్చిన వంద ఎకరాల బుద్వేల్ లే అవుట్ అభివృద్ధికి నిధులు లేవన్నట్లుగా తెలిసింది. ఈ లేఅవుట్ అభివృద్ధి కోసం రూ.354కోట్లను హెచ్‌ఎండీఏ ఇంజనీరింగ్ అధికారులు అంచనాలేశారు. సాధారణంగా ఆయా లేఅవుట్లలో ప్లాట్లను విక్రయించగా వచ్చిన ఆదాయంలో డెవలప్‌మెంట్ నిధులను హెచ్‌ఎండీఏ ఖజానాలో పెట్టుకొని మిగతా నిధులను ప్రభుత్వానికి మళ్లించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా ఉన్న ఆదాయమంతా అవిరైనట్లుగా తెలిసింది. లేఅవుట్ల అభివృద్ధి కోసం నిధులు విదిల్చకుండా పూర్తిగా ప్రభుత్వానికి మళ్లించడంతో హెచ్‌ఎండీఏ ఖజానా వెలవెలబోతుంది. ఇప్పటికే సాగుతున్న లేఅవుట్ల అభివృద్ధి పనులకు, ఇంకా చేపట్టాల్సిన లేఅవుట్ల అభివృద్ధి పనుల కోసమే సుమారు రూ.600కోట్ల వరకు నిధులు కావాల్సి ఉన్నట్లు సమాచారం.

ఆర్‌ఆర్‌ఆర్ మార్గంలో మార్పులు!

(మొదటిపేజీ తరువాయి)



డీపీఆర్‌లోనూ మార్పులు చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. మరోవైపు ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం నిర్మాణానికీ కేంద్రం ఆమోదం తెలపడంతోపాటు డీపీఆర్ సమర్పించాలని జాతీయ రహదారుల సంస్థ.. తెలంగాణ విభాగం అధికారులను ఆదేశించింది. దాంతో ప్రస్తుతం దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి ప్లాన్ తయారవుతోంది. అయితే ఈ మార్గంలోనూ సాగు భూములు ఉండడంతో.. రైతులకు నష్టం వాటిల్లకుండా భూ సేకరణ చేసి అలైన్‌మెంట్ చేయాలని అధికారులకు సర్కారు సూచించినట్లు సమాచారం. తెలంగాణలో రీజినల్ రింగు రోడ్డును కేంద్ర ప్రభుత్వం రెండు భాగాలుగా (ఉత్తర, దక్షిణ) విభజించి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఉత్తర భాగాన్ని సంగారెడ్డి నుంచి నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగదేవ్‌పూర్, ప్రజ్ఞాపూర్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వరకు 158.64 కిలోమీటర్లు నిర్మిస్తారు. దక్షిణభాగం.. చౌటుప్పల్ నుంచి ఆమనగల్లు, షాద్‌నగర్, చేవెళ్ల మీదుగా సంగారెడ్డి వరకు 189 కిలోమీటర్ల పొడవు నిర్మాణం కానుంది. ఇందులో ముందుగా ఉత్తర భాగం నిర్మాణానికి కేంద్రం అనుమతినివ్వడం, అలైన్‌మెంట్ ఖరారు కావడంతో పాటు చాలావరకు భూసేకరణ పూర్తయింది. మరికొంత భూమిని సేకరించాల్సి ఉంది.

రాయగిరి ప్రజల ఆందోళనలతో..

యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాయగిరి ప్రాంత ప్రజలు ఆర్‌ఆర్‌ఆర్‌కు తమ భూములు ఇవ్వబోమంటూ ఆందోళనలకు దిగుతున్నారు. వారికి అప్పుడు ప్రతిపక్ష కాంగ్రెస్ తరఫున భువనగిరి ఎంపీగా ఉన్న ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మద్దతుగా నిలిచారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాయగిరి ప్రాంతంలో ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌లో మార్పులు చేయిస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ కూడా ఇచ్చారు. ఈ నెల 29న మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి దృష్టికి విలేకరులు ఈ విషయాన్ని తీసుకెళ్లగా.. అలైన్‌మెంట్‌లో మార్పులు చేస్తామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తాను మంత్రి అయ్యాక కూడా చెప్పానన్నారు. దీంతో ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగంలో అలైన్‌మెంట్‌లో మార్పులుంటాయని స్పష్టమైంది. వాస్తవానికి రాష్ట్రానికి రీజినల్ రింగు రోడ్డు మంజూరై, దాని పూర్తి దూరం, ఏయే ప్రాంతాల మీదుగా వెళ్లనుందనే వివరాలు వచ్చినప్పుడే ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు, ఇతర జిల్లాల్లోనూ పలు ప్రాంతాల రైతులు ఆ రహదారికి భూములు ఇవ్వబోమని చెప్పారు. దాంతో అప్పటి పరిస్థితుల మేరకు ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. ఇందులో భాగంగా.. రాయగిరి మునిసిపాలిటీ ప్రాంతంలోనూ భూసేకరణ చేయాల్సి వచ్చింది.

కేంద్రాన్ని రాష్ట్రం ఒప్పించగలిగితే..

రాయగిరి పరిధిలో ఇప్పటికే ఎన్‌హెచ్-163 (హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి) నిర్మాణం, బస్వాపూర్ రిజర్వాయర్, కాలువల నిర్మాణంతోపాటు హైటెన్షన్ విద్యుత్తు లైన్‌కు రైతులు భూములు ఇవ్వాల్సివచ్చింది. మళ్లీ ఇప్పుడు రీజినల్ రింగు రోడ్డు కూడా రాయగిరి మీదుగానే వెళ్తుండడంతో.. దీని నిర్మాణానికి కూడా భూములు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే తాము ఇప్పటికే భూములను కోల్పోయామని, ఇక కోల్పోలేమని, ఉన్న భూములు కూడా ఇచ్చి ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. భూములు ఇవ్వబోమంటూ కోర్టుకు వెళ్లారు. అయితే ఉత్తర భాగం మార్గం నిర్మాణానికి అవసరమైన భూసేకరణ దాదాపు పూర్తవగా, భువనగిరి పరిధిలో నిలిచిపోయింది. ఇదే సమయంలో 'కాలా' (కాంపిటేటివ్ అథారిటీ ఆఫ్ ల్యాండ్ ఎక్విజేషన్) పూర్తి కాలేదు. జాతీయ రహదారుల సంస్థ ఒక్కసారి అలైన్‌మెంట్‌ను ఖరారు చేసిన తరువాత అందులో ఎలాంటి మార్పులుండవని అధికారులు చెబుతున్నా.. ఈ విషయంపై మార్చాల్సిన ఆవశ్యకతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వివరిస్తే మార్పునకు అవకాశం ఉంటుందని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

ఉత్తర భాగానికి త్వరలో ఎన్‌హెచ్ నంబరు

కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి ఉత్తర భాగం అలైన్‌మెంట్‌లో మార్పులు చేయిస్తే.. డీపీఆర్ లోనూ పలు మార్పులు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే డీపీఆర్ ఖరారైనందున.. ఒకవేళ అలైన్‌మెంట్ మారితే ఆ వివరాలను అందులో పొందుపరచాల్సి ఉంటుంది. మరోవైపు ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం డీపీఆర్‌లోనూ మార్పులు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నట్టు సమాచారం. కాగా, ఉత్తర భాగానికి సంబంధించి కేంద్రం ఇప్పటివరకు జాతీయ రహదారి నంబర్‌ను కేటాయించలేదు. గతంలో యుటిలిటీస్ చెల్లింపు అంశం, భూ సేకరణ వాటా చెల్లింపుల్లో జాప్యం కారణంగా నంబర్ కేటాయింపు జరగలేదు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ అంశాలపై దృష్టి పెట్టింది. ఇందుకోసం కేంద్రంతోనూ పలుమార్లు చర్చలు జరిపింది. ఈ నేపథ్యంలోనే యుటిలిటీస్ చార్జీలను కేంద్రమే భరిస్తామని హామీ ఇచ్చింది. భూసేకరణ వాటాను చెల్లించేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తామని కేంద్రానికి తెలిపింది. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన కేంద్రం.. ఉత్తర భాగం మార్గానికి త్వరలోనే జాతీయ రహదారి నంబర్‌ను కేటాయించనున్నట్టు సమాచారం.

కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి

కూతురు కావ్యతో కలిసి హస్తం గూటికి


కడియం శ్రీహరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దీపాదాస్ మున్షీ

హైదరాబాద్/వరంగల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. తన కుమార్తె కావ్యతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ.. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సీఎం రేవంత్‌తో కడియం శ్రీహరి కొద్దిసేపు చర్చలు జరిపారు. వరంగల్ ఎంపీగా శ్రీహరి బరిలోకి దిగితే బాగుంటుందని సీఎం సూచించగా.. తన కుమార్తె కావ్యకే టికెట్ ఇవ్వాలని, గెలిపించుకుని వస్తానని కడియం శ్రీహరి స్పష్టం చేసినట్లు తెలిసింది. దీనికి సానుకూలంగా సీఎం రేవంత్ స్పందించినట్లు సమాచారం. కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా సోమవారం ప్రకటించే అవకాశం ఉండగా.. ఇందులోనే కావ్య పేరు ఖరారు చేస్తారని తెలిసింది. అయితే, కడియం శ్రీహరిని పార్టీలో చేర్చుకోవడాన్ని వరంగల్ జిల్లాకు చెందిన ఓ మంత్రితోపాటు పలువురు ఎమ్మెల్యేలు తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిసింది. అయినప్పటికీ.. అనూహ్య పరిణామాల మధ్య కడియం శ్రీహరి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. శ్రీహరికి సహకరించాలని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు ఐక్యతగా పనిచేయాలని సూచించారు. పార్టీ విస్తృత ప్రయోజనాల దృష్ట్యా కొన్ని భరించాలని సూచించారు. కడియం కాంగ్రెస్‌లో చేరడం వల్ల ఎవరికీ, ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటానని భరోసా ఇచ్చినట్లు తెలిసింది. కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడాన్ని నిరసిస్తూ హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లో జన పోరాట సమితి నాయకుడు భరత్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మరోవైపు, వరంగల్ కాంగ్రెస్ ఎంపీ టికెట్‌ను కడియం కావ్యకు ఇవ్వొద్దని, మాదిగలకే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ మాదిగ సామాజిక వర్గ వేదిక ఆధ్వర్యంలో హనుమకొండ అంబేడ్కర్ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. కాగా, ఎమ్మార్పీఎస్ నేతలు కడియం ఇంటిని ముట్టడిస్తారన్న సమాచారంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, కడియం చేరికతో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య రెండుకు పెరిగింది. మరోవైపు.. మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి కూడా దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

తాగునీటి కొరతపై ఆరోపణలు సరికావు

- సమస్య రాకుండా అన్ని రకాల చర్యలు
- కేసీఆర్ వ్యాఖ్యలను ఖండించిన మంత్రి సీతక్క

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): "వేసవి నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు తాగునీటి కొరత రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు సరికావు. గత ప్రభుత్వం కంటే సమర్థంగా ప్రతీ ఇంటికి మంచినీటిని అందిస్తున్నాం" అని మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం సూర్యాపేటలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆమె ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తమ ప్రభుత్వానికి సూచనలు ఇస్తే తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అంతే తప్ప అర్థంపర్థం లేకుండా బురదజల్లే ఆరోపణలు చేయడం మంచిదికాదన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నప్పటికీ, రిజర్వాయర్లలో ఉన్న నీటిని గత ప్రభుత్వం కంటే సమర్థంగా సద్వినియోగం చేసుకొని తాగునీటి సమస్య రాకుండా చేస్తున్నట్లు తెలిపారు. పైపులైన్లలో లీకేజీలు జరిగితే కొద్ది గంటల్లోనే మరమ్మతు చేసి నీటి సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో చేసిన డిజైన్ లోపం వల్ల ఆదిలాబాద్ జిల్లా కెరమెరి ప్రాంతంలో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. కొత్త సర్కారు ఏర్పాటైన కొద్దిరోజుల్లోనే రూ.60 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసి డిజైన్ లోపాలను సరిదిద్దుతున్నట్లు తెలిపారు.

సీఎం ఓటమి భయంతో మాట్లాడుతున్నారు

- దొరసాని అన్నందుకు క్షమాపణ చెప్పాలి: డీకే అరుణ

మహబూబ్‌నగర్, మార్చి 31: పార్లమెంట్ ఎన్నికలకు ముందే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. సీఎంను అభద్రతాభావం వెంటాడుతోందని, అందుకే నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మహిళ అని కూడా చూడకుండా తనను దొరసాని అన్న రేవంత్, తనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మీ ఇంట్లో ఆడవాళ్ళను ఇలానే విమర్శిస్తే ఊరుకుంటారా అని ఆమె ప్రశ్నించారు. రేవంత్ ఇంకా ప్రతిపక్ష నాయకుడిలానే మాట్లాడుతున్నారని అన్నారు. తనను విమర్శిస్తానంటే చూస్తూ ఊరుకోబోమని అరుణ హెచ్చరించారు. తీరు మార్చుకోవాలని సీఎంకు సూచించారు. బలం లేకున్నా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని రెండొందల మెజారిటీతో గెలుస్తామని ఎలా చెబుతారని, ఓటుకు నోటు ఇచ్చి కాదా అని ప్రశ్నించారు. "నీతి నిజాయితీ గురించి ఏందీ నీవు మాట్లాడేది, బీఆర్‌ఎస్ వాళ్ళందరినీ పార్టీలో చేర్చుకోవడం లేదా" అని రేవంత్‌ను డీకే అరుణ నిలదీశారు.

రాజాసింగ్‌తో అభయ్‌పాటిల్, మహేశ్వర్‌రెడ్డి భేటీ

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అభయ్‌పాటిల్, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి.. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో ఆదివారం భేటీ అయ్యారు. రాజాసింగ్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంతో పాటు ఇతర సెగ్మెంట్లలో నిర్వహించాల్సిన ప్రచారంపై రాజాసింగ్‌తో చర్చించామని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. రాజాసింగ్ మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటుండంతో స్థానికంగా ప్రచారం నిర్వహించే అంశంపై చర్చించామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో 10-12 సీట్లు గెలుచుకుంటుందని మహేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు

మాదిగలకు మొండిచెయ్యే: మంద కృష్ణ

కాజీపేట జంక్షన్(హనుమకొండ), మార్చి 31: లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలను ఓట్లడిగే నైతిక హక్కును కాంగ్రెస్ కోల్పోయిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని హరిత కాకతీయ హోటల్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 3 ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానాలున్నాయని, దళితుల్లో 75 శాతం ఉన్న మాదిగలకు అందులో ఒక్క సీటు కూడా కాంగ్రెస్ కేటాయించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్క వరంగల్ స్థానాన్నైనా మాదిగలకు కేటాయిస్తారని అందరూ భావించారని, దాన్ని కూడా కడియం శ్రీహరి కూతురు కావ్యకు ఇప్పించి మాదిగలకు మొండిచేయి చూపించారని మండిపడ్డారు.

సైబర్ బానిసలు!

(మొదటిపేజీ తరువాయి)



చేయిస్తూ.. చేయనంటే కరెంటు షాకులతో దారుణంగా హింసిస్తున్న దందా ఇది. దాదాపు 5000 మంది భారతీయులు ఈ మాఫియా చేతికి చిక్కి.. రోజుకు 12 గంటలకు పైగా పనిచేస్తూ దుర్భరపరిస్థితుల్లో జీవితం గడుపుతున్నట్టు కంబోడియాలోని భారతీయ రాయబార కార్యాలయానికి ఇటీవలికాలంలో ఫిర్యాదులు అందాయి. దీంతో.. అక్కడున్న మనవారిని కాపాడి, ఇక్కడికి తీసుకొచ్చేందుకు కంబోడియా, భారతదేశ ప్రభుత్వాలు ఉమ్మడి ఆపరేషన్ చేపట్టాయి. ఈ విషయాన్ని మన విదేశాంగ శాఖ ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. "ఉద్యోగావకాశాల పేరుతో తమను ప్రలోభపెట్టి.. తీరా కంబోడియాకు తీసుకొచ్చాక సైబర్ నేరాలు చేయాలంటూ తమపై ఒత్తిడి తెస్తున్నారంటూ బాధితులు కంబోడియాలోని మా రాయబార కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. మీడియా కథనాల ద్వారా కూడా కంబోడియాలోని భారతీయుల దుస్థితి గురించి మా దృష్టికి వచ్చింది." అని విదేశాంగ శాఖ ఆ ప్రకటనలో వివరించింది. ఇప్పటిదాకా ఆ మాఫియా నుంచి 250 మంది భారతీయులను కాపాడి, మనదేశానికి తరలించినట్టు వెల్లడించింది. ఉద్యోగాల కోసం కంబోడియాకు వెళ్లి సైబర్ మాఫియా వలకు చిక్కిన మనోళ్ల పని.. అక్కణ్నుంచీ ఇక్కడికి ఫోన్ చేసి భారతీయులను మోసగించడమే. "మీకు ఫలానా దేశం నుంచి ఒక పార్శిల్ వచ్చింది. దాంట్లో మాదక ద్రవ్యాలు ఉన్నాయి (లేదా) అనుమానాస్పద వస్తువులు ఉన్నాయి. ఈడీ/సీబీఐ/ఐటీ అధికారులు మీ మీద నిఘా పెట్టారు. మీరు అర్జెంటుగా జరిమానా/పన్ను చెల్లించాలి. అలా చెల్లించకపోతే అధికారులు మిమ్మల్ని అరెస్ట్ చేస్తారు" అంటూ బెదిరించడమే. ఆ బెదిరింపులకు భయపడిన చాలా మంది.. వారు అడిగిన డబ్బులు చెల్లిస్తున్నట్టు నిత్యం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. ఇలా ఆ ముఠా.. గడిచిన ఆరు నెలల వ్యవధిలోనే మన భారతీయులను మన పైనే ప్రయోగించి అక్షరాలా 500 కోట్ల రూపాయలను అన్యాయంగా కాజేసినట్టు వెల్లడైంది.

మోసం ఇలా..

భారత ప్రభుత్వం ఈ ముఠా నుంచి కాపాడినవారిలో స్టీఫెన్ అనే వ్యక్తి ఉన్నాడు. ఈ దందా ఎలా జరుగుతోందో అతడు వివరంగా అధికారులకు తెలిపాడు. "నేను ఐటీఐ చేశాను. కరోనా సమయంలో ఉద్యోగాన్వేషణలో ఉంటే మంగళూరు నుంచి ఒక ఏజెంట్ నన్ను సంప్రదించాడు. కంబోడియాలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఉందని చెప్పాడు. సరేనన్నాను. నాతోపాటు.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాబూరావు అనే వ్యక్తిని కూడా కంబోడియాకు తీసుకెళ్లాడా ఏజెంటు. ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ సమయంలో.. మేం ముగ్గురం టూరిస్టు వీసా మీద వెళ్తున్నట్టు చెప్పాడు. అప్పుడే నాకు అనుమానం వచ్చింది. కానీ ఏమీ అనలేదు. కంబోడియాకు చేరుకున్నాక మమ్మల్ని ఒక ఆఫీసుకు తీసుకెళ్లాడు. అక్కడ మమ్మల్ని ఇంటర్వ్యూ చేశారు. అక్కడి బాస్ ఒక చైనీయుడు. వారు మా టైపింగ్ స్పీడ్‌ను పరీక్షించారు. కానీ.. మా ఉద్యోగం డేటా ఎంట్రీ కాదని.. నిత్యం ఫేస్‌బుక్ ప్రొఫైల్స్ చెక్ చేసి.. సైబర్ ఫ్రాడ్‌లకు లొంగిపోయే బలహీన మనస్తత్వం ఉన్నవారెవరో గుర్తించడమే మా ఉద్యోగమని ఆ తర్వాత తెలిసింది. మేం మహిళల పేరుతో, ఫొటోలతో ఫేక్ సోషల్ మీడియా ఖాతాలను తెరవాలి. డేటింగ్ యాప్స్ ద్వారా.. బలహీనులకు వలవేయాలి. వారు మా వలలో పడ్డాక క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతోనో, వారి పేరు మీద ఇండియాకి ఏవో వస్తువులను పంపిస్తున్నామనో ముగ్గులోకి లాగాలి. ఆ తర్వాత మరికొందరు రంగంలోకి దిగుతారు. వలలో పడ్డవారికి దర్యాప్తు ఏజెన్సీ అధికారుల పేర్లతో ఫోన్లు చేసి డబ్బులు పిండుతారు. ఈ దందా చేసేదంతా చైనీయులే" అని స్టీఫెన్ వివరించాడు. తమకు రోజువారీ లక్ష్యాలు విధిస్తారని.. ఆ లక్ష్యాలను అందుకోలేకపోతే శిక్ష విధిస్తారని.. టార్గెట్ సాధించేదాకా తిండి పెట్టకుండా, తమ గదికి వెళ్లి విశ్రాంతి తీసుకోనివ్వకుండా హింసిస్తారని వాపోయాడు. కంబోడియాకు వెళ్లి ఉద్యోగంలో చేరగానే వారి పాస్‌పోర్టులను సైబర్ ఫ్రాడ్ ముఠా తీసేసుకోవడంతో.. వారు అక్కణ్నుంచీ బయటపడడం కష్టమవుతోందని ఒడిశా పోలీసులు వివరించారు. సైబర్ నేరగాళ్లు చెప్పిన పని చేయడానికి మనవాళ్లు నిరాకరిస్తే వారిపై దాడి చేయడం, కరెంటు షాకులివ్వడం వంటి దారుణాలకు పాల్పడుతున్నారని.. వారిని ఒంటరిగా గదుల్లో బంధిస్తున్నారని ఈ కేసును దర్యాప్తు చేసిన ఒడిశా పోలీసు అధికారి ఉపాసన తెలిపారు. అక్కడ ఇలా చిక్కుకున్న భారతీయుల వివరాలను గుర్తించి వారిని వెనక్కి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆమె వివరించారు.

బాధితుడి ఫిర్యాదుతో..

కేంద్ర ప్రభుత్వ సీనియర్ ఉద్యోగి ఒకరు గత ఏడాది ఈ మాఫియా బారిన పడి రూ.67 లక్షలు పోగొట్టుకున్నారు. ఆయన ఫిర్యాదు మేరకు ఈ కేసును దర్యాప్తు చేసిన ఒడిశా పోలీసులు.. ఈ దందా అంతా కంబోడియా నుంచి జరుగుతున్నట్టు గుర్తించారు. ఉద్యోగాల పేరుతో ఇక్కణ్నుంచీ అక్కడికి మనోళ్లను తరలిస్తున్న ఎనిమిది మందిని గత ఏడాది డిసెంబరు 30న అరెస్టు చేశారు. ఆ ఎనిమిది మందీ ఒకే ప్రాంతానికి చెందినవారు కాదు. వారంతా దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందినవారు కావడం గమనార్హం. వారిచ్చిన సమాచారం ఆధారంగా ఒడిశా పోలీసులు మరో 16 మందిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఆ లుకౌట్ నోటీసుల ఆధారంగా ఇమ్మిగ్రేషన్ బ్యూరో అధికారులు.. కంబోడియా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న హరీశ్ కూరపాటి, నాగవెంకట సౌజన్య కూరపాటి అనే ఇద్దరిని ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నారు.

నేడు కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణ

జైల్లో వసతులు లేవనే విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లే చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైల్లో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో సోమవారం విచారణ జరగనుంది. తన చిన్న కుమారుడికి 11వ తరగతి పరీక్షలు ఉన్నాయని, ఈ సమయంలో కుమారుడికి తన అవసరం ఉందని, అందుకే ఏప్రిల్ 16 వరకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేశారు. అదే సమయంలో సాధారణ బెయిల్ పిటిషన్‌పైనా విచారణ చేపట్టాలని కోరారు. మద్యం పాలసీ కేసు విచారణలో ఉన్నదని, కవితకు బెయిల్ ఇస్తే, సాక్షులను ఆమె ప్రభావితం చేసే అవకాశం ఉందని, అందుకే బెయిల్ ఇవ్వొద్దని కోర్టుకు ఈడీ విజ్ఞప్తి చేసింది. వాదనలు విన్న న్యాయమూర్తి మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్ 1న వాదనలు వింటామని తెలిపారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మార్చి 15న హైదరాబాద్‌లో కవితను ఈడీ అరెస్టు చేసింది. మార్చి 16న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచింది. 10 రోజుల కస్టడీ ఇవ్వాలని ఈడీ కోరగా, ఏడు రోజుల కస్టడీకి న్యాయస్థానం అనుమతిచ్చింది. ఆ తర్వాత మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరగా, మూడురోజులకు అనుమతించింది. చివరగా కవితను మార్చి 26న ఈడీ అధికారులు న్యాయస్థానంలో హాజరు పరిచారు. కవితకు ఏప్రిల్ 9వ తేదీ వరకు జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. కాగా, మార్చి 26న 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ సందర్భంగా కొన్ని ప్రత్యేక వసతులు కల్పించాలని న్యాయమూర్తి కావేరీ బవేజాను కవిత కోరారు. దీంతో ఇంటి నుంచి భోజనం, దుస్తులు, ఆభరణాలు ధరించడం, సొంతంగా పరుపులు ఏర్పాటు చేసుకోవడం, దుప్పట్లు తెచ్చుకోవడం, చెప్పులు ధరించడం వంటి వెసులుబాట్లకు కోర్టు అనుమతిచ్చింది. అయినప్పటికీ తిహాడ్ జైలు అధికారులు వాటికి అనుమతివ్వడం లేదని కవిత తరఫు న్యాయవాది ఈనెల 28న మళ్లీ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం విచారణ సందర్భంగా కవిత తరఫున న్యాయవాదులు ఈ అంశాన్ని మరోసారి కోర్టు దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిసింది. ఒకవేళ మధ్యంతర బెయిల్ ఇవ్వని పక్షంలో జైల్లో ఆ వసతులు కల్పించేలా జైలు అధికారులకు ఆదేశాలివ్వాలని కోర్టును కోరే అవకాశముంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.